అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక
మంగళవారం 12-9-2023

సంపుటి : 9 సంచిక : 203 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

ముందస్తు అనుమతి అక్కర్లేదు

సీనియర్ అధికారులను సీబీఐ నేరుగా విచారించొచ్చు

- 2014 నాటి తీర్పును పునరుద్ఘాటించిన సుప్రీం



న్యూఢిల్లీ : సీనియర్ ప్రభుత్వ అధికారులపై వచ్చిన అవినీతి కేసులు దర్యాప్తు చేపట్టడానికి సీబీఐ ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరన్న నిబంధన చెల్లదని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. 2014లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునే ...11లో

నియంతృత్వ పాలన కోసమే

జమిలీ జపం



ప్రతిపక్షాల ఐక్యతతో నరేంద్ర మోడీకి ఓటమి భయం..

కులాన్ని సంహరిస్తేనే దేశానికి ప్రగతి

- నిజాంను కూల్చిన స్ఫూర్తితో బీజేపీని గద్దెదించేలా పోరాటాలు
- బీఆర్ఎస్‌కు, సాయుధ పోరాటానికి ఏం సంబంధం? : సంగారెడ్డిలో సాయుధ పోరాట వారోత్సవ సభలో బీవీ రాఘవులు




సంగారెడ్డిలోని వీరనారి ఐలమ్మ విగ్రహం నుంచి పీఎస్ఆర్ గార్డెన్ వరకు జరిగిన భారీ ర్యాలీ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఒకేసారి ఎన్నికలంటే అధ్యక్షతరహా పాలన తీసుకురావడమేనని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. స్థానిక సంస్థలు, రాష్ట్రాల అధికారాలను హరించి ఒకే వ్యక్తి నియంతృత్వ పాలన సాగించడం కోసమే మోడీ జమిలీ జపం చేస్తున్నారని విమర్శించారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సభకు రాఘవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని వీరనారి ఐలమ్మ విగ్రహం నుంచి పీఎస్ఆర్ గార్డెన్ ...2లో

కమ్యూనిస్టులే సాయుధ పోరాట వారసులు

వీర తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని రాఘవులు పునరుద్ఘాటించారు. నిజాం ప్రభువు లొంగిపోయినందునే సెప్టెంబర్ 17కు ప్రాధాన్యత సంతరించుకున్నదన్నారు. నిజాం లొంగిపోయేలా పోరాడిన కమ్యూనిస్టుల త్యాగాలను గుర్తించకుండా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి పార్టీలు తామేదో చేసినట్టు గొప్పలు చెప్పుకుంటున్నాయన్నారు. వెట్టి నుంచి ప్రజలను విముక్తి చేసి భూముల్ని పంచిన చరిత్ర కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు. దేశ సమైక్యతా దినంగా పాటిస్తున్నామని చెబుతున్న బీఆర్ఎస్ లేదా ఆ నాటి టీఆర్ఎస్‌కు సాయుధ పోరాటానికి ఏం సంబంధముందని ప్రశ్నించారు. వెట్టికి వ్యతిరేకంగా మట్టి మనుషులు సాగించిన వీరోచితమైన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి బీజేపీ మతం రంగు పులుముతుందన్నారు. నిజాం ముస్లింగా ప్రజలంతా హిందువులుగా చెబుతూ రాజకీయ లబ్దిపొందేందుకు అమిత్ షా ప్రయత్నిస్తున్నారని తెలిపారు.



ఆకలి అసమానతలకు పరిష్కారమేది?

కీలక అంశాల ప్రస్తావనే లేదు

- జీ-20 డిక్లరేషన్‌పై ప్రశ్నించిన పౌర సమాజం




న్యూఢిల్లీ : జీ-20 సదస్సు ఆమోదించిన డిక్లరేషన్‌లో కీలకమైన అంతర్జాతీయ అంశాల ప్రస్తావన లేకపోవడాన్ని పౌర సమాజ సంస్థలు ప్రశ్నించాయి. తీవ్ర ఆందోళన కలిగిస్తున్న ఆర్థిక అసమానతలు, వాతావరణ సంక్షోభం, ఆకలి, ఇంధనం వంటి కీలక సమస్యల పరిష్కారానికి సదస్సు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించలేకపోయిందని పెదవి విరిచాయి. పౌర సమాజ సంస్థలు, వాటి నేతలతో కూడిన అంతర్జాతీయ సంస్థ 'పీపుల్స్ 20' ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పౌర సమాజం ప్రాధాన్యత తగ్గిపోవడం, ప్రపంచంలోని పలు దేశాలలో ప్రజాస్వామ్యం బలహీనపడడంపై ఆ ప్రకటన ఆందోళన వ్యక్తం చేసింది. సౌదీ అరేబియా, రష్యా, తుర్కియే, మెక్సికో, భారత్ సహా పలు జీ-20 దేశాలలో ...11లో

జైల్లో బాబుకు ప్రాణహాని

ఏసీబీ కోర్టులో సిద్ధార్థ లూథ్రా వాదనలు

- పూర్తి భద్రత కల్పించామన్న ఏఏజీ సుధాకర్‌రెడ్డి
- తీర్పు నేటికి వాయిదా
- పిటి వారెంటు కోసం పిటీషన్ వేసిన సీఐడీ



అమరావతి : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ప్రాణహాని ఉందని అందువల్ల ఆయన్ను హౌస్ రిమాండ్‌కు పంపాలని న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సోమవారం ఏసీబీ కోర్టులో వాదించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో ఆయన చంద్రబాబు తరపున వాదిస్తున్న విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో కరుడుగట్టిన నేరస్తులు, ఆయుధాలు వినియోగించిన వ్యక్తులు శిక్ష అనుభవిస్తున్న విషయాన్ని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. నవలఖా కేసులో ...2లో



బీజేపీ ఓ విషసర్పం

ఉదయనిధి స్టాలిన్ విమర్శలు

చెన్నై : సనాతన ధర్మంపై ఇటీవల వ్యాఖ్యలు చేసిన డీఎంకే నేత, తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఈసారి బీజేపీ లక్ష్యంగా తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీని ఆయన విష సర్పంతో పోల్చారు. తమిళనాడులోని నైవేలీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష అన్నాడీఎంకే పాములకు ఆశ్రయమిచ్చే పార్టీగా మారిందని తెలిపారు. డీఎంకే నేత మాజీ కేంద్ర మంత్రి ఎ.రాజా ఇటీవల మాట్లాడుతూ ప్రధాని మోడీని పాముగా అభివర్ణించారు. ఈ నేపథ్యంలో ఉదయనిధి వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

"విష సర్పం మీ ఇంట్లోకి వస్తే.. దానిని తీసి బయట పడేస్తే కుదరదు. అది మీ ఇంటి చుట్టుపక్కల చెత్తలో దాక్కొంటుంది. ఆ చెత్తను తీసేసే వరకూ అది మీ ఇంట్లోకి వస్తూనే ఉంటుంది. ఈ సన్నివేశంతో ప్రస్తుత పరిస్థితి పోలిస్తే.. తమిళనాడు మన ఇల్లు. బీజేపీ ఓ విష సర్పం. అన్నాడీఎంకే మన ఇంటి వద్ద ఉన్న చెత్తలాంటిది. మనం చెత్తను తీసే వరకు విష సర్పం దూరం కాదు. బీజేపీని నుంచి విముక్తి పొందాలంటే.. అన్నాడీఎంకేను తొలగించాలి" అని ఉదయనిధి వ్యాఖ్యానించారు.

ఇటీవల 'తమిళనాడు ప్రొగ్రెసివ్ రైటర్స్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' నిర్వహించిన 'సనాతన నిర్మూలన' అనే సదస్సులో ఉదయనిధి మాట్లాడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనమివ్వాలి

ప్రభుత్వం స్పందించకుంటే 25 నుంచి నిరవధిక సమ్మె : తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)

- కోఠి కమిషనర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా
- హైదరాబాద్‌కు వస్తుండగా జిల్లాల్లో ఆశాల అరెస్టులు



హైదరాబాద్ కోఠి వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ కోఠి వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు అన్ని జిల్లాల నుంచి వేలాదిగా ఆశ వర్కర్లు తరలివచ్చారు. హైదరాబాద్‌కు వస్తున్న ఆశా వర్కర్లను జిల్లాల్లో పలుచోట్ల పోలీసులు అడ్డుకుని ముందస్తు అరెస్టులు చేశారు. కోఠి కమిషనర్ కార్యాలయంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ శ్రీనివాసరావుకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 28 వేల మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరూ రోగులను సర్వే చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్, అన్ని రకాల జబ్బులు గుర్తించి ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను అందిస్తున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడూ జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజాసేవ చేస్తున్నారని చెప్పారు. కరోనా నియంత్రణలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఇన్ని పనులు చేస్తున్న ఆశా వర్కర్లకు రూ. 9,750 పారితోషికం మాత్రమే వస్తోందని, ప్రభుత్వం వేతనం పెంచకపోవడం అన్యాయం అన్నారు. పని భారం పెరిగిందని, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో ...11లో



85 శాతం మెడికల్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే

- రాష్ట్ర విభజనకు ముందున్న కాలేజీల్లోనే ఏపీ విద్యార్థులకు స్థానికత : హైకోర్టు కీలక తీర్పు

వివరాలు 2లో..

ఉచిత సాఫ్ట్‌వేర్‌లో ఛాంపియన్

- అంతర్జాతీయ మోడల్‌గా స్కూల్ వికీ పోర్టల్
- ఇంటర్నెట్ కనెక్టివిటీలో ముందంజ
- కేరళపై యునెస్కో ప్రశంసలు

వివరాలు 11లో..



పూర్తి కాని ప్రాజెక్టును ప్రారంభిస్తారా?

సీఎం కేసీఆర్‌కు రేవంత్ ప్రశ్న



- ఒక్క పంపును ప్రారంభిస్తే ప్రాజెక్టు పూర్తయినట్టా?
- బీఆర్ఎస్ పాలనలో పాలమూరు వలసలు ఆగలేదు
- కాంగ్రెస్‌లో చేరిన సీతా దయాకర్‌రెడ్డి
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కాంగ్రెస్ నేత

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కాకుండానే ఆ ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆ ప్రాజెక్టుకు ఉన్న 31 పంపుల్లో కేవలం ఒక్క పంపుతోనే ఆ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నారని ...11లో



గోడలపై రాజకీయం

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వాల్ పోస్టర్ వార్

- మూడు రంగులపై గులాబీ రంగులు
- ఎన్నికలకు ముందే హోరాహోరీ ప్రచారం
- తమ పెయింటింగ్‌లను అధికారపార్టీ చేరిపేయిస్తున్నదని కాంగ్రెస్ ఆరోపణ
- సోషల్‌మీడియాపైనే ప్రధాన పార్టీల దృష్టి

ఖమ్మంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య వాల్‌పోస్టర్ల వార్ మొదలైంది. ఇరుపార్టీలు పోటాపోటీగా వాల్‌రైటింగ్స్ ప్రచారం మొదలుపెట్టాయి. విచ్చలవిడిగా స్టిక్కింగ్ ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. ఎన్నికలకు ముందు నుంచే ఇరుపార్టీలు హోరాహోరీగా ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. గోడలపై ఉన్న కాంగ్రెస్ వాటర్ పెయింట్‌లను చెరిపి వేసి 'గులాబీ' రంగులను పులుముతున్నారు. కార్పొరేషన్ సిబ్బంది మూడు రంగులను తొలగించి వెళ్లగానే గులాబీ కార్యకర్తలు అదేస్థానంలో మంత్రి పువ్వాడ అజయ్ పేరుతో ఫ్లెక్సీలను స్టిక్ చేస్తున్నారు. కానీ వీటి జోలికి కార్పొరేషన్ సిబ్బంది వెళ్లకపోవడం గమనార్హం. నగరంలోని పలు డివిజన్‌లలో నాలుగైదు రోజులుగా ఇదో తంతుగా కొనసాగుతోంది.

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మంలో చేసిన పలు అభివృద్ధి పనుల దృశ్యాలతో కూడిన స్టిక్కింగ్ ఫ్లెక్సీలను బీఆర్ఎస్ రూపొందించింది. 'మన ఖమ్మం.. మన అజయన్న' పేరుతో తయారు చేసిన ఈ పోస్టర్లను ఇటీవల అతికిస్తోంది. అభివృద్ధి పేరుతో రూపొందించిన ఈ ఫ్లెక్సీల జోలికి కార్పొరేషన్ సిబ్బంది వెళ్లడం లేదు. కాంగ్రెస్ వాటర్ పెయింట్‌లను మాత్రం తొలగిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. అభివృద్ధి దృశ్యాలు ఉన్నాయి కాబట్టి ...11లో

బీజేపీ-ఆర్ఎస్ఎస్ హటావో..

దేశంలో మహిళల భద్రతకు ముప్పు

- అన్నార్తుల వ్యథలను తీర్చలేని దైన్యం
- ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యం
- మోడీ పాలనలో నిరుద్యోగ తాండవం
- ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలకు నిరసనగా..అక్టోబర్ 5న ఛలో ఢిల్లీ :

ఎస్ పుణ్యవతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కేంద్రంలోని మోడీ సర్కార్ మహిళా వ్యతిరేక దురహంకారాన్ని ప్రదర్శిస్తున్నదని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ నేత ఎస్ పుణ్యవతి విమర్శించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్ష, ఉపాధ్యక్షులు అరుణజ్యోతి, కేఎన్ ఆశాలత, బి హైమావతితో కలిసి ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. 'బీజేపీ ఆర్ఎస్ఎస్ హటావో..మహిళా బచావో' నినాదంతో వచ్చే నెల 5న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలి పారు. వేలాది మంది మహిళలు దేశవ్యాప్తంగా మహార్యాలీకి ఇప్పటికే సమాయత్తమవు తున్నట్టు తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల పై దారుణమైన హింస కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రక్షణకోసం పనిచేయాల్సిన చట్టాలు ఉద్దేశ పూర్వకంగానే నీరుగార్చబడు తున్నాయన్నారు. పురుషాం కారంతో మహిళలపై లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడ్డవారు ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నా రనీ, వారికి చట్టాలు దాసోహమంటున్నాయని విమర్శిం చారు. రోజురోజుకు పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మహిళలు సంఘటితంగా పోరుబాట పట్టాల్సిన అవశ్యకత ఏర్పడిందని తెలిపారు.

అటకెక్కిన ఉజ్వల పథకం

మరోపక్క దేశంలో ఆకలి చావులు పెరుగుతున్నా యన్నారు. దారిద్ర్యాన్ని మరింత పెంచే విధంగా మోడీ పాలనా విధానాలున్నా యన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ క్రమంగా నిర్వీర్యం అవుతున్నదని చెప్పారు. పేదలకు ఇవ్వాల్సిన సబ్సిడీల్లో కోతలు విధిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ బండలు ఉచితంగా ఇస్తామంటూ నమ్మబలికి..మాట తప్పారని తెలిపారు. ఉజ్వల పథకానికి ఉద్వాసన పలికి..దాన్ని అటకెక్కించారని విమర్శించారు.

పెరుగుతున్న హింస..

రోజురోజుకు మహిళలపై హింస పెరుగుతున్నదన్నారు. సగటున రోజుకు 56 మంది లైంగిక దాడులకు గురవుతున్నారని తెలిపారు. ఇవన్నీ కేంద్రానికి పట్టకపోవటం ఆందోళన కలిగిస్తోందన్నారు. మణిపూర్ దారుణాలపై ప్రధాని సమాధానం చెప్పలేక మౌనం వహించారని గుర్తు చేశారు. మరో పక్క మహిళలకు ఉపాధి కల్పించటంలో ప్రభుత్వం విఫలమయిందన్నారు. ఉన్న పనిదినాలు పడిపోతున్నాయన్నారు. ఉపాధి హామీ లాంటి చట్టాన్ని క్రమంగా నీరుగారుస్తున్నారని చెప్పారు. నిర్వాసితులు పెరుగుతున్నారనీ, వారి సమస్యలు పరిష్కరించే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉన్నట్టు కనపడటం లేదన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని కాలరాస్తూ అక్కడున్న విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే కుట్రకు మోడీ ప్రభుత్వం పాల్పడుతున్నదని చెప్పారు. అందులో భాగమే మణిపూర్ మారణహోమం అన్నారు. విద్యా, వైద్యం సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే..వాటిని పరిష్కరించకుండా కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి ప్రభుత్వం కాలం వెళ్లదీస్తున్నదని చెప్పారు. తమ రాజకీయ ప్రయోజనాలకోసం చట్టబద్ధ వ్యవస్థలను బలహీనం చేస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

జైల్లో బాబుకు ప్రాణహాని

(మొదటిపేజీ తరువాయి)

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ఉదహరించారు. చంద్ర బాబునాయుడికి బెయిల్ ఇవ్వాలని, లేదా హౌస్ రిమాండుకు అనుమతి ఇవ్వాలని చంద్రబాబు తరుపు న్యాయవాదులు కోర్టులో పిటీషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై రెండో రోజైన సోమవారం కూడా వాద నలు జరిగాయి. చంద్రబాబు తరుపు సిద్ధార్థ లూథ్రా, ప్రాసిక్యూషన్ తరుపున ఏఏజీ పొన్నవోలు సుధాకరరెడ్డి సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. తొలుత చంద్రబాబు వయస్సు, ఆరోగ్యం రీత్యా అతనికి హౌస్ రిమాండు ఇవ్వాలని కోరారు. రాజమహేంద్రవరంలో కరుడుగట్టిన నేరస్తులు ఉన్న నేపథ్యంలో చంద్రబాబుకు ప్రాణహాని జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్లే కేంద్రం కూడా ఎన్ఎస్జీ భద్రత కల్పిస్తోందని పేర్కొ న్నారు. దీనిపై ఏఏజీ పొన్నవోలు సుధా కరరెడ్డి జోక్యం చేసుకుని చంద్ర బాబుకు జైల్లో ప్రత్యేక వసతి కల్పించామని, లోపల బయట పూర్తి భద్రత ఉందని పేర్కొన్నారు. జైలు గోడలు 50 అడుగుల ఎత్తులో ఉంటాయని, భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆరోగ్య సమస్య ఉత్పన్నమైతే జైల్లోనే వైద్య చికిత్సకు ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తున్నా రని కోర్టుకు తెలిపారు. ఎంత భద్రత ఉన్నా జైల్లో హత్యలు జరిగిన విష యాన్ని గుర్తించాలని చంద్రబాబు తరుపు న్యాయవాది కోర్టుకు తెలి పారు. అలాగే హౌస్ రిమాండుకు అనుమతి ఇవ్వాలని కోరగా సిఆర్పిసి చట్టంలో హౌస్ రిమాండు అనే విధానం లేదని పొన్నవోలు తెలిపారు. దీనిపై సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకుని గౌతమ్ నవలఖా కేసులో సుప్రీం కోర్టు ఇలాంటి తీర్పు ఇచ్చిందని ప్రస్తావించారు. సాయంత్రం వరకూ సుదీర్ఘంగా వాదనలు వన్న ఏసీబీ కోర్టు న్యాయమూర్తి తీర్పును మంగళవారం సాయంత్రానికి వాయిదా వేశారు. అయితే ఉదయంలోపే తీర్పు ఇవ్వాలని సిద్ధార్థ లూథ్రా కోరారు.

రింగురోడ్డు కేసులో కస్టడీ పిటీషన్

ఇదే సమయంలో చంద్రబాబునాయుడిపై సిఐడి న్యాయవాదులు మరో పిటీషన్ దాఖలు చేశారు. రింగురోడ్డు కేసులో విచారిచేందుకు చంద్రబాబును పిటి(ప్రిజనర్స్ ట్రాన్సిట్) వారెంటు మీద తమ కస్టడీకి ఇవ్వాలని అందులో కోరారు. దీనిలో చంద్రబాబు మొదటి ముద్దాయిగా ఉన్నాడని, నారాయణ రెండో ముద్దాయని, నారా లోకేష్ ఆరో ముద్దాయని కోర్టుకు తెలిపారు. దీనిపైనా విచారణను వాయిదా వేశారు. దీంతో మంగళవారం న్యాయమూర్తి ఏమి తీర్పు ఇస్తారో అనే ఉత్కంఠ నెలకొంది.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట మహాధర్నా

నవతెలంగాణ - మట్టెవాడ



మున్సిపాలిటీ కార్పొరేషన్‌ల్లో పనిచేసే కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఏపీలో ఇచ్చినట్టుగా రూ.21,000 జీతం ఇవ్వాలని, తదితర డిమాండ్లతో మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లాలని ప్రయత్నించిన కార్మికులను మట్టెవాడ పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. కార్మిక సంఘాల నాయకులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కొద్దిమంది కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు మెమోరాండం అందజేయడానికి లోపలికి పంపించడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం కమిషనర్ రిజ్వాన్ షేక్ బాషాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి కార్మిక సంఘాల నాయకులు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలయ్య నాయకులు మాట్లాడారు.

పారిశుద్ధ పనులు సవ్యంగా జరిగినప్పుడే ప్రజలు రోగాల బారిన పడకుండా ఆరోగ్య ఉంటారని, అలా కరోనా సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడేందుకు మున్సిపల్ కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి శ్రమించారని గుర్తు చేశారు. అలాంటి వారికి ఉద్యోగ భద్రత కల్పించ కుండా దినదినం భయపడేలా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఇచ్చినట్టుగా డ్రైవర్లు, జవాన్లకు రూ.19వేల వేతనం ఇవ్వాలని, అలాగే, 452 మంది కార్మికులకు పీఆర్సీ ప్రకారం రూ.15,600 వేతనం అమలు చేయాలని కోరారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, దహన సంస్కారాలకు రూ.30వేలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మూడుసార్లుగా ఉన్న తంబింగ్ విధానాన్ని రెండుసార్లకు మార్చాలని, మూడు నెలలకు ఒకసారి చీపుర్లు, ఆరు నెలలకు ఒకసారి చెప్పులు, సంవత్సరానికి ఒకసారి యూనిఫామ్ అందజేయాలని కోరారు.

మెయిన్ రోడ్‌లో కార్మికులకు ఆదివారం సెలవు మంజూరు చేయాలని, మలేరియా విభాగంలో పనిచేస్తున్న 90 మంది సీజనల్ కార్మికులకు రూ.15,600 జీతం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ఎంపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బొట్ల బిక్షపతి, మున్సిపల్ జాక్ నాయకులు వేల్పుల ధర్మరాజు, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి పుల్ల రమేష్, టీఎండబ్ల్యూఈయూ జిల్లా నాయకులు సింగారపు బాబు, కార్మికులు పాల్గొన్నారు.

85 శాతం మెడికల్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే

నవతెలంగాణ -హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన కాలేజీల్లో ఏపీ విద్యార్థులకు స్థానికత వర్తించదని హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విభజనకు ముందున్న కాలేజీల్లో మాత్రమే రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95 ప్రకారం రెండు రాష్ట్రాల విద్యార్థులకు స్థానిక కోటా అమలవుతుందని స్పష్టం చేసింది. తెలంగాణ ఏర్పాటయ్యాక పెట్టిన 34 మెడికల్ కాలేజీల్లో (20 గవర్నమెంట్, 14 ప్రయివేటు) 85 శాతం ఎమ్‌బీబీఎస్, డెంటల్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే చెందుతాయని తెలిపింది. మిగిలిన 15 శాతం ఆల్ ఇండియా కోటా ఉంటుందనీ, ఆ 15 శాతం సీట్లల్లోనే ఇతర రాష్ట్రాల విద్యార్థుల తరహాలోనే ఏపీ విద్యార్థులు పోటీపడొచ్చునని చెప్పింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ అత్యంత ముఖ్యమైన తీర్పు సోమవారం చెప్పింది. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో జాతీయ కోటా (15శాతం) పోనూ మిగిలిన 85 శాతం సీట్లు రాష్ట్ర విద్యార్థులకే కేటాయిస్తూ తెలంగాణ రాష్ట్రం తీసుకొచ్చిన జీవో 72ను సమర్థించింది.

కొత్త మెడికల్ కాలేజీల్లో సీట్లు పూర్తి తెలంగాణ విద్యార్థులకే చెందుతాయని చెప్పింది. జీవో 72ను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను కొట్టివేసింది. తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 3న జీవో 72 తెచ్చింది. దీని ప్రకారం 2014, జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని 85 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే రిజర్వు అయ్యాయి. జాతీయ కోటా 15 శాతం మినహా మిగిలిన సీట్లలో 85 శాతం స్థానిక విద్యార్థులకు ఇవ్వడాన్ని సవాల్ చేసిన పిటిషన్లను కొట్టేసింది. ఏపీకి చెందిన గంగినేని సాయి భావన సహా 60కిపైగా పిటిషన్లను కొట్టేసింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రిజర్వేషన్లను పదేండ్ల పాటు కొనసాగించాలని పిటిషనర్ల వాదనను తిరస్కరించింది. రాష్ట్రపతి ఉత్తర్వులకు లోబడే జీవో ఉందని చెప్పింది. 'రాష్ట్ర విభజన నాటికి 20 మెడికల్ కాలేజీ మాత్రమే ఉన్నాయి. 2,850 సీట్లలో 15 శాతం కింద 313 సీట్లను కేటాయించాం. 2019లో నీట్ అమల్లోకి వచ్చిన తర్వాత జాతీయ కోటా కింద 540 సీట్లను రిజర్వు చేశాం. మొత్తం ఈ 853 సీట్లలో ఏపీ విద్యార్థులకు అవకాశం ఉంటుంది. పునర్విభజన తర్వాత వచ్చిన 34 కాలేజీల్లో వారికి ప్రత్యేక రిజర్వేషన్ లేదు. ఇది రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధం కాదు' అని ప్రభుత్వం చేసిన వాదనను ఆమోదిస్తూ తీర్పు చెప్పింది.

నియంతృత్వ పాలన కోసమే జమిలీ జపం

(మొదటిపేజీ తరువాయి)

వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో జమిలీ ఎన్నికలైనా, సాధారణ ఎన్నికకైనా సీపీఐ(ఎం) సిద్ధంగా ఉన్నదన్నారు. దేశంలో ప్రతిపక్షాలు ఐక్యమవుతుండటంతో మోడీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓడిపోతామన్న నిజాన్ని గమనించే జమిలీ ఎన్నికలకు పోయేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దేశం సాధించిన గొప్పతనమంతా తమ వల్లే జరిగినట్టుగా మోడీ తనకు తానే ప్రచారం చేసుకుంటున్నారన్నారు. జాతీయోద్యమంలో పాల్గొన్న చరిత్ర బీజేపీకి కాని, దాని మాతృ సంస్థలైన జనసంఘ్, ఆర్ఎస్ఎస్‌కూ లేవన్నారు.

ఆనాడు దేశంలో పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంటే పేరిట అడ్డుకొని జమీందార్లకు అనుకూలంగా వ్యవహరించిన చరిత్ర సంఘ్ పరివార్‌దన్నారు. ప్రస్తుతమూ కార్పొరేట్ల పక్షమే వహిస్తూ రైతు నల్ల చట్టాలు, నాలుగు లేబర్ కోడ్లు తెచ్చి రైతాంగం, కార్మికవర్గానికి నష్టం చేస్తున్నదని తెలిపారు. ఇండియా, భారత్ రెండు పదాలు కూడా రాజ్యాంగంలో ఉన్నాయని, ఇప్పుడు భారత్‌గా మాత్రమే పేరు మార్చాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దేశంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను మరుగు పర్చేందుకే దేశం పేరు మార్పు, సనాతన ధర్మం చుట్టూ చర్చ జరిగేలా చేస్తున్నారన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడటమంటే కుల వ్యవస్థను కొనసాగించడమేనని స్పష్టంచేశారు. సనాతన ధర్మమని చెప్పబడుతున్న మనుస్మృతిలో ఆడవాళ్ళు, శూద్రులు, దళితులు చదువుకోరాదని, వేదాలు చదివితే నాలుక కోయాలని, వింటే చెవ్వుల్లో సీసం పోయాలని చెప్పబడిందన్నారు. వీటన్నింటినీ కొనసాగించాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ శక్తులు చెప్పగలవా అని ప్రశ్నించారు. కులాన్ని సంహరించాలని బీఆర్ అంబేద్కర్ ఆనాడే చెప్పారన్నారు. కులాన్ని సంహరిస్తేనే దేశానికి ప్రగతి ఉంటుందని, తాను సైతం కులాన్ని నిర్మూలించాల్సిందేనని చెబుతున్నానని స్పష్టంచేశారు. ఎన్నికల్లో ఓట్ల కోసం హిందూ మతాన్ని రెచ్చగొట్టడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. జీ-20 దేశాల సమావేశాలు ఆయా దేశాల్లో రొటీన్‌గా జరిగే ప్రక్రియ తప్ప అందులో ప్రత్యేకత ఏమీ లేదన్నారు.

దేశ ప్రజలకు సంబంధించిన అధిక ధరలు, నిరుద్యోగం, రైతులకు మద్దతు ధర, రాజ్యాంగ పరిరక్షణ, మహిళా రిజర్వేషన్లు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలపై పోరాటాలు సాగించాలని ప్రజలను కోరారు. వెట్టి చాకిరి విముక్తి కోసం ఆనాడు నిజాం నవాబును తరిమికొట్టిన స్ఫూర్తితో దేశంలో నియంతృత్వ పాలన సాగిస్తున్న మోడీని గద్దె దించేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు.

భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టులది : చుక్కరాములు

నిజాం పాలనలో భూములన్నీ జాగీర్దార్లు, జమీందార్ల చేతుల్లో ఉండేవని, వారికి వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటం సాగించి లక్షలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నా రు. సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధంలేని బీజేపీ వాస్తవ చరిత్రను వక్రీకరిస్తోందని విమర్శించారు.

పుచ్చలపల్లి సుందరయ్య, రావినారాయణరెడ్డి, భీంరెడ్డి నర్సింహ్మారెడ్డిలాంటి కమ్యూనిస్టుల యోధులు సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరం మల్లేశం, కె. రాజయ్య, అతిమేల మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు యాదవరెడ్డి, నర్సింలు, ప్రవీణ్ కుమార్, ఎం. యాదగిరి, జిల్లా నాయకులు బాగారెడ్డి, రాజయ్య, అశోక్, పాండురంగారెడ్డి, పి. కృష్ణ, నాగభూషణం పాల్గొన్నారు.

మా డిమాండ్లు నెరవేర్చండి

ఆందోళనకు బెంగాల్ రవాణా కార్మికుల పిలుపు

- కనీస పెన్షన్, ఎనిమిది గంటల పనితో సహా 14 డిమాండ్లు : సీఐటీయూ మద్దతు



కోల్‌కతా : తమ డిమాండ్లు, హక్కుల సాధన కోసం పశ్చిమ బెంగాల్‌లోని రవాణా రంగానికి చెందిన కార్మికులు, ఉద్యోగులు ఏకమయ్యారు. రాష్ట్ర రవాణా కాకుండా ఇతర అన్ని రవాణా రంగాలలో నెలవారీ కనీస పింఛను రూ. 9,000 ప్రవేశపెట్టాలనీ, ఎనిమిది గంటల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. వీటితో పాటు మొత్తం 14 డిమాండ్ల సాధన కోసం వారు పోరాడుతున్నారు. ఈ మేరకు వారు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చారు. వీరి పోరాటానికి సీఐటీయూ బాసటగా నిలిచింది.

ఉపాధి పత్రాలు, గుర్తింపు కార్డులు, ఎనిమిది గంటల పని దినాలు, ఆరోగ్య బీమా సహా సామాజిక భద్రతా పథకాల అమలు, అక్రమార్కుల దోపిడీని అరికట్టడం, పెట్రోలియం ఉత్పత్తుల ధరల తగ్గింపునకు చర్యలు, వివిధ రహదారుల పునరుద్ధరణ, పండుగలకు ముందు బోనస్‌లు మరియు అలవెన్సుల చెల్లింపు, ప్రయాణీకుల ఛార్జీలను నిర్ణయించడంలో ప్రభుత్వ సహాయం వంటివి వీరి డిమాండ్‌లలో ఉన్నాయి.

కోల్‌కతాలోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన పశ్చిమ బెంగాల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ వర్క్‌షాప్‌లో కార్మికులు, ఉద్యోగులు తమ డిమాండ్లు లేవనెత్తారు. వర్క్‌షాప్‌లో సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పాల్గొన్నారు. వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తూ సేన్ మాట్లాడుతూ.. "కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కార్మికుల ప్రయోజనాల కోసం నిబంధనల పేరుతో అన్ని అక్రమాలను, అక్రమాలను అమలు చేస్తూ శ్రామిక ప్రజల ఆర్జిత హక్కులను నిర్వీర్యం చేసేందుకు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా నిరసనలు రావాలి" అని అన్నారు. ఉద్యమాన్ని నిర్మించడానికి, సంస్థ యొక్క మరింత పరిధి అవసరమని తపన్‌సేన్ తెలిపారు.

రాష్ట్రంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు ఏకం కావాలనీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎడతెగని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి కోరారు. కార్మికుల ఉద్యమాలు గతంలో ప్రదర్శించిన పరాక్రమాన్ని, వివిధ సంఘటనలను గుర్తు చేసుకోవాల్సిన ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. సీఐటీయూ పశ్చిమ బెంగాల్ కమిటీ ప్రధాన కార్యదర్శి అనాది సాహు కార్మికులను అభినందించారు. రోడ్డు రవాణా రంగంలో, మన రాష్ట్రంతో సహా దేశవ్యాప్తంగా పరిపాలనా దౌర్జన్యం కొనసాగుతున్నదని అన్నారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు

(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 59,830	▼	10
22 క్యారెట్లు	- 54,840	▼	10
కిలో వెండి	- 77,000	▼	500



చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 141
రిటైల్ (లైవ్)	రూ. 163
స్కిన్‌తో	రూ. 236
స్కిన్‌లెస్	రూ. 269

కేసీఆర్ పాలనా కాలం

- క్రీడాకారులకు స్వర్ణయుగం :మంత్రి మహేందర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


కేసీఆర్ పాలనా కాలం క్రీడాకారులకు స్వర్ణయుగమని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, భూగర్భ వనరులశాఖ మంత్రి మహేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మహేందర్ రెడ్డి నివాసంలో తొలి తెలుగు భారత అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్ గోలి శ్యామల ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. సెప్టెంబర్ 3న కలకత్తాలో జరిగిన భగీరథ నదిలో 81 కిలోమీటర్ల దూరాన్ని శ్యామల కేవలం 13 గంటల్లో ఈదిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి ఆమెను శాలువాతో సత్కరించి, బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. హిందూ మహాసముద్రంలో ప్రపంచ రికార్డు స్థాపించడం పట్ల ఆమెను అభినందించారు. రానున్న రోజుల్లో శ్యామలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

సాయుధ పోరాట రణభేరి ప్రభాకర్‌రావు అనభేరి

- పుట్టింది భూస్వామ్య కుటుంబంలో..
- నిలబడింది పేదల పక్షాన
- నిజాం కాల్పుల్లో నేలకొరిగిన ప్రభాకర్‌రావు
- ఆయనతోపాటే మరో 12 మంది వీరులు
- సజీవ సాక్ష్యాలుగా మహమ్మదాపూర్ గుట్టల్లో స్మారకస్థూపాలు
- 75ఏండ్లు దాటినా చరిత్ర మరువని వారి పోరాటపటిమ







నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

నిజాం నిరంకుశ పాలన అంతమొందించేందుకు సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చెరగని ముద్రగా కరీంనగర్ జిల్లా ప్రస్థానం నిలిచింది. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన పోరులో ఇక్కడి సాయుధ బిడ్డల పోరు సదాస్మరనీయం. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పొలంపల్లిలో భూస్వామ్య కుటుంబంలో పుట్టిన అనభేరి ప్రభాకర్‌రావు పేదల పక్షాన నిలబడి సాయుధపోరులో పాలుపంచుకున్నారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాటం సాగించి ఆ నిరంకుశపాలన తూటాలకు నేలకొరిగారు. ఆయనతోపాటు వీరమరణం పొందిన 12మంది దళ సభ్యులు రక్తం చిందించిన మహమ్మదాపూర్ గుట్ట వారి ప్రాణత్యాగానికి నేటికీ సజీవ సాక్ష్యంగా నిలిచింది. అక్కడే నిర్మించిన వారి స్మారక స్థూపాలు, చిహ్నాలు అప్పటి రజాకార్ల నిరంకుశత్వాన్ని ఎదిరించిన ధీరగాథను కండ్ల ముందు ఉంచుతున్నాయి. 75ఏండ్లు దాటినా ఇప్పటికీ వారి అమరత్వం మనస్సుల్లో మెదులుతూనే ఉంది. అనభేరి ప్రభాకర్‌రావు 1910 ఆగస్టు 15న కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పొలంపల్లిలోని దేశ్‌ముఖ్ కుటుంబానికి చెందిన వెంకటేశ్వరరావు- రాధాబాయి దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం కరీంనగర్, మచిలీపట్నంలో, హైస్కూల్ విద్యాభ్యాసం హైదరాబాద్ చాదర్‌ఘాట్‌లో, ఉన్నత విద్యాభ్యాసం కాశీపీఠంలో పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచే నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. 27ఏండ్ల వయసులో సరళాదేవితో వివాహమైంది. నిజాం కళాశాలలో చదువుతున్నప్పుడు స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మా గాంధీ, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ మరియు సర్దార్ వల్లభాయ్ పటేల్ భావజాలం నుంచి ప్రేరణ పొందారు. అనభేరి మొదటగా విద్యావ్యాప్తికి, ఉపాధి అవకాశాల కోసం కృషి చేశారు. గ్రామాల్లో గ్రెయిన్ బ్యాంకులను స్థాపించి రైతులకు ధాన్యం అందించారు. సహకార సంఘాలను స్థాపించి చేనేత కార్మికులకు నూలు సరఫరా చేశారు.

1942 నుంచి 1946 వరకు రాష్ట్ర చేనేత సంఘానికి అధ్యక్షుడిగా పని చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీలో చేరి సాయుధ దళానికి నాయకత్వం వహించారు.

బద్దం ఎల్లారెడ్డి పిలుపుతో..

సిరిసిల్లలో జరిగిన ఆంధ్ర మహాసభకు నాయకత్వం వహించిన బద్దం ఎల్లారెడ్డి పిలుపుతో ప్రభాకర్‌రావు నేతృత్వంలో దళం ఏర్పాటు చేసి పోరాడారు. అనేక గ్రామాల్లో భూస్వాములు, జమీందార్లు అక్రమంగా ఉంచుకున్న పేదల భూమి పట్టా పత్రాలను ప్రభాకర్‌రావు నేతృత్వంలోని దళం దహనం చేసింది. దాదాపు 40 గ్రామాల్లో పటేల్, పట్వారీల దగ్గర ఉన్న రికార్డులను తగులబెట్టింది. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా, అప్పటి హైదరాబాద్ నిజాం ప్రయివేటు సైన్యమైన రజాకార్లను కూడా దళం ఎదుర్కొంది. తెలంగాణ భగత్‌సింగ్‌లా ప్రజల హృదయాల్లో స్థానం పొందిన అనభేరిని అంతమొందించాలని నిర్ణయించుకున్న నిజాం సంస్థానం.. ఆయన్ను పట్టించిన వారికి అప్పట్లోనే రూ.50వేల బహుమతి ఇస్తామని ప్రకటించింది.

నిజాం కాల్పుల్లో రక్తం చిందించి..

ప్రభాకర్‌రావుకు నిజాం సంస్థానం ఇవ్వజూపిన తాలుక్దార్ కలెక్టర్ పదవిని తిరస్కరించి పేదల పక్షాన నిలబడ్డారు. ఒక దశలో ప్రభాకర్‌రావుపై నిజాం 'నాజర్ బంద్' ఆదేశాలూ జారీ చేశారు. దీంతో సాయుధవీరులను అంతమొందించేందుకు నిశ్చయించుకున్న నిజాం సంస్థానం అనభేరిని, ఆయన దళాన్ని మట్టుబెట్టేందుకు కాచుకుంది. ఆయనను నీడలా వెంటాడి హుస్నాబాద్ సమీపంలోని మహమ్మదాపూర్ గుట్టల్లో ఉన్నట్టు తెలుసుకుంది. పక్కా సమాచారం మేరకు 1948 మార్చి 14న హుస్నాబాద్ సమీపంలోని మహ్మదాపూర్ గుట్టల్లో విశ్రాంతి తీసుకుంటున్న అనభేరి దళంపై నిజాం పోలీసులు, రజాకార్లు ఒక్కసారిగా కాల్పులకు దిగారు. ఇరువురి మధ్య భీకర యుద్ధమే జరిగింది. ఆ ఎదురు కాల్పుల్లో ప్రభాకర్‌రావు సహా ఆయన సహచరులు సింగిరెడ్డి భూపతిరెడ్డి, ముస్కు చొక్కారెడ్డి, ఏలేటి మల్లారెడ్డి, అయిరెడ్డి భూంరెడ్డి, తూమోజు నారాయణ, బి.దామోదర్‌రెడ్డి, ఇల్లందుల పాపయ్య, పొరెడ్డి రాంరెడ్డి, నల్లగొండ రాజారాం, సిక్కుడు సాయిలు, రొండ్ల మాధవరెడ్డి వీర మరణం పొందారు. ఇద్దరు దళ సభ్యులు తప్పించుకున్నారు. వీరు అసువులు బాసిన చోటనే భారత కమ్యూనిస్టు పార్టీ స్మారక భవనాన్ని, స్థూపాన్ని నిర్మించింది. ఇది జరిగి నేటికి 75 ఏండ్లు గడిచింది. ఆ పోరాట ఘట్టాన్ని, వారి వీరత్వాన్ని ఆ స్థూపం చాటిచెబుతోంది.

అటవీ రక్షణ కోసం అమరులైన అధికారులకు శ్రద్ధాంజలి : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అటవీ రక్షణ కోసం కార్యదీక్షతో పనిచేస్తూ విధి నిర్వహణలో అమరులైన 22 మంది అధికారులు, సిబ్బందికి సీఎం కేసీఆర్ శ్రద్ధాంజలి ఘటించారు. వారి అంకిత భావం మనందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా జంగల్ బచావో-జంగల్ బడావో నినాదాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలనీ, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ తీసుకోవాలని పిలుపునిచ్చారు. అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎంఓ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు అటవీ శాఖ చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయం. హరిత తెలంగాణ కోసం మన లక్షిత పచ్చదనం 33 శాతం సాధించేదాకా కలిసికట్టుగా పనిచేద్దాం' అని పిలుపునిచ్చారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి అందరి నుంచీ మద్దతు లభించటంతో ఇవాళ అద్భుతమైన ఫలితాలను చూస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ లాంటి కాంక్రీట్ కీకారణ్యంలో కూడా ఊహించనంత పచ్చదనం పెరిగిందని తెలిపారు. అంతర్జాతీయ ఉద్యానవన ఉత్పత్తిదారుల సంఘం అందించే వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డ్ - 2022 హైదరాబాద్‌కు దక్కటమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అందుబాటులోకి వచ్చినా, ఎంత అభివృద్ధి సాధించినా ప్రకృతి పరిరక్షణే ప్రాథమిక ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలు కూడా ఈ పుడమిపై జీవించే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని గుర్తుచేశారు.

మానిటైజేషన్‌కు వ్యతిరేకంగా బీడీఎల్ ఉద్యోగులు ఉద్యమించాలి : పాలడుగు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల భూముల మానిటైజేషన్ నిర్ణయానికి వ్యతిరేకంగా బీడీఎల్ ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ నగర కార్యాలయంలో బీడీఈయూ(సీఐటీయూ అనుబంధం) సమావేశం ఎ.బాపూరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీపీఎస్‌యూ భూములను సైతం అమ్మకానికి పెట్టడం అన్యాయమన్నారు. ఆర్డర్లు ఇవ్వకుండా ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడం దారుణమన్నారు. కార్మికులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించడం, కాంట్రాక్ట్ విధానాన్ని కొనసాగించడం, వేతన సవరణలు చేయకుండా దాటవేయడం అన్యాయమన్నారు. ఈ చర్యలను ప్రతిఘటిస్తూ బీడీఎల్ ఉద్యోగులు రాజకీయాలకతీతంగా పోరాడాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ మాట్లాడుతూ..ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం త్వరలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఆందోళనా కార్యక్రమాలు చేస్తామన్నారు.

బీడీఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎ.బాపూరావు, యాదగిరి

బీడీఈయూ ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, అధ్యక్షులుగా ఎ.బాపూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అడిషనల్ ప్రధాన కార్యదర్శిగా టి. సత్తయ్య, కోశాధికారిగా ఎం. రవీందర్, అడ్వైజర్‌గా జి.ఆర్. విజయ్ కుమార్‌లను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. యూనియన్ అధ్యక్షులు ఎ. బాపూరావు బీడీఎల్ కంపెనీ ప్రస్తుత పరిస్థితులను వివరించారు.

ఇండ్ల స్థలాల పోరాటం ప్రారంభం

- పేదలకు భూపంపిణీలో సీఎం విఫలం : మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డాక్టర్ మిడియం బాబురావు



నవతెలంగాణ-వాజేడు

ములుగు జిల్లా వాజేడు మండలం మండపాక గ్రామంలోని ప్రభుత్వ భూమిలో ఇండ్ల స్థలాల పోరాటాన్ని మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డాక్టర్ మిడియం బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, మచ్చ వెంకటేశ్వర్లు సోమవారం జెండా పాతి ప్రారంభించారు. అనంతరం వాజేడు మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి అధ్యక్షతన జరిగిన సభలో బాబురావు మాట్లాడుతూ.. గడిచిన 70 ఏండ్లుగా వారి సమస్యలపై గిరిజనులు, గిరిజనేతరులు పోరాటాలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి న్యాయం చేసిన పరిస్థితి లేదన్నారు. పెట్టుబడిదారులకు భూములు ఉచితంగా ఇస్తూ పేదలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూమి ఉంటే అక్కడ పేదలకు ఇస్తామన్న సీఎం కేసీఆర్.. అమలులో విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎర్రజెండా నాయకత్వంలో అనేక దఫాలుగా ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్టుగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజలు ఐక్యమై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. వాజేడు మండలంలో అనేకమంది ప్రజలు ఇండ్లు లేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇండ్ల సాధనకు రెండు దఫాలు ఉద్యమాలు నిర్వహించామని, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలిచ్చినా ఫలితం లేదన్నారు. ఈ క్రమంలో మండపాక సెంటర్‌లోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 11లో 25 గ్రామాల నుంచి 600 మంది పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ భూమిలో పేదలకు పట్టాలివ్వాలని, లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గం కో కన్వీనర్ కారం పుల్లయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, గ్యానం వాసు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పోరాటం వల్లే ప్రజలకు హక్కులు

- కష్టజీవుల రక్తంతో ఏర్పడ్డదే ఎర్రజెండా
- పీడితప్రజల పోరాట గొంతుక గద్దర్ : కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు
- ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ



నావతెలంగాణ- రామన్నపేట

కమ్యూనిస్టుల పోరాటాలు లేకుండా ప్రజలకు హక్కులు సాధించబడలేదని, ప్రతి సంస్కరణ కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో సోమవారం గద్దర్ సంస్మరణ సభ, ఆటా-పాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎర్రజెండా ఒకరు ఏర్పాటు చేసింది కాదని కష్టజీవుల రక్తంతో తడిచి ఏర్పడిందన్నారు. గద్దర్ పీడిత ప్రజల పోరాట గొంతుక అని అన్నారు. తెలుగు ప్రజా సాంస్కృతిక ఉద్యమంలో గద్దర్‌ది అద్వితీయమైన పాత్ర అని తెలిపారు. ప్రజా సమస్యలను పాటగా మలిచి పాలకులకు వెన్నులో వనుకు పుట్టించిన ప్రజా గాయకుడు గద్దర్ అని చెప్పారు. సామ్రాజ్యవాద దోపిడిని, మతోన్మాదాన్ని, అంటరానితనాన్ని, ప్రజావ్యతిరేక విధానాలపై వేలాది పాటలు రాసి, పాడి ప్రజలను చైతన్యం చేశారన్నారు.

కళాప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజల పక్షాన నిలవడమే గద్దర్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన మహోజ్వల పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అని.. కానీ నేడు మతం పేరుతో చరిత్రను వక్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బండెనక బండి కట్టి అంటూ దొరలు, జాగిర్దార్లు, రజాకార్ సైన్యాలకు ఎదురొడ్డి నిలిచిన చరిత్రను మతం పేరుతో వక్రీకరించే బీజేపీ విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మూఢవిశ్వాసాలను మరింతగా పెంచారని, కేసీఆర్ మాటలకు, చేతలకు పొంతన లేకుండా ఉందన్నారు. అసెంబ్లీలో ప్రజల సమస్యలు, కష్టాలు మాట్లాడటం లేదని, వ్యక్తిగత దూషణలతోనే కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంటేపాక శివ కుమార్, ఈర్లపల్లి ముత్యాలు, నాయకులు దేశపాక రవి, కందుల హనుమంతు, మద్దూరి ఐలయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు నకిరేకంటి సురేష్, గంటేపాక శ్రీకాంత్, పండుగ రాజమల్లు పాల్గొన్నారు.

15న ఆర్టీసీ కార్మికుల నిరసన

- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి : జేఏసీ డిమాండ్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో : టీఎస్‌ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికంటే ముందే కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15న నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలపాలని టీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. ఆదివారంనాడిక్కడి టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీస్‌లో జేఏసీ సమావేశం జరిగింది. చైర్మెన్ కే రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కన్వీనర్ వీఎస్ రావు, నాయకులు ఎమ్ఎన్ మంగ, కే రాంరెడ్డి, పీ రవీందర్ రెడ్డి, జీ రాములు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలు, యునిట్లలో డిమాండ్స్ బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్మికులకు అనుకూలమైన సమయంలో 'ధర్నా' చేయాలని చెప్పారు. అప్పటికీ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించనిపక్షంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు 2017 నుంచి రావలసిన వేతన సవరణను ఆ నాటి బేసిక్ పే కు 31.1 శాతం డిఏను కలిపి 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ జరిపి, పాత బకాయిలతో కలిసి చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే 2021 వేతన సవరణ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమానంగా చేస్తూ మాస్టర్ పే స్కేల్‌లో ఫిక్సేషన్ చేయాలని డిమాండ్ చేశారు. 2013 వేతన సవరణ 50 శాతం బకాయిల బాండ్ల డబ్బులు ఇప్పటి వరకూ ఇవ్వలేదనీ, వాటిని 8.75 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని కోరారు. ఈ ఏడాది జనవరి, జులై మాసాల్లో రావల్సిన డిఏలు, మొత్తం 9 డిఏల బకాయిల సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. సీసీఎస్‌కు అసలు, వడ్డీ కలిపి యాజమాన్యం రూ.1,078 కోట్లు ఇవ్వాలనీ, వాటితో పాటు ఎస్‌ఆర్‌బీఎస్ రూ.540 కోట్లు, పీఎఫ్ రూ.1,270 కోట్లు, ఎస్‌బీటీ రూ. 140 కోట్లు చెల్లించాలని చెప్పారు. రిటైర్ అయిన కార్మికులకు చెల్లించాల్సిన టెర్మినల్ బెనిఫిట్స్ తక్షణం చెల్లించాలని కోరారు.

సైబర్ టవర్ వద్ద దీక్ష

నవతెలంగాణ-హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు ను అక్రమంగా అరెస్టు చేసిన కారణంగా ఐటీడీపి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ లోని సైబర్ టవర్ వద్ద మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు ఆయనకు మద్దతు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ రంగాన్ని నెలకొల్పి దేశ,విదేశాల్లో లక్షలాది మందికి ఉపాధి కల్పించి చంద్రబాబుపై తప్పుడు కేసు పెట్టడాన్ని ఆయన ఖండించారు. ఐటీ రంగంలో విద్యార్థులు, ఉద్యోగులు ఆర్థికంగా బలోపేతం కావడానికి, ముందు చూపుతో..భరోసాను మాజీ సీఎం చంద్రబాబు కల్పించారని గుర్తు చేశారు.

వైసీపీ కార్యకర్తల్లా ఏపీ పోలీసుల తీరు

- కుట్రతోనే చంద్రబాబుపై కేసు
- ఎన్టీఆర్‌భవన్‌లో టీడీపీ శ్రేణుల నిరసన దీక్ష



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆ పార్టీ రాష్ట్ర శాఖ తీవ్రంగా ఖండించింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో నిరసన దీక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. నాయకులు, కార్యకర్తలు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన దీక్షను కొనసాగించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. నల్లరిబ్బన్ ధరించారు. ఏపీ సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు బనాయించారని విమర్శించారు. చంద్రబాబును అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపిన నేపథ్యంలో 13మంది అభిమానులు గుండె ఆగి మరణించారని చెప్పారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, పి.అరవింద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఒకవైపు ప్రజలకు భరోసా ఇస్తూ చంద్రబాబు, మరో వైపు పాదయాత్ర చేస్తూ నారా లోకేష్ ప్రజలలో తిరుగుతున్న నేపథ్యమే కంటగింపుగా మారిందని అన్నారు. దీంతోనే వారికి ఆటంకాలు సష్టిస్తూ..రాళ్లు రువ్వడం వంటి వికత చేష్టలకు వైసీపీ ప్రభుత్వం పాల్పడిందని విమర్శించారు. చంద్రబాబు నంద్యాలలో బస్సులో నిద్రిస్తుండగా, నిద్రలేపి కొన్ని గంటల పాటు రకరకాలుగా అవమానించారని విమర్శించారు. పోలీసు అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారని విమర్శించారు. అక్రమంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ పోలీసులు వైసీపీ కార్యకర్తల్లాగా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో రాజ్యాంగం అపహాస్యం పాలైందని అభిప్రాయపడ్డారు. వికత పరిపాలన చేస్తున్న జగన్‌కు ఏపీ ప్రజలు తొందరలోనే బుద్ధిచెబుతారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఆది, సోమవారాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన దీక్షలను చేపట్టారని చెప్పారు. ఆదివారం చంద్రబాబు, భువనేశ్వరి వివాహం రోజున అక్రమ కేసులు పెట్టి మానసిక వేదనకు గురిచేసిన జగన్‌కు తప్పకుండా ఆ పాపం తగులుతుందని అన్నారు. జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు , జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి బి. జ్యోత్స్న, జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్ తదితరులు ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, సామ భూపాల్ రెడ్డి, బండి పుల్లయ్య, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, పి.చంద్రయ్య, టీజీకే మూర్తి, ప్రధాన కార్యదర్శులు ఎ.కె. గంగాధర్, అజ్మీర రాజునాయక్, జక్కలి ఐలయ్య యాదవ్, గడ్డి పద్మావతి, జీవీజీ నాయుడు, షేక్ ఆరీఫ్, అధికార ప్రతినిధులు మ్యాడం రామేశ్వరరావు, ముప్పిడి గోపల్, తెలుగు మహిళ అధ్యక్షుఆలు భవనం షకిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం రైతుల రాస్తారోకో

- రెన్యువల్ చేసుకోవడమే మేము చేసినా తప్పా అని ఆవేదన



నవతెలంగాణ- మునుగోడు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తానని జీవో విడుదల చేసి నెల రోజులు గడుస్తున్నా ఖాతాల్లో జమ కాలేదంటూ రైతులు రాస్తారోకో చేశారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలో మునుగోడు నుంచి చౌటుప్పల్‌కి వెళ్లే ప్రధాన రహదారిపై కొంపెల్లి కెనరా బ్యాంక్ ఎదుట రైతులు, ప్రజాప్రతినిధులు సోమవారం రాస్తారోకోకు దిగారు. ఈ సందర్భంగా కొంపల్లి సర్పంచ్ జాల వెంకన్న యాదవ్, వెల్మకన్న ఎంపీటీసీ చాపల మారయ్య, కల్వకుంట్ల సర్పంచ్ పగిళ్ల బిక్షం మాట్లాడారు. కెనరా బ్యాంక్‌లో క్రాప్ లోను తీసుకుని ప్రతి ఏడాదీ రెన్యువల్ చేసుకున్న రైతులకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా రుణమాఫీ కాలేదన్నారు. 2018లో రుణం తీసుకుని ఇప్పటి వరకు బ్యాంకు ముఖం చూడని వారికి రుణమాఫీ అయిందని, రెన్యువల్ చేసుకున్న రైతులకు మాఫీ కాక తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి లోను రెన్యువల్ చేసుకున్న రైతుల ఖాతాల్లోనూ లక్ష రూపాయల రుణమాఫీని జమ చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినకపోవడంతో కెనరా బ్యాంక్ ఏజీఎంతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మక్కెన అప్పారావు, మాజీ సర్పంచులు జీడిమెట్ల నరసింహ, బోయపర్తి లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల రామలింగయ్య, వీరమల్ల వెంకట్రావు, జీడిమెట్ల పిచ్చయ్య పాల్గొన్నారు.

కోతుల్ని ఎలా కట్టడి చేద్దాం?

- ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో పంటలను దెబ్బతీస్తున్న కోతులను తక్షణం కట్టడి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారుల్ని ఆదేశించారు. సోమవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆమె ప్రభుత్వ ఉన్నతాధికారులతో ఈ అంశంపై చర్చించారు. దీనికి సంబంధించి న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. కోతుల్ని పట్టుకొనే ఏజెన్సీల ప్రతినిధుల కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించి నిపుణుల కమిటీ సభ్యులు స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికల్ని సీఎస్‌కు అందచేశారు. ఆ ప్రణాళిక ప్రకారం క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎస్ అధికారుల్ని ఆదేశించారు. సమావేశంలో పీసీసీఎఫ్ ఆర్ఎమ్ డోబ్రియాల్, పురపాలకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్, పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధర్ సిన్హా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ రోనాల్డ్ రోస్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ ప్రభుత్వఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

- మాతా శిశు సంరక్షణ కేంద్రంలో కెమికల్ రియాక్షన్‌తో మంటలు
- పసి పిల్లలతో బయటకు పరుగులు తీసిన బాలింతలు, గర్భిణీలు
- కిటికీ అద్దాలను ధ్వంసం చేసి పొగను బయటికి పంపిన ఫైర్ సిబ్బంది
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన కలెక్టర్ కర్ణన్




నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం 7.30 గంటల సమయంలో పసిపిల్లల వార్డులోని స్టోర్‌రూం నుంచి ఒక్కసారిగా మంటలు, పొగ రావడంతో బాలింతలు, గర్భిణీలు బయటకు పరుగులు తీశారు. ఒక్కసారిగా పొగ కమ్ముకుంది. పేషెంట్లు, బంధువులు, కుటుంబ సభ్యులు పసిపిల్లలను చేతులతో ఎత్తుకుని బయటకు వెళ్లారు. ఫైర్ సిబ్బంది కిటికీ అద్దాలను ధ్వంసం చేసి పొగను బయటికి పంపించారు. అగ్నిప్రమాదం కెమికల్ రియాక్షన్ వల్లే జరిగిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చు నాయక్ తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బందీ జరగలేదని, సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి మంటలను ఆర్పేసినట్టు చెప్పారు. అగ్ని ప్రమాదంతో సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. అందులో బిల్డింగ్, గ్లాస్, ఫర్నీచర్, ల్యాబ్, యాసిడ్ ఫినాయిల్ టిన్స్, బ్లీచింగ్ పౌడర్ బ్యాగులు, శానిటైజర్, శానిటేషన్ సామాగ్రి కాలిపోయాయి. ఆస్పత్రి మాతా శిశు కేంద్రం సబ్ స్టోర్ రూంలో మంటలు వచ్చిన విషయం తెలియగానే కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. అనంతరం ఆస్పత్రిని సందర్శించి మాతా శిశు కేంద్రం సబ్ స్టోర్ రూంను పరిశీలించారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగ లేదని, ఆస్పత్రి, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి కిటికీలను పగల గొట్టి పొగ బయటికి పోయేలా చేసి.. మంటలను ఆర్పేశారని సూపరింటెండెంట్ వివరించారు. బాత్రూం క్లీన్ చేసే సల్ఫ్యూరిక్ ఆసిడ్ ద్రావణంలో బ్లీచింగ్ పౌడర్ కలవడం వల్లే ప్రమాదం జరిగినట్టు కలెక్టర్‌కు చెప్పారు.

అదనపు ఓపీలు ప్రారంభించాలి.

మాతా శిశు కేంద్రంలో ఓపీలో పెద్ద ఎత్తున మహిళలు లైన్‌లో ఉండటాన్ని చూసిన కలెక్టర్.. అదనంగా రెండు మూడు ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ డా.లచ్చు నాయక్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కొండల్‌రావు తదితరులు ఉన్నారు.




అప్రజాస్వామికం

సంపాదకీయం

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటులో భారీ అవినీతి జరిగిందన్న అభియోగాలపై మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబును సిఐడి పోలీసులు అరెస్టు చేయగా, ఎసిబి కోర్టు ఆయనకు రెండు వారాల రిమాండ్ విధించింది. కాగా చంద్రబాబు అరెస్టు సమయంలో సిఐడి అవలంబించిన తీరు అభ్యంతరకరం. ఆయన హోదా, వయసు, పౌర హక్కులు, చట్ట నియమ నిబంధనలను సిఐడి తుంగలో తొక్కడం ప్రభుత్వ నిర్బంధ వైఖరికి నిదర్శనం. జిల్లా పర్యటనలో ఉన్న చంద్రబాబు నంద్యాలలో శుక్రవారం రాత్రి బస్సులో బస చేయగా, పదకొండు గంటలప్పుడు ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తుల పట్ల వ్యవహరించినట్లు పోలీసులు చుట్టుముట్టి భీతావహం సృష్టించారు. శనివారం ఉదయం ఆరు గంటలకు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించి, వందల కిలోమీటర్ల దూరాన ఉన్న విజయవాడకు తీసుకొచ్చి, ఆ రాత్రంతా సిట్ కార్యాలయంలో ప్రశ్నించి, ఆపై ఆదివారం ఉదయం కోర్టులో ప్రవేశపెట్టగా, కోర్టు తీర్పు వచ్చేసరికి సాయంత్రం ఆరైంది. జోరు వర్షంలోనే అర్ధరాత్రి ఒంటిగంటకు రాజమండ్రి సెంట్రల్ జైలుకు చేర్చారు. ఈ తంతు యావత్తూ వేధింపు కోసమేనన్న రీతిలో సాగిందన్నది పలువురి విమర్శ. దర్యాప్తు నిష్పక్షపాతంగా వాస్తవాల ఆధారంగా జరగాలి.

ఏపీలో ప్రభుత్వ నిరంకుశ చర్యలు ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నాయి. రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన భావప్రకటన, నిరసన తెలిపే హక్కులు కాలరాయబడుతున్నాయి. ఏ చిన్న నిరసనను, ఊరేగింపులను, నిర్దాక్షిణ్యంగా సర్కారు పోలీసులతో అణచివేస్తోంది. ఉపాధ్యాయులు, స్కీం వర్కర్లు, కార్మికులు, ప్రతి ఒక్క తరగతి వారి నిరసనను కేసులు, అక్రమ నిర్బంధాలు, హౌస్ అరెస్టులతో నిలువరిస్తోంది. శ్రామిక ప్రజల ఆందోళనలను అణచివేయడంలో నాటి చంద్రబాబు ప్రభుత్వానికి ఈనాటి జగన్ సర్కారుకు పెద్ద తేడా ఏమీ లేదు. తాజాగా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ బంద్, నిరసనలను అరెస్టులతో అడ్డుకుంది. ప్రజాస్వామ్యంలో ఒకే పార్టీ అధికారంలో ఎల్లకాలం శిలేసుకొని ఉండదు. ప్రజలు ఆగ్రహిస్తే ప్రతిపక్షంలోకి పోతుంది. అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తే అదే ప్రతిపక్షంలోకొచ్చాక రక్షణగా ఉంటుంది. పాలకులు అప్రజాస్వామ్యాన్ని ఎంచుకుంటే అదే ప్రతిపక్షంలోకొచ్చాక తమ మెడకు చుట్టుకుంటుందన్న స్పృహ ఉండాలి. విపక్షంలో ఉండగా వైసీపీ సైతం కేసులెదుర్కొన్నదని నిర్బంధాలను అనుభవించిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. అధికారంలో ఉన్న పార్టీ ప్రతిపక్షాలపై నిర్బంధం ప్రయోగించాలన్న ధోరణి ప్రజాస్వామ్యానికి, మానవ హక్కులకు ప్రమాదం. కేంద్రంలో బీజేపీ వచ్చాక ప్రజాస్వామ్యం, ప్రజాతంత్ర హక్కుల అతిక్రమణ సాగుతోంది. బీజేపీ నుంచి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నేర్చుకుంటున్నాయి. నిరంకుశ చర్యలను ప్రజలందరూ వ్యతిరేకించినప్పుడే ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టగలుగుతుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటులో రూ.270 కోట్ల ప్రభుత్వ నిధులను డొల్ల కంపెనీలు నెలకొల్పి పథకం ప్రకారం చంద్రబాబు వ్యక్తిగత లబ్ధి పొందారన్నది సిఐడి ఆరోపణ. ఇదంతా వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపని చంద్రబాబు, టీడీపీ వాదన. అయితే కేసు నమోదు, దర్యాప్తు తీరునుబట్టి సహజంగానే సందేహాలొస్తాయి. 2015-16లో జరిగిందంటున్న అవినీతిపై వైసీపీ వచ్చాక 2021లో కేసు నమోదైంది. సిఐడి కొంత మందిని అరెస్ట్ చేసి ఛార్జిషీట్ వేసింది. నిందితులు బెయిల్ మీద విడుదలయ్యారు. హైకోర్టులో విచారణ పూర్తయి తీర్పు రిజర్వ్ అయింది. తొలుత ఎఫ్ఐఆర్‌లో లేని చంద్రబాబు పేరు అనూహ్యంగా ఇప్పుడు ముందుకొచ్చింది. ఐపిసి సెక్షన్ 409 వర్తిస్తుందా, అవినీతి నిరోధక కేసు కాబట్టి ప్రజాప్రతినిధి అరెస్టుకు గవర్నర్ పర్మిషన్ తీసుకోవాలా అనేవి సాంకేతిక విషయాలు. చట్టాలను దర్యాప్తు సంస్థలు పాటించాల్సిందే. అవినీతి కేసుల్లో ప్రభుత్వం నిష్పక్షపాత దర్యాప్తు జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలనే ఎవరైనా కోరుకుంటారు. న్యాయస్థానాలే స్కిల్ డెవలప్‌మెంట్ కేసు నిగ్గు తేల్చాలి.



పేరు మార్చి ఏమార్చి ...

పంచ వర్ష ప్రణాళికలు మార్చలేదు - నిటి అయోగ్ నేతీ బీరకాయ అని తేలింది
దేశం రాత మారడం లేదు - పేరు అయినా మార్చి పడేద్దాం

కొత్త పార్లమెంటు కట్టినా - కిరి కిరి చుట్టాలు తెచ్చినా
ప్రజలకు న్యాయం జరగడం లేదు - ప్రశ్నించే అవకాశం మిగలకుండా
పక్కదారి పట్టించే జిత్తులు వేద్దాం - నిరుద్యోగులు పేరు మీద గంటలు గంటలు
ముచ్చట్లలో మునిగి తరించి పోతారు

నాయకులు మారడం ససేమిరా - రాజకీయాలు మంటలు తప్ప ఉపయోగం లేదు
మేధావులు మౌన దీక్షలో - మనుషులు ఖర్మ పాటతో నెట్టెసుకుంటూ
ప్రభుత్వం వూరికే లేదని - ఏదో ఒకటి చేసినట్లు చేయాలి
పత్రికలకు టివిలకు పేరు వార్త పడేయాలి

జనం జాగృతం అయ్యారని తెలిసిందో - జాతకం బాబాల దగ్గర చూపించినారేమో
మార్పు తప్పదని ముప్పు పొంచి వుందని - పేరు మార్చి మోసం చేయడానికి మరో మారు...

- దాసరి మోహన్, 9985309080

వీర తెలంగాణ చారిత్రక వారసత్వం




తెలకపల్లి రవి

సెప్టెంబర్ 10న తెలంగాణ సాయుధపోరాట వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇవి 17 వరకూ కొనసాగనున్నాయి. ప్రతి యేటా జరుగుతున్నట్టే ఈ ఏడాది కూడా సెప్టెంబరు 17 పేరిట తెలంగాణ ప్రాంతంలో షరా మామూలుగా రకరకాల రాజకీయ వాదనలు వినిపిస్తున్నాయి. ఇరవయ్యేళ్ల కిందట బీజేపీ ఈ వివాదం తెచ్చింది. అప్పట్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ తెలుగుదేశం నాయకులూ దాన్ని అందిపుచ్చుకున్నారు. అనేక రకాలైన విశ్లేషకులూ బయిలు దేరి ఆ పోరాటానికి నాయకత్వం వహించిన కమ్యూనిస్టులపై దాడి నడిపించారు. మరికొందరు చరిత్ర కారులమంటూ యథాశక్తి గజిబిజి పెంచే పనిలో నిమగ్నమయ్యారు. బీజేపీకి బొరుసు లాంటి మజ్లిస్ కూడా రంగప్రవేశం చేసింది. ముందొచ్చిన చెవుల కన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్టు డెబ్బై అయిదేళ్ల కిందట ఈ పోరాట చరిత్ర నిర్మించిన కమ్యూనిస్టులకన్నా, వారి నాయకత్వంలో పోరాడిన వీర తెలంగాణ యోధుల కన్నా వీరి హడావుడి ఎక్కువగా ఉంది. ఇన్నిటి మధ్యనా తెలుగు ప్రజలు సెప్టెంబరు 17న తెలంగాణ పోరాట వారసత్వాన్ని స్మరించుకొంటున్నారు. 'మా నిజాం రాజు జన్మ జన్మాల బూజు' అని దాశరథి ఈసడించిన పరమ పైశాచిక పాలనకు వెట్టిచాకిరీకి దొరల చెరలకు మట్టి మనుషులు లిఖించిన మరణ శాసనం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. 1946 జులై 4న దొడ్డి కొమరయ్య వీర మరణం దానికి నాందీ వాచకం. ప్రపంచ ప్రజల పోరాటాల చరిత్రలోనే అరుణాక్షరాలతో లిఖించబడిన గొప్ప రోజది. పదిలక్షల ఎకరాల పంపిణీ, మూడు వేల గ్రామాల్లో పంచాయతీ ప్రజారాజ్య స్థాపన వగైరా ఆ పోరాట విజయాలను కొత్తగా చెప్పనవసరం లేదు. ఈ పోరాట కార్యక్షేత్రం తెలంగాణానే అయినా పోరాటంలో పాల్గొన్నవారిని ప్రాంతీయ రేఖలతో, కుల మతాల కొలబద్దలతో విభజించడం అచారిత్రకం.

చారిత్రక సత్యం

పోలీసు చర్యకు బాగా ముందుగానే 1948 ఫిబ్రవరి 26న నిజాం ప్రభుత్వ డిఐజి నవాబ్ దీన్ యార్ జంగ్ బహదూర్ తమ ప్రభుత్వ కార్యదర్శికి రాసిన లేఖలో ఇలా పేర్కొన్నారు... "గత కొంతకాలంగా ప్రజల దృష్టి నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో కల్లోలిత పరిస్థితులపై కేంద్రీకృతమై ఉంది. నిజాం స్టేట్ ఆంధ్ర మహాసభ (మరో విధంగా చెప్పాలంటే ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీగా పరిచితం) రావినారాయణ రెడ్డి అనే కమ్యూనిస్టు నాయకత్వంలో సాగిస్తున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాల ఫలితమే ఇది. ఆయనకు 1940 నుంచి భారత కమ్యూనిస్టుపార్టీతో సన్నిహిత సంబంధాలున్నాయి. 1945 నాటికి నెమ్మదిగా కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితుడై, 1945 తరువాత పూర్తి స్థాయి కమ్యూనిస్టుగా మారాడు. రైతురంగంలో కమ్యూనిస్టు విధానాలు, కార్యక్రమాలు సాగిస్తున్నాడు. తెలంగాణ ప్రాంతంలోని ఈ కేంద్రాలలో కమ్యూనిస్టు ప్రభావాన్ని విస్తరింపచేయడంలో నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ మొదటి నుంచి బెజవాడలోని సీపీఐ రాష్ట్ర శాఖ ప్రభావంతో మార్గదర్శకత్వంలో పనిచేస్తున్నది. పుచ్చలపల్లి సుందరయ్య, కంభంపాటి సత్యనారాయణ, వావిలాల గోపాలకృష్ణయ్య, చంద్ర రాజేశ్వరరావు ఇందుకు సంబంధించిన ముఖ్య నాయకులుగా ఉన్నారు. వీరు తరచూ ఇక్కడ పర్యటిస్తూ కమ్యూనిస్టులకు ప్రత్యేకమైన వివిధ కార్యకలాపాలను నడిపిస్తున్నారు. కిసాన్ యాత్రలు, పశు ప్రదర్శనలు, బుర్రకథల వంటివి నిర్వహిస్తున్నారు. గడచిన రెండున్నర సంవత్సరాలలోనూ నిజామాంధ్ర మహాసభ దేశ్‌ముఖ్‌లు, వతన్‌దార్లకు వ్యతిరేకంగా పోరాడటంలో ప్రత్యేక నైపుణ్యం సంపాదించింది. 1945 డిసెంబరు నుంచి ప్రభుత్వాధికారులు, ముఖ్యంగా రెవెన్యూ, పోలీసు శాఖల వారికి వ్యతిరేకంగా ప్రమాదకరమైన వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నది. ఈ కాలమంతటా కూడా వారి ఉద్యమానికి బెజవాడ నుంచి ప్రచురితమయ్యే తెలుగుపత్రిక 'ప్రజాశక్తి' మద్దతునిచ్చింది. ఈ పత్రికలో నిజాంస్టేట్, బెజవాడ కమ్యూనిస్టులు ఉభయులూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక అతిశయోక్తులతో కూడిన రాతలు రాస్తున్నారు."



సైన్యం చేసిందేమిటి?

నిజాం రజాకార్ల రాక్షస హత్యాకాండకు తలవంచని ఆ పోరాటాన్ని అణిచేందుకే 1948 సెప్టెంబరు 17న కేంద్ర సైన్యాలు దిగాయన్నది చరిత్ర కాదనలేని సత్యం. స్వతంత్ర భారతంలో సంస్థానాల విలీనం కూడా అప్పుడే జరుగుతున్నందుకు తెలంగాణ పోరాటవీరులను అణచివేసే వ్యూహం కూడా దానితో కలసిపోయింది. నిప్పులు కక్కుతున్న వీర ప్రజానీకం బారి నుంచి నిజాంకు రక్షణ ఛత్రం పట్టేందుకు పోలీసు చర్య అనబడిన సైన్య ప్రవేశం సోపానమైంది. కూలిపోతున్న రాజును రాజప్రముఖ పట్టంతో అభిషేకించి అంతకు ముందుకన్నా క్రూరంగా పోరాట వీరులను ఊచకోత కోసే ఉన్మాద హత్యాకాండకు ఒడిగట్టింది. అప్పుడే ఆంధ్ర ప్రాంతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర హత్యాకాండ సాగించింది. జనం తరిమేసిన దొరలకు కాంగ్రెస్ టోపీలు పెట్టి గడీల్లో పునఃప్రతిష్ఠించింది. ఇప్పుడు తెలంగాణ జపంతో రకరకాల రాజకీయ పాచికలు వేస్తున్న వారితో సహా నాటి దొరల వారసత్వం కొనసాగడానికి బీజాలు అక్కడే ఉన్నాయి. నిజాం రాజ్యం కూలిపోవడం, కలిసిపోవడం మంచిదైనా దాని వెనక ఇంత చరిత్ర ఉంది. ఈ సారాంశం చూడకుండా దాన్నే విమోచన దినం అంటే చరిత్ర నవ్విపోతుంది. ఆ సైనిక చర్యకు నాయకత్వం వహించిన సర్దార్ పటేల్‌ను తప్ప మరెవరినీ బీజేపీ నేతలు ప్రస్తావించరు. నిజాంతో ఈ మిలాఖత్, కమ్యూనిస్టులపై ఊచకోత సాగించిన చర్యకు ఆయన మార్గదర్శకుడనేది నిజం. ఈ దుర్మార్గాలకు నిరసనగానే 1952 ఎన్నికల్లో ఆంధ్ర, తెలంగాణ రెండు ప్రాంతాల్లోనూ కమ్యూనిస్టులే ప్రథమశక్తిగా వచ్చారు. అయితే ఆనాటి హైదరాబాద్, ఉమ్మడి మద్రాసు రాష్ట్రాల్లో ఇతరచోట్ల సీట్లు తెచ్చుకుని కాంగ్రెస్ తన మాయోపాయాలతో ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది. విమోచన కాదు విలీనం అనేది మరో వాదన. స్వతంత్ర రాజ్యంగా ఉన్న హైదరాబాద్‌ను లేదా నిజాం సంస్థానాన్ని తెచ్చి తెలుగు జిల్లాలతో కలిపారు గనక విలీనం అనే వాదనా పాక్షికమే. నిజానికి ఆ విధమైన విలీనం మరో ఎనిమిదేళ్ల తర్వాత గాని జరగలేదు. ఇప్పుడు రాష్ట్ర విభజనతో ఆ విలీనమూ ముగిసిపోయింది. అయితే చరిత్రలో మొదట ఉత్తరాంధ్ర జిల్లాలను ఫ్రెంచి వారికి కట్టబెట్టడంతో మొదలుపెట్టి రాయలసీమను దత్తమండలం చేసేంత వరకూ వెళ్లింది నిజాం రాజ్యం. బ్రిటిష్ వారి పాదాల ముందు మోకరిల్లిన వారూ స్వతంత్రంగా పోరాడే టిప్పు సుల్తాన్ వంటివారిని తుదముట్టించేందుకు సహకరించిన దోషులూ నిజాం పాలకులు.

బీజేపీ రాజకీయాలు

సెప్టెంబరు 17కు విమోచన దినం అని పేరు పెట్టి 1998లో అప్పటి కేంద్ర హోంమంత్రి ఎల్‌కె అద్వానీని రప్పించి హడావుడి మొదలెట్టింది. మొదట అద్వానీని తర్వాత ఇప్పటి హోంమంత్రి అమిత్‌షాను అభినవ సర్దార్ పటేల్‌గా చిత్రిస్తున్నారు. ఇదంతా బీజేపీ మత రాజకీయం. నిజాం ముస్లిం రాజు గనక ఆయన్ను కూలదోయడం విమోచన అనేది బీజేపీ ధోరణి. ఆ పార్టీకి లేదా సంఘ పరివార్‌కు నిజాం వ్యతిరేక పోరాటంతోగాని ఏ ఫ్యూడల్ వ్యతిరేక ఉద్యమాలతోగాని ఏమాత్రం సంబంధం లేదు. ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు చేయడానికి ముందు



ఆర్య సమాజ్ పేరిట సాగిన మతపరమైన తతంగాలు ప్రజాస్వామిక ఉద్యమంగా పెంపొందింది లేదు. దేశానికి స్వాతంత్రం వచ్చాక జునాగఢ్ పాకిస్థాన్‌తో కలవడానికి మంతనాలు జరిపితే, కాశ్మీర్, హైదరాబాద్ సంస్థానాలు స్వతంత్రం ప్రకటించుకోవడానికి ప్రయత్నించాయి. సాంకేతికంగా ఒకటికానప్పటికీ బీజేపీ పూర్వరూపం లాంటి రామరాజ్య పరిషత్ హిందువనే ఒకే కారణంతో కాశ్మీర్ రాజు కుట్రలకు వంతపాడింది! నిజానికి దేశానికి ద్రోహం చేసిన రాజులలో మీర్జాఫర్లూ ఉన్నారు, జయచంద్రులూ ఉన్నారు. అయితే ఎప్పుడైనా ఎక్కడైనా మత ప్రాతిపదిక తప్ప మానవ సమానత మతతత్వ రాజకీయాలకు అక్కర్లేదు. రజాకార్లు ముస్లింలు గనక అప్పుడు జరిగింది మతయుద్ధమేనన్నట్టు ఇప్పుడో సినిమా కూడా తీయిస్తున్నారు. రజాకార్లను, కమ్యూనిస్టులను కలిపి మాట్లాడుతుంటారు. ఇదంతా కుటిల రాజకీయం.

కమ్యూనిస్టులే సమర సారథులు

నిజాంను గద్దె దించడమే తప్పన్నట్టు మజ్లిస్ చేసే వాదన. ఇది మరింత తప్పు. నిజాం ఏ మతానికి చెందిన వాడైనా ప్రజాస్వామ్య విలువలను కాలరాసి

> కమ్యూనిస్టు వారసత్వం విస్మరించి వీర తెలంగాణ విమోచన గురించి మాట్లాడటం చంద్రుడు లేని పౌర్ణిమను చూపించడమే. సూర్యుడు లేని ఉదయాన్ని ఊహించడమే. దున్నేవానికి భూమి నినాదం తెలంగాణ పోరాట శ్వాస. వేల ఎకరాలు కార్పొరేట్లకు కుబేరులకు కట్టబెడుతున్న ఇప్పటి సర్కార్ల పోకడలు దానికి పూర్తి విరుద్ధం. భూమి ఉపాధి సాధన కోసం పోరాడకుండా ఏవో వాగాడంబరాలతో జనాన్ని దారి తప్పించడం అన్నిటికన్నా విద్రోహమవుతుంది. ఇప్పుడు అనివార్యంగా అయిలమ్మ, కొమరయ్య పేర్లు చెబుతున్నారు గాని వారు అనుసరించిన ఉద్యమాన్ని, చాటిన ఆశయాలను ముందుకు తీసుకుపోయేది కమ్యూనిస్టు ఉద్యమమే.

ప్రజలను వెట్టిచాకిరీకి గురిచేశాడు గనకే వ్యతిరేకించి పోరాడాల్సి వచ్చింది. తెలంగాణ సాయుధ పోరాటంలో ఎందరో ముస్లిం నేతలు కీలక పాత్ర వహించారనేది బీజేపీ, మజ్లిస్ కూడా గుర్తుంచుకోవాలి. నిజాంను 'నీ గోరీ కడ్తం కొడకో' అని హెచ్చరించింది నాటి తెలంగాణ పోరాట వీరులైతే నిజాంను గొప్పగా గౌరవించాలన్నది కేసీఆర్. ఇది మజ్లిస్‌ను సంతృప్తి పర్చడానికి కావచ్చు. ఇప్పుడు మంత్రి కేటీఆర్ కూడా తెలంగాణ ఆవిర్భావదినం ఉండగా విమోచన దినం ఎందుకని రెంటినీ ఒకేగాట కట్టేయడం మజ్లిస్‌ను సంతోషపెట్టే ప్రయత్నమే. గోదావరిపై ఆనకట్ట కట్టించిన కాటన్‌దొరతో నిజాంను పోల్చి ఏదో చెబుతుంటారు కేసీఆర్. కాటన్ స్పష్టంగా పరాయి పాలకుల ఉద్యోగి. ఆయన ఎవరినీ వెట్టిచాకిరీలో పీడించిన దాఖలాలు లేవు. నిజాం గొప్పవాడేనని కేసీఆర్ చెబుతున్నట్టు ఒప్పుకుంటే అంత గొప్పవాణ్ని పడగొట్టడం విమోచనం ఎలా అవుతుంది?

ఆనాడు పోలీసు చర్య అనంతరం పోరాటంపై నిర్బంధానికి కారణమైన కాంగ్రెస్ నాటి పీడక ప్రభువులనే పీఠాలెక్కించింది. ఈ అవకాశవాదాలు చాలక గత చరిత్రను కూడా వక్రీకరించడం వీర తెలంగాణ పోరాట స్ఫూర్తికే కళంకం. ఈ హడావుడి చేసే వారెవరూ అసలు పోరాటానికి నేతృత్వం వహించి అశేషత్యాగాలు చేసిన కమ్యూనిస్టుల పాత్రను పట్టించుకోకపోగా అపార్థాలు వ్యాప్తిచేస్తారు. వారికీ కులం, ప్రాంతం లేదా ఆధిపత్యం అంటగడుతుంటారు. కమ్యూనిస్టు వారసత్వం విస్మరించి వీర తెలంగాణ విమోచన గురించి మాట్లాడటం చంద్రుడు లేని పౌర్ణిమను చూపించడమే. సూర్యుడు లేని ఉదయాన్ని ఊహించడమే. దున్నేవానికి భూమి నినాదం తెలంగాణ పోరాట శ్వాస. వేల ఎకరాలు కార్పొరేట్లకు కుబేరులకు కట్టబెడుతున్న ఇప్పటి సర్కార్ల పోకడలు దానికి పూర్తి విరుద్ధం. భూమి ఉపాధి సాధన కోసం పోరాడకుండా ఏవో వాగాడంబరాలతో జనాన్ని దారి తప్పించడం అన్నిటికన్నా విద్రోహమవుతుంది. ఇప్పుడు అనివార్యంగా అయిలమ్మ, కొమరయ్య పేర్లు చెబుతున్నారు గాని వారు అనుసరించిన ఉద్యమాన్ని, చాటిన ఆశయాలను ముందుకు తీసుకుపోయేది కమ్యూనిస్టు ఉద్యమమే. అందుకే ఈ వారోత్సవం చారిత్రక సందర్భమవుతుంది. ■

పెట్టుబడిదారీ వ్యవస్థ - కప్పిపుచ్చలేని లోపాలు

పెట్టుబడిదారీ వ్యవస్థ నిజానికి చాలా మంచిదని, దానిలో స్వతఃసిద్ధంగా ఎటువంటి లోపాలూ లేవని, ఎక్కడైనా లోపాలు తలెత్తితే దానికి కారణం అప్పుడు పాలిస్తున్న ప్రభుత్వాలు చేసే పొరపాట్లేనని కొందరు ఉదారవాద బూర్జువా రచయితలు చెప్తారు. ఆ విధంగా చేయడంవల్ల వాళ్లు నమ్ముకున్న స్వంత, తప్పుడు సిద్ధాంతాలపై నమ్మకాన్ని కొనసాగిస్తూ ఉండవచ్చు, మరోపక్క ఆ వ్యవస్థ వలన తలెత్తే ఇబ్బందులకు రాజకీయ నాయకులను బాధ్యుల్ని చేసి వారి చేతకానితనాన్ని నిందించనూవచ్చు. అంతర్జాతీయ వాణిజ్యం అందరికీ లాభదాయకంగా ఉంటుందని చెప్పడం కూడా అటువంటి ఒక ప్రయత్నమే. పెట్టుబడిదారీ విధానాన్ని అందంగా చిత్రించే ప్రయత్నమే. సామ్రాజ్యవాద దేశాలు తాము ఆక్రమించుకున్న దేశాలపై శతాబ్దాల పాటు పెత్తనం సాగించాయి. ఆ వలస దేశాల ఆర్థిక వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసేశాయి. ఆ దేశాల్లో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోడానికి కారణం సామ్రాజ్యవాద దేశాలు తమ వలసలను కొల్లగొట్టేందుకు వీలు కల్పించే విధంగా వాణిజ్య సంబంధాలను బలవంతంగా అమలు చేశాయి. ఈ అనుభవాల తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థను అందంగా చూపించడం సాధ్యం కాదు. కాని, ఉదారవాద బూర్జువా పండితుల సిద్ధాంతాల్లో ఎక్కడా వలస దోపిడీ అన్న పదమే కనిపించదు!




ప్రభాత్ పట్నాయక్

అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటే అది భాగస్వామ్య దేశాలన్నింటికీ లాభదాయంగా ఉంటుందని ఉదారవాద ఆర్థికవేత్తలు అంటారు. ఆ విధంగా ఒప్పందాలు కుదుర్చు కునే దేశాలన్నింటిలోనూ ఉపాధి కల్పన పూర్తి స్థాయిలో ఉంటుందని, పూర్తి స్థాయిలో ఉత్పాదక సామర్థ్యం వినియోగంలోకి వస్తుందని వాళ్ళు ఊహించుకుంటారు. ఆ ప్రాతిపదికనే వారి సిద్ధాం తాన్ని రూపొందించారు. ప్రతీ దేశమూ తనకు ఏయే రకాల సరుకుల ఉత్పత్తిలో ప్రత్యేక నైపుణ్యం ఉందో ఆ నైపుణ్యం కూడా పూర్తి స్థాయిలో వినియోగించబడుతుందని వీళ్ళు ఊహించుకుంటారు. ఆ పరిస్థితిలో మొత్తంగా అన్ని దేశాలనూ కలిపి చూసుకుంటే ప్రపంచ ఉత్పత్తి పెరుగుతుంది. అందువలన వాణిజ్యంలో భాగస్వాములందరికీ ప్రయోజనం చేకూరుతుందని, ఒక వేళ ఏ కారణంవల్లనైనా ఒక దేశానికి ప్రయోజనం కలగకపోయినా, నష్టం మాత్రం కలగదని వారంటారు.

ఉత్పత్తికి సంబంధించిన అన్ని అంశాలూ (పూర్తి స్థాయిలో ఉపాధి, పూర్తి స్థాపక సామర్థ్యం మేరకు ఉత్పత్తి, వగైరా) అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే ముందుగాని, ఆ తర్వాతగాని గరిష్ట స్థాయిలో అమలులోకి రావడం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలలో జరగనే జరగదు. ఈ సంగతి స్వయంగా ఉదారవాద బూర్జువా ఆర్థికవేత్త అయిన జాన్ మేనార్డ్ కీన్స్ చెప్పాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎప్పుడూ జరిగే ఉత్పత్తికి సరితూగే స్థాయిలో డిమాండ్ ఉండదని, అందుకే ఆ వ్యవస్థ నిరంతరం అధికోత్పత్తి సమస్యను ఎదుర్కొంటూంటుందని ఆయన అన్నాడు. అందువలన ఇతర దేశాలతో వాణిజ్యం అంటే తన వాణిజ్య భాగస్వామి దేశానికి తన నిరుద్యోగాన్ని ఎగుమతి చేయడమే అని వ్యాఖ్యానించాడు. అంటే భాగస్వామి దేశం నుండి తెచ్చుకునే దిగుమతులకన్నా, ఆ దేశానికి చేసే ఎగుమతుల విలువ ఎక్కువగా ఉండేటట్టు చూసుకోవాలి. తన దేశంలో డిమాండ్‌కు ఎంత ఎక్కువ మోతాదులో కొరత ఉంటే, అంత మేరకు నిరుద్యోగం పెరుగుతుంది. దానిని తగ్గించాలంటే అంత ఎక్కువ మోతాదులో విదేశీ వాణిజ్యంలో మిగులు ఉండేట్టు చూసుకోవాలి. అప్పుడు తన భాగస్వామి దేశానికి ఎగుమతి చేయడానికి అవసరమైన సరుకులను ఉత్పత్తి చేయడానికి తన దేశంలో ఉపాధి కల్పించడానికి వీలౌతుంది. ఇక్కడ ఉపాధి పెరిగిన సమయంలోనే ఆ భాగస్వామి దేశంలో ఆ మేరకు అదనంగా నిరుద్యోగం పెరుగుతుంది. ఒకవేళ ఆ భాగస్వామి దేశం పెట్టుబడిదారీ వ్యవస్థలో లేకపోయినా, అక్కడికి కూడా నిరుద్యోగం ఎగుమతి అవుతుంది.

సరుకులు, సేవలు, పెట్టుబడులు (ద్రవ్య పెట్టుబడులతో సహా) సాపేక్షంగా నిరాటంకంగా దేశాల హద్దులను దాటి తరలించగలగడం నయా ఉదారవాద వ్యవస్థ ప్రధాన లక్షణం. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు భాగస్వామ్య దేశాలన్నింటికీ ప్రయోజనకరంగా ఉంటాయన్న బూర్జువా వర్గ వాదనను ముందుకు తెచ్చింది ఈ నయా ఉదారవాద వ్యవస్థను నెలకొల్పడానికే. కాని అమెరికాలో హౌసింగ్ బుడగ ఒక్కసారి పేలిపోవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అధికోత్పత్తి సంక్షోభంలో దీర్ఘకాలం పాటు మునిగిపోయింది. అప్పటి నుంచీ ఇతర దేశాల దిగుమతుల తాకిడి నుండి తన దేశాన్ని కాపాడుకునే చర్యలు చేపట్టే ప్రహసనం మొదలైంది. ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకునే బదులు ఆ సరుకులను స్వదేశంలోనే ఉత్పత్తి చేయాలన్న ఆలోచన ముందుకొచ్చింది. అప్పుడు స్వదేశంలో ఉద్యోగాల కల్పన పెరుగుతుంది, అంటే దాని ఫలితంగా తక్కిన దేశాలలో నిరుద్యోగం పెరుగుతుంది. ఇది నిరుద్యోగాన్ని ఎగుమతి చేయడమే. మూడవ ప్రపంచ దేశాలు రక్షణ విధానాలను విడిచిపెట్టి నయా ఉదారవాద విధానాలను అనుసరించాలని ముందు ఒత్తిడి తెచ్చినది సంపన్న పెట్టుబడిదారీ దేశాలు. అవే దేశాలు ఇప్పుడు తమ తమ దేశాల్లో రక్షణ విధానాలను అమలు చేయడానికి పూనుకుంటున్నాయి. అంటే నయా ఉదారవాద వ్యవస్థ నియమాలను ఈ సంపన్న దేశాలే ఉల్లంఘిస్తున్నాయన్నమాట. ఈ దేశాలన్నీ ప్రత్యేకించి చైనాను తమ లక్ష్యంగా చేసుకున్నాయి. ఎగుమతులను పెంచడం ద్వారా అభివృద్ధి సాధించిన దేశంగా చైనా ఒక ఉదాహరణగా నిలుస్తుంది. ఇంతవరకూ చైనాలో పెట్టుబడులు పెట్టి అక్కడ చవకగా ఉత్పత్తి చేసిన సరుకులను తిరిగి తమ దేశాలకు ఎగుమతి చేస్తూ వచ్చాయి ఈ సంపన్న దేశాలు.

ఇప్పుడు అమెరికా చైనా నుండి దిగుమతులను తగ్గించే 'రక్షణ' విధానాలను అనుసరించడం చూస్తున్నాం. అయితే ఈ విధంగా నయా ఉదారవాదపు 'స్వేచ్ఛా వ్యాపార' విధానాలకు భిన్నంగా వ్యవహరించడానికి కారణం అమెరికా చైనా పట్ల రాజకీయంగా అనుసరిస్తున్న శత్రు వైఖరి కారణం అని ఉదారవాద బూర్జువా పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే అధికోత్పత్తి అనే ధోరణి పెట్టుబడిదారీ వ్యవస్థలోనే ఒక ధోరణిగా ఉన్నందువలన దాని ఫలితంగా వచ్చిన సంక్షోభం అమెరికాను, పశ్చిమ సంపన్న దేశాలను రక్షణ విధానాలను చేపట్టేలా చేసింది. అంతే తప్ప ఇదేదో కేవలం రాజకీయ శత్రుత్వం వల్ల కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థకు మొదటి నుండీ సంక్రమించిన జబ్బు (అధికోత్పత్తి) వలన ఆ దేశాలు చైనా పట్ల ఈ విధంగా వ్యవహరిస్తున్నాయని ఉదారవాద పండితులు ఎందుకు గుర్తించరు? పెట్టుబడిదారీ వ్యవస్థ స్వతఃసిద్ధంగా లోపరహితం అని వారు భావించడమే కారణం. ఈ రాజకీయ శత్రుత్వమే గనుక లేకపోయినట్లైతే అంతర్జాతీయ వాణిజ్యం మూడు పువ్వులు-ఆరు కాయలుగా సాగిపోయేదని వారు వాదిస్తారు. దిగుమతులను తగ్గించి, ఎగుమతులను పెంచడం ద్వారా భాగస్వామ్య దేశాలకు తమ నుండి నిరుద్యోగాన్ని ఎగుమతి చేస్తూ తాము మాత్రం సంక్షోభం నుండి బయటపడాలని, ఈ క్రమంలో భాగస్వామ్య దేశం అడుక్కుతిన్నా తనకు అనవసరమని అనుకునే ధోరణి 1930 దశకంలోని మహామాంద్యం కాలంలో బలంగా వ్యక్తమైంది. ఆ కాలంలో ప్రభుత్వ వ్యయాన్ని పెంచి తద్వారా డిమాండ్‌ను



బాగా పెంచే ప్రయత్నాలను అప్పుడు ఎక్కడా చేయలేదు. ఒక్క ఫాసిస్టు దేశాలు మాత్రమే యుద్ధానికి సిద్ధమవుతూ అందుకవసరమైన సన్నాహాల కోసం ప్రభుత్వ వ్యయాన్ని బాగా పెంచాయి. రూజ్‌వెల్ట్ ఆ1930 దశకంలోనే 'న్యూ డీల్'ను ప్రతిపాదించాడు. ప్రభుత్వ వ్యయాన్ని పెంచడమే ఆ ప్రతిపాదన ముఖ్యాంశం. దాని ఫలితంగా అమెరికన్ ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడం ప్రారంభించింది కూడా. అయితే ఆ వెంటనే న్యూ డీల్‌ను పక్కన పెట్టారు. దాని వలన తిరిగి సంక్షోభం మొదటికొచ్చింది. యుద్ధం ముంచుకొస్తోంది అని గుర్తించిన తర్వాతనే పెట్టుబడిదారీ దేశాలు తమ తమ ఆయుధాల నిల్వలను పెంచుకోవడం కోసం ప్రభుత్వ వ్యయాన్ని పెంచాయి. కాని అంతవరకూ అంతర్జాతీయ వాణిజ్యంలో పోటీ పడి దిగుమతులను తగ్గించు కోవడం, మారకపు రేట్లను తగ్గించడం వంటి చర్యలు విస్తృతంగా చేపట్టారు. దాని వలన ఏ ఒక్క దేశంలోనూ సంక్షోభాన్ని తగ్గించుకోలేకపోయారు. అయితే దిగుమతులకు బదులు స్వదేశంలోనే ఉత్పత్తి చేట్టాలన్న విధానం మూడో ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా లాటిన్ అమెరికా దేశాల్లో అమలు చేసినందువలన అక్కడ పారిశ్రామికీకరణకు బీజాలు పడ్డాయి.సామ్రాజ్యవాద దేశాల్లో తలెత్తిన సంక్షోభం మూడో ప్రపంచ దేశాల పారిశ్రామికీకరణకు దారి తీసింది.

ప్రస్తుతం మళ్ళీ చైనా ఎగుమతులకు కళ్లెం వేయాలన్న పేరుతో సామ్రాజ్యవాద దేశాలు రక్షణ విధానాలను చేపడుతున్నాయి. దానిని సమర్థించుకోడానికి రాజకీయ శత్రుత్వాన్ని సాకుగా చూపుతున్నాయి. కాని వాస్తవానికి రక్షణ విధానాల ద్వారా చైనాకు నిరుద్యోగాన్ని ఎగుమతి చేయాలన్నదే వాటి ఉద్దేశ్యం.అయితే దీని వలన చైనా దెబ్బ తినిపోతుందనుకోలేం. గత కొన్ని సంవత్సరాలుగా చైనా ఎగుమతులను పెంచుకోడానికి బదులు, దేశీయంగా వినియోగాన్ని పెంచడం మీద ఎక్కువగా దృష్టి పెట్టింది. దానివలన అటు సామ్రాజ్యవాదుల ఎత్తుగడలను తిప్పి కొట్టవచ్చు, పైగా దేశీయంగా రైతాంగపు అభిమానాన్ని తిరిగి పొందవచ్చు. నిజానికి కొద్ది సంవత్స రాల క్రితమే చైనా "సోషలిస్టు గ్రామీణ ప్రాంతాల దిశగా" అన్న డాక్యుమెంట్‌ను ఆమోదించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వ్యయాన్ని మరింత ఎక్కువగా పెంచడం ఆ డాక్యుమెంట్ సారాంశం. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే ప్రస్తుత పరిస్థితులలో ఎగుమతులను పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించాలన్న వ్యూహంలో ఉన్న లోటుపాట్లేమిటో తెలుస్తోంది. ఏదైనా ఒక దేశం, అందునా, ఒక పెద్ద దేశం ఎగుమతులను పెంచడం ద్వారా అధిక వృద్ధిరేటును సాధించాలన్న వ్యూహాన్ని అనుసరిస్తే, ఆ దేశం మీద సామ్రాజ్యవాద దేశాలు కన్నెర్ర చేస్తాయి. అధికోత్పత్తి సమస్య ఉన్నా, లేకపోయినా, ఒక మూడవ ప్రపంచ దేశం గనుక ఎగుమతులను పెంచి దిగుమతులను తగ్గించుకుంటే సామ్రాజ్యవాద దేశాల నుండి ప్రతి చర్యలు తప్పవు.

చైనాకు ముందు జపాన్ విషయంలో ఇదే జరిగింది. జపాన్ ఏ విధంగా చూసినా, సామ్రాజ్యవాదులకు శత్రు దేశం కానే కాదు. కాని ఆ దేశం అమెరికాతో చేసిన వ్యాపారంలో ఎగుమ తులను పెంచగానే, అమెరికా జపాన్ పట్ల రక్షణ వ్యూహాన్ని అమలు చేసింది. దాని ఫలితంగా జపాన్ వృద్ధి ఒక్కసారి పడిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా అనుసరిస్తున్న విధానం జర్మనీ ఎగుమతులలో సాధిస్తున్న వృద్ధిని దెబ్బ యడానికి కూడా తోడ్పడుతుంది. రష్యా నుండి చౌకగా చమురు, సహజ వాయువులను రవాణా చేసే నార్డ్ స్ట్రీం పైప్‌లైన్‌ను యుద్ధం సాకుతో పేల్చివేశారు. దాని వలన జర్మనీ చౌకగా రష్యానుండి చమురు, సహజ వాయువులను పొందలేని పరిస్థితి వచ్చింది. ఫలితంగా జర్మనీలో ఉత్పత్తి ఖర్చు పెరిగిపోయింది. ఇక సమీప భవిష్యత్తులో జర్మనీ తన ఎగుమతులను పెంచుకుని తద్వారా వృద్ధి సాధించే అవకాశాలు లేకుండా పోయాయి.

కేవలం దిగుమతులను తగ్గించుకున్నంత మాత్రాన ఒకానొక దేశం వృద్ధి రేటును పెంచు కోజాలదు. దిగుమతులు తగ్గిస్తే, దాని ఫలితంగా దేశంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కాని అది ఒకసారి మాత్రమే జరుగుతుంది. ఆర్థిక వృద్ధిరేటును నిత్యం పెంచుకోవాలంటే దానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ఒక్కటే మార్గం. ద్రవ్యలోటును పెంచడం ద్వారా అయినా లేక పన్నుల ఆదాయాన్ని పెంచడం ద్వారా అయినా ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలి. కాని అందుకు నయా ఉదారవాద విధానాలు అనుమతించవు. ప్రస్తుత సంక్షోభం నుండి తన దేశాన్ని కాపాడు కోవాలంటే ప్రధాన సామ్రాజ్యవాద దేశం అమెరికా, రక్షణ విధా నాన్ని అనుసరించడం వరకే పరిమితమైతే సరిపోదు. అంతకన్నా చాలా ఎక్కువ ప్రయత్నం అవసరం.

-స్వేచ్ఛానుసరణ

గుండెపోటుతో మధ్యాహ్న భోజన కార్మికురాలు మృతి

నవతెలంగాణ-కొణిజర్ల



మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామానికి చెందిన షేక్ సలీమా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలుగా పనిచేస్తుంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసే క్రమంలో పాఠశాలలో గుండెపోటు వచ్చి కుప్పకూలిపోవడంతో ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సలీమాని హుటాహుటిన ఆటోలో ఖమ్మం ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. సలీమా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. సలీమాకు భర్త, ఇద్దరు కూమార్తెలు, ఒక్క కూమారుడు ఉన్నారు. తమకు ప్రతిరోజూ చక్కటి భోజనం వడ్డిస్తున్న సలీమా మృతి చెందడంతో ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు యం.శ్యాంసన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

సలీమాకి నివాళులర్పించిన సీపీఎం, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

గుండెపోటుతో మృతి చెందిన షేక్ సలీమా మృతదేహానికి సీపీఎం నాయకులు దొడ్డపనేని క్రిష్టార్జున్ రావు, మిద్దె రామారావు, రోషన్, అఫ్జల్, అనుమోలు వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా నాయకులు అనుమోలు రామారావు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు.

అర్హులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నవతెలంగాణ-తల్లాడ

గృహలక్ష్మీ పథకంలో అర్హులైన పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఐదు లక్షల రూపాయల నిధులు మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ రవికి సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు షేక్ లాల్ మియా, ఏన్కూరు, తల్లాడ సంయుక్త మండల కార్యదర్శి కొండే వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు, మండల కార్యవర్గ సభ్యులు డి.రమణ, నాగేశ్వరరావు, రాంబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

నవతెలంగాణ-బోనకల్

తహసీల్దార్ కార్యాలయం ముందు ఎంఆర్పిఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ సీనియర్ నాయకులు తాటికొండ వెంకటరత్నం మాదిగ మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో ఎస్సీ కులాలను ఏబిసిడిలుగా వర్గీకరించాలని ప్రధాన డిమాండ్తో ఈనెల 11 నుండి 22 వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చిలక నాగరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మంద అశోక్ మాదిగ, ఎమ్మెస్పీ నాయకులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు వాయిదా

నవతెలంగాణ-కల్లూరు

ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించాల్సిన మండల స్థాయి పాఠశాలల క్రీడలు పోటీలు భారీ వర్షం కారణంగా వాయిదా వేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎం.దామోదర ప్రసాద్ మండల కన్వీనర్ ఏ రమేష్ పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణం నందు ఇటీవల కురిసిన వర్షాలతో నీరు నిలిచిందన్నారు. తిరిగి మరల ఎప్పుడు నిర్ణయించేది ప్రకటిస్తామని చెప్పారు.

సిరిపురం జనసంద్రం

- మదన్ లాల్ కు స్వాగతం ఘన పలికిన ప్రజలు
- పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరిక

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్ లాల్ సోమవారం వైరా మండలం సిరిపురం(కేజీ) గ్రామంలో పర్యటించారు. పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు మదన్ లాల్ కు ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన ఇంటింట ప్రచారం నిర్వహించారు. పలు పార్టీలకు చెందిన కుటుంబాలు బాణోత్ మదన్ లాల్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మదన్ లాల్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దేల రవి, మోరంపూడి బాబు రావు, కట్టా క్రిష్టార్జునరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, మాదినేని ప్రసాద్, వనమా విశ్వేశ్వరావు, కొత్తా వెంకటేశ్వర రావు, మొరంపుడి ప్రసాద్ పాల్గొన్నారు.

త్వరలో ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్

- పోలీస్ కమిషనర్ విష్ణు యస్.వారియర్

నవతెలంగాణ-ఖమ్మం



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు నిర్మిస్తున్న ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ త్వరలో అందుబాటులోకి రానున్నదని పోలీస్ కమిషనర్ విష్ణు యస్.వారియర్ తెలిపారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణ పనులను పోలీస్ కమిషనర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ సిగ్నల్స్, నిబంధనలకు సంబంధించిన చిత్రాలు, ఆట స్థలంతో పాటు ద్విచక్ర వాహనం ఎలా నడపాలో వివరించేందుకు సిమిలేటర్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి, సీఐ అశోక్, ట్రాఫిక్ ఏఎస్సై నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలి



కూసుమంచి



కల్లూరు :



- తహసీల్ ఎదుట సీపీఐ(ఎం) ధర్నా

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలో అన్ని గ్రామాల్లో అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామని చెబుతున్న గృహలక్ష్మి, దళిత బంధు, బీసీ బందు, నూతన రేషన్ కార్డులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ మంజూరు చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, వ్యతిరేకిస్తూ... విపరీతంగా పెరిగినటువంటి నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండల ఇన్చార్జి తుశాకుల లింగయ్య మాట్లాడుతూ... పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఏ పనినైనా, పథకమైనా గ్రామ సభల ఆమోదంతో అమలు జరపాలని లేని చట్ట అతిక్రమణకు పాల్పడినట్లవుతుందని, పథకం పొందిన లబ్దిదారులు కూడా అనర్హులవుతారని, వివిధ పేర్లతో ఏదో కొద్దిమందికి అక్కడక్కడ ఇచ్చే పథకాలు కూడా పర్సంటేజీలు తీసుకుని పక్కా అధికార పార్టీల కార్యకర్తల ఇచ్చుకొంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎర్రబోయిన భారతి, పార్టీ మండల కమిటీ సభ్యులు శీలం గురుమూర్తి, తోటకూరి రాజు, మల్లెల సన్మమంతరావు, జవ్వాజి శ్రీను, వెంకన్న, మూడు గన్యా నాయక్, కర్ణబాబు, చీర్ల రాధాకృష్ణ, మల్లేపల్లి సర్పంచ్ పోట్టపింజర నాగేశ్వరావు, వందిరి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ తాళ్లూరు రవి, హాలవత్ బాసునాయక్ వివిధ గ్రామల శాఖ కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలి

కల్లూరు : రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని, 14 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఐద్వా మండల కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, గొర్రెల మేకల సంఘం కార్యదర్శి బట్టు నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దోమ తొట్టి పుల్లయ్య, పార్టీ సభ్యులు నాయుడు చంద్ర రావు, రేసు నాగేశ్వరరావు, ముంత మల్లయ్య, తదితర పాల్గొన్నారు.

కొణిజర్ల : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్నా ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ మాట్లాడారు. అనంతరం ఇన్చార్జ్ తహసీల్దార్ ఎర్రయ్యకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బలమాల యోహాను, పగిడిపల్లి జయ, బాలమర్తి వెంకటి, జంగిలి నవీన్, తుపాకుల నాగయ్య, షేక్ ఆజాద్, పేరం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ వి.పి.గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం



అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.పి.గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో గ్రీవెన్స్ డే'లో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి తగు చర్య నిమిత్తం సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వైరా మండలం కొండవనమాల గ్రామానికి చెందిన దుంపల నిరోష, తనకు 14 సంవత్సరాల నుండి ఫిట్స్ రావడం పనికి వెళ్లిన చోట పడిపోవడం జరుగుతున్నదని, తాను సదరం క్యాంపుకు వెళ్తే సర్టిఫికేట్ జారీచేయలేదన్నారు. భూవివాదాలు, పెన్షన్ సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సమస్యలు పరిష్కారించాలి : అదనపు కలెక్టర్కు వినతి

జిల్లాలో పాడిరైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు సోమవారం కలెక్టరేట్లో గ్రీవెన్స్ డేలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తెలంగాణ విజయడైరి పాడిపరిశ్రమ అభివృద్ధి సమాఖ్యకు పాలు పోసే పాడిరైతులకు 2014లో లీటర్కు రూ.4 ఇన్సెంట్ ఇస్తానని ప్రకటించారని, రెండు సంవత్సరాలు 15 రోజులకోసారి పాల బిల్లుతో చెల్లించారని, తరువాత 2016 నుండి బ్యాంక్ అకౌంట్ లో వేస్తామని చెప్పి 4 సంవత్సరాలు ఇన్సెంట్ చెల్లించకుండా 2016 నుండి 2020 డిసెంబర్ వరకు ఇన్సెంట్ వేశారకాని, ఎవరికీ ఎన్ని లీటర్లకు ఎన్ని డబ్బులు పడ్డాయని చూడాలంటే ఇప్పటికి సరైన బిల్ పేపర్ ఇవ్వడంలో విఫలమయ్యారని ఆరోపించారు. 2020 నుండి 2023 వరకు ఇన్సెంట్ డబ్బులు ఇవ్వడం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

బీవీకే ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రం





ప్రారంభించిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-ఖమ్మం

బోడేపూడి విజ్ఞాన కేంద్రం (బివికె) ఆధ్వర్యంలో ఖమ్మం సుందరయ్య భవనంలో "వాసిరెడ్డి శేషమ్మ-మంగయ్య మెమోరియల్" వారి సౌజన్యంతో "కంప్యూటర్ శిక్షణా కేంద్రం" ప్రారంభించారు. స్కూలు విద్యను అభ్యసించే పిల్లలకు చిన్నతనంలోనే కంప్యూటర్ శిక్షణలో మెళకువలు నేర్పించేందుకు, వారి భవిష్యత్ చదువులలో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ఉద్దేశించి ప్రారంభించిన ఈ కేంద్రాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి, బివికె చైర్మెన్ తమ్మినేని వీరభద్రం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. బివికె జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అనేక సాంఘిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని, గతంలో కోవిడ్ 2 వేవ్ల సందర్భంగా రోగులకు ఐసోలేషన్ సెంటర్ నిర్వహించడం, రోగులకు, కుటుంబ సభ్యులకు ఉచిత భోజనాలు అందించటం, విద్యార్థుల సౌకర్యార్థం లైబ్రరీ నడపటం, ప్రతి నెల ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సేవా కార్యక్రమాల కొనసాగింపులో భాగంగానే ఈ శిక్షణా కేంద్రం కూడా ప్రారంభించామన్నారు. బీవీకే ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా ఈ కంప్యూటర్ శిక్షణా కేంద్రానికే కాకుండా ఇతర అన్ని కార్యక్రమాలకు సహకరిస్తున్న వాసిరెడ్డి దయానంద్కి, వారి కుటుంబ సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కేంద్రాన్ని వినియోగించుకోవల్సిందిగా ఆయన విద్యార్థులను కోరారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ(ఎం) మరియు బివికె సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ శిక్షణా కేంద్రాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. అదే విధంగా బివికె నిర్వహించే అన్ని కార్యక్రమాలకు సహకారిస్తున్న ప్రతి ఒక్కరికి ముఖ్యంగా వాసిరెడ్డి దయానంద్కి, వారి కుటుంబానికి ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్లో నిర్వహించబోయే అన్ని కార్యక్రమాలకు కూడా ఇదే సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మరొక ముఖ్య అతిథి, ప్రముఖ విద్యావేత్త ఐ.వి.రమణారావు మాట్లాడుతూ కంప్యూటర్ విజ్ఞానాన్ని పిల్లలకు అందించడానికి బివికె చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు.

నిశాంత్ ఇంజం వాసిరెడ్డి దయానంద్కు సత్కారం

అమెరికాలో స్థిరపడిన నిశాంత్ ఇంజంను, బివికె కార్యక్రమాలకు సహకరిస్తున్న వాసిరెడ్డి దయానంద్ని శాలువా కప్పి సత్కరించారు. ముఖ్యంగా నిశాంత్ ఇంజం "ద బెస్ట్ పాసిబుల్ ఎక్స్పీరియన్స్" అనే ఒక 11 షార్ట్ స్టోరీస్ పుస్తకం ద్వారా భారత సంతతి ప్రజలు అమెరికా సమాజంలో ఇమిడే క్రమంలో వారు ఎదుర్కొనే ఇబ్బందులు, కోల్పోయే ఐడెంటిటీ, కుటుంబ విలువలు, ప్రేమ మొదలగు వాటి గురించి ఎంతో హృద్యంగా మనసుకు హత్తుకొనేలాగా రాసి ఎంతోమంది హృదయాలను జయించాడని, ఇది అద్భుతమని హాజరైన అతిథులందరూ ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.సుబ్బారావు, బండి రమేష్, వై.విక్రమ్, బండి పద్మ, నందిపాటి మనోహర్, ఎర్ర శ్రీనివాసరావు, జబ్బార్, ఆర్.ప్రకాష్, నవీన్ రెడ్డి, యస్.కె.బషీరుద్దీన్, బోడపట్ల సుదర్శన్, మీరా, కళ్యాణం నాగేశ్వరరావు, పగడాల నాగేశ్వరరావు, చింత కోండల్ రావు, బి వి కె బాధ్యులు శివన్నారాయణ ఎస్.కె.అఫ్జల్, నన్నక గోవిందరావు, తుమ్మల వెంకట్రావు, వాసిరెడ్డి వీరభద్రం, నెల్లూరి వీరబాబు, ఆల్ పెన్షనర్స్ & రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ బాధ్యులు, బివికె విద్యార్థులు పాల్గొన్నారు.

వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సమస్యను పరిష్కారించాలి

- పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్

నవతెలంగాణ-ఖమ్మం

ఫిర్యాదులను విచారణ జరిపి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సమస్యను పరిష్కారించాలని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవేన్స్ కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 25 ఫిర్యాదుదారులు వచ్చి ఫిర్యాదు చేశారు. వాటన్నింటిపై సత్వరమే చట్ట ప్రకారం విచారణ చేసి సమస్య త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను సీపీ ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదులలో ఎక్కువగా వరకట్న వేధింపు కేసులు, కుటుంబ తగాదాలు, భూమి వివాదాలపై ఫిర్యాదులు అందాయని, వీటిని చట్టపరిధిలో పరిష్కారానికి సంబంధిత అధికారులకు సీపీ ఆదేశించారు.

క్వాలిటీ కంట్రోల్ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్, విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ డివిజన్ కార్యాలయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. పంచాయతీ రాజ్ శాఖ పునర్వ్యవస్థీకరణలో భాగంగా జిల్లాకు కార్యనిర్వాహక ఇంజనీర్, విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ డివిజన్ కార్యాలయం మంజూరు అయినట్లు మంత్రి తెలిపారు. ఇంచార్జ్ విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ శ్రీనివాస్కి మంత్రి అభినందనలు తెలుపుతూ, శాలువాతో సన్మానించి, సీట్లో కూర్చోబెట్టారు. జిల్లాకు మెరుగైన సేవాలందించాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ కొండబాల కోటేశ్వర రావు, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, జెడ్పి సిఇఓ అప్పారావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ రాంచంద్ర మౌళి, ఈఈ కెవికె శ్రీనివాస్ రావు, డిఈ కోటేశ్వరరావు, వెంకట్ రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్ పేరుతో ఇంటర్మీడియట్ కళాశాల నిర్వహణ..?

- పట్టించుకోని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలో ఐఐటీ, నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ పేరుతో అకాడమీలు ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా ఇంటర్మీడియట్ అడ్మిషన్ నిర్వహిస్తూ ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కోచింగ్ సెంటర్లు నడుపుతున్న డీఐఈఓ పర్యవేక్షించడంలో విఫలమయ్యారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. సోమవారం ఖమ్మంలోని గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్కు కోచింగ్ సెంటర్లపై డీఐఈఓపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యువరాజు శివనాయక్ సతీషు శశి, నాగరాజు, ఆకాష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు యాదవ్, కురుమలంతా కదిలిరావాలి

- జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి తుశాకుల లింగయ్య పిలుపు

నవతెలంగాణ -కూసుమంచి



గొర్రెల పంపిణీ పథకం ఎటువంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా దళారుల ప్రమేయం లేకుండా అమలు జరగడం కోసం నగదు బదిలీ రూపంలో అమలు చేయాలని, వాటాదనం ప్రభుత్వమే భరించి డిడిలన్ని తిరిగి వాపసీయాలని డిమాండ్ చేస్తూ జిఎంపిఎస్ ఆధ్వర్యంలో అన్ని యాదవ, కురుమ సంఘాల నాయకత్వంలో ఈనెల 22న జరిగే ఖమ్మం కలెక్టరేట్ మహా ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జియంపియస్ జిల్లా కార్యదర్శి తుశాకుల లింగయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో గొర్రెల సొసైటీ చీఫ్ ప్రమోటర్ కాంచాని గురవయ్య అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతూ... డీడీలు కట్టి 15 నెలలుగా ఎందుకు ఎదురు చూడాలని ప్రశ్నించారు? బీసీ బందు, దళిత బంధు పథకాల మాదిరిగానే వాటాదనం లేకుండానే ప్రభుత్వమే భరించి గొర్రెల పంపిణీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడక్కడ ఇచ్చే గొర్రెలు కూడా పైరవీల ఆధారంగా అధికార పార్టీ శ్రేణులకు మాత్రమే ఇస్తున్నారని ఇది సరైనది కాదని విమర్శించారు. గ్రామాల డ్రా లిస్టులు పాటించకుండా అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పిన వారికి గొర్రెలు పంపిణీ చేయడం మిగతా యాదవ కురములందర్నీ దూరం చేసుకోవడమే అని పేర్కొన్నారు. గొర్రెల కోసం నెల్లూరు, చిత్తూరు, కర్ణాటక ప్రాంతాలకు వెళ్లిన వారి సమస్యలు వర్ణనాతీతం అని, అక్కడ కూడా కొంతమంది పశు వర్ధక శాఖ మంత్రి బినామీలమని చెప్పుకుంటూ ఈ స్కీముని కమిషన్ల పేరుతో దోచుకొని పూర్తి అవినీతిమయం చేస్తున్నారని విమర్శించారు. ఈ దళారులను కాదని ఎవరైనా రైతు దగ్గర ప్రత్యక్షంగా గొర్రెలు కొనుగోలు చేస్తే వారికి డబ్బులు బదిలీ కాకుండా ఆపుతామని బెదిరింపులకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ జనరల్ బాడీలో గ్రామ పెద్ద గొల్ల గడ్డం గంగయ్య, పెద్దలు కోటయ్య, గడ్డం మురళి, బాలిని శ్రీశైలం, అసిమేకల కిరణ్, చెట్ల లింగయ్య, వెంకటేశ్వర్లు, పంచాయతీ వార్డు సభ్యులు లిక్కీ వెంకటమ్మ రెడ్డిబోయిన సైదమ్మ పాల్గొన్నారు.

బినామీలకు కాంట్రాక్టులు 'గులాబీ'లకు పథకాలు



- ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి అజయ్ తీరు
- గడప గడపకు కాంగ్రెస్ కు విశేష స్పందన
- అభ్యర్థి ఎవరైనా పార్టీ గెలుపే ధ్యేయం
- దొంగ ఓట్ల నిగ్గుతేల్చుతాం
- కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యులు ముప్పా విజయబాబు

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బినామీలకు కాంట్రాక్టులు... గులాబీలకు పథకాలు అనే తీరుగా బీఆర్ఎస్ పాలన సాగుతోందని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యులు ముప్పా విజయబాబు అన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి అజయ్ తీరు అచ్చు ఇలాగానే ఉందని వ్యాఖ్యానించారు. తన బినామీలకు కాంట్రాక్టులు అప్పగించి తక్కువ అంచనాలతో పనులు మొదలుపెట్టి.... అంచనాకు మించిన వ్యయంతో పనులు పూర్తిచేస్తున్నారని ఆరోపించారు. దీనిలోనూ కొన్ని అసంపూర్తి గానే ఉన్నాయన్నారు. గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యునిగా ఎంపిక చేసిన పార్టీ అధినాయకత్వానికి, ఈ పదవి వచ్చేందుకు తోడ్పడిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 'నవతెలంగాణ' తో సోమవారం ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు విజయబాబు మాటల్లోనే...

పువ్వాడ నిగ్గుతేల్చుతాం...

ఒకే అడ్రస్తో వేల ఓట్లతో లబ్ధి పొందుతున్న మంత్రి పువ్వాడ బోగస్ ఓట్ల నిగ్గుతేల్చుతాం. బినామీలకు వివిధ పనుల కాంట్రాక్టులు అప్పగిస్తూ నాసికరంగా పనులు నిర్వహించి మంత్రి రూ. కోట్లు కూడబెడుతున్నారు. ఈ పనుల్లోనూ కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. అభివృద్ధి కన్నా హడావుడి ఎక్కువైంది. నాలుగు లైట్లు...రెండు రోడ్లు వేసి అభివృద్ధి అంటున్నారు.

గడప గడపన బ్రహ్మరథం...

గడప గడపకు కాంగ్రెస్కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పథకాల అమలులో బీఆర్ఎస్ పక్షపాత ధోరణిని ప్రజలు వివరిస్తున్నారు. 'గులాబీ' కార్యకర్తలకు తప్ప మిగిలిన వారికి పథకాలు అందడం లేదని ఆరోపిస్తున్నారు. దళితబంధు, బీసీలకు రూ.లక్ష సాయం, డబుల్ బెడ్రూంలు ఇవన్నీ బీఆర్ఎస్ కార్యకర్తలకు తప్ప ఎవరికీ అందలేదు. పథకాల అమల్లో పారదర్శకత లోపిస్తుంది. రుణమాఫీ విషయంలో కేసీఆర్ రైతులతో చెలగాటమాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ గడప గడపకు కాంగ్రెస్ కొనసాగుతోంది.

- మేనిఫెస్టో కమిటీకి ఎంపికపై హర్షం..

కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీలో చోటు కల్పించిన సోనియా, రాహుల్, ఖర్గే, ప్రియాంకగాంధీ, రేవంత్రెడ్డి, భట్టి, పొంగులేటి తదితర నేతలకు నా కృతజ్ఞతలు. గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో అనేక సమస్యలు మా దృష్టికి వస్తున్నాయి. ఇప్పటికీ మౌలిక వసతులు కూడా లేని అనేకం ఉన్నాయి. రోడ్ల మీదనే రోడ్లు వేసి అభివృద్ధి అంటున్నారు. గడప గడపకు కాంగ్రెస్లో మా దృష్టికి వచ్చిన ప్రధాన స్థానిక సమస్యలను మేనిఫెస్టోలో పొందుపరచేలా కృషిచేస్తా.

- అభ్యర్థులు ఎవరైనా గెలుపే ముఖ్యం...

కాంగ్రెస్ పార్టీ తరుపున అభ్యర్థి ఎవరైనా గెలిపించుకోవడమే మా ధ్యేయం. గెలుపే ప్రాతిపదికగా టిక్కెట్ల కేటాయింపు ఉంటుంది. ఖమ్మం నియోజకవర్గం నుంచి 9 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎవరికి టిక్కెట్ దక్కినా వారి గెలుపు కోసం కృషి చేస్తాం..



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
ఖమ్మం
మంగళవారం | సెప్టెంబర్ 12, 2023 | www.navatelangana.com



బోగస్ ఓట్లకు కేరాఫ్ పువ్వాడ

ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు

కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యులు ముvvా విజయబాబు

నవతెలంగాణ- ఖమ్మం

బోగస్ ఓట్లకు కేరాఫ్ అడ్రస్ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అని కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యులు ముvvా విజయబాబు అన్నారు. ఖమ్మం నగరంలోని 42వ డివిజన్‌లో, రఘునాథపాలెం మండలం రాంక్యా తండాలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గడపకు గడపకు ముvvా తిరుగుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పర్యాయాలు దొంగ ఓట్లతోనే పువ్వాడ ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. మూడవ సారి అదే విధంగా గెలవాలని చూస్తున్న పువ్వాడ గెలుపును ఖచ్చితంగా అడ్డుకుంటామన్నారు. ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాలకు పువ్వాడ అజయ్ కుమార్ దొంగ ఓట్ల వ్యవహారంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నేడో రేపో ఓటర్ల సమగ్ర జాబితా రానుందని వాటి వివరాలు పూర్తిగా పరిశీలిస్తామని, అయినప్పటికీ పువ్వాడకు చెందిన దొంగ ఓట్లు ఉన్నట్లు ఆ జాబితాలో తేలితే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మలీదు జగన్, ఎం.డీ. ముస్తాఫా, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ ఛైర్మన్ బాణాల లక్ష్మణ్, మైనారిటీ నాయకులు షేక్ ఇమామ్, దుంపల రవి కుమార్, బోడా శ్రావణ్ కుమార్, చింతమళ్ల గురుమూర్తి, కీసర పద్మజా రెడ్డి, శ్రీ కళా రెడ్డి, నరసింహారావు, కాంపాటి వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

రెజొనెన్స్ విద్యార్థికి 'గవర్నర్ ప్రశంస

నవతెలంగాణ- ఖమ్మం



నగరంలోని శ్రీనివాసనగర్‌లో రెజొనెన్స్ పాఠశాల విద్యార్థి బి.యశ్వంత్, 6వ తరగతి. విద్యార్థి 'రాజభవన్'లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బహుమతిని సాధించి గవర్నర్ చేత ప్రశంసలు అందుకున్నారు. "ఆర్థిక అసమానతలను నివారించటంలో నూతన విద్యావిధానం పాత్ర" అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు నిర్వహించిన రాజభవన్లో' నిర్వహించిన పోటీలలో రెజొనెన్స్ విద్యార్థి అత్యుత్తమ ప్రతిభను కనపరిచి బహుమతిని గెలుచు కోవటం జరిగిందని. ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే 'రెజొనెన్స్' శ్రీనివాసనగర్ విద్యార్థి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి నందుకు డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్రకుమార్, నీలిమా అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటే వివిధ అంశాలపై తగు శిక్షణను ఇచ్చి అన్ని రంగాలలో ముందుండే విధంగా రెజొనెన్స్ స్కూల్ శ్రీనివాసనగర్‌లో అవలంభిస్తున్న విధానాలు , ప్రణాళికల మూలంగానే ఇది సాధ్యం అయిందని వారు పేర్కొన్నారు. బహుమతి గెలుచుకున్న 'యశ్వంత్ 'ను అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ప్రిన్సిపల్ సంధ్యా ఇతర అధ్యాపకులు అభినందించారు. బహుమతి అందుకున్న విద్యార్థి యశ్వంత్ ఒక సాధారణ కుటుంబంలోని ఆ విద్యార్థిని రెజొనెన్స్ పాఠశాలలో చేర్పించి, మంచి విద్యావిధానాన్ని, శిక్షణ మూలంగానే రాజభవనక్కు వెళ్లి బహుమతిని పొందటం జరిగింది. వారి తల్లిదండ్రులు తండ్రి రవి, తల్లి లక్ష్మి చాలా సంతోషించారు. అత్యుత్తమ శిక్షణ అందిస్తున్న రెజొనెన్స్ పాఠశాల అధ్యాపకులకు, యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

డీడీలు కట్టిన వారందరికీ గొర్రెల పంపిణీ చేయాలి

ఎంపీడీవోకి వినతి

నవతెలంగాణ-నేలకొండపల్లి



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం కోసం బ్యాంకుల్లో డీడీలు కట్టిన ప్రతి కురుమ యాదవులకు తక్షణమే గొర్రెలు పంపిణీ చేయాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా కార్యదర్శి తుషాకుల లింగయ్య డిమాండ్ చేశారు. సోమవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో జీఎంపీఎస్ మండల కమిటీ సమావేశం ఎడ్ల తిరుపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల పంపిణీ పథకానికి అర్హులైన కురుమ యాదవులు డీడీలు చెల్లించి 14 నెలలు గడుస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. లబ్ధిదారులు ప్రైవేటుగా అప్పులు తెచ్చి డీడీలు కట్టడంతో అప్పులకు వడ్డీలు పెరగడంతో అవి తీర్చలేక గొర్రెలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 11 వేల మంది డీడీలు కడితే కేవలం 520 మందికి మాత్రమే గొర్రెలు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. అనంతరం భారీ ప్రదర్శనగా బయలుదేరి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీడీవో కే జమలారెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించి తక్షణమే గొర్రెల పంపిణీ పథకాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు యడ్ల తిరుపతిరావు, జిల్లా డైరెక్టర్ మల్లెబోయిన శ్రీనివాసరావు, నాయకులు ఏనికే నరసింహారావు, చిలకల భూషయ్య, వలరాజు, మార్తి కొండలరావు పాల్గొన్నారు.



కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజల్లో తీసుకెళ్లాలి

సీఎల్పీ నేత మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ- ముదిగొండ

కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రచారం చేయాలని సీఎల్పీ నేత మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గోకినేపల్లిలో కాంగ్రెస్ పార్టీ మొదట జోన్ బూత్ స్థాయి సమీక్ష సమావేశం సోమవారం పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బారాస ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ప్రచారం చేసి రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈనెల 17న హైదరాబాదులో జరిగే సోనియాగాంధీ విజయభేరి సభకు మండలంలోని కార్యకర్తలు అధికసంఖ్యలో తరలి రావాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజా ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపి కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలు సైనికుల పనిచేయాలన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను వెలికి తీసి వారి పరిష్కారానికి ఆందోళన నిర్వహించే ప్రజలకు అండగా ఉండాలన్నారు.

వెంకటాపురంలో కాంగ్రెస్ పార్టీ ర్యాలీ

మండలపరిధిలో వెంకటాపురం గ్రామంలో సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముదిగొండ నుండి వెంకటాపురం వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు భారీ సంఖ్యలో కదం తొక్కారు. ఈ ర్యాలీలో సిఎల్పీ నేతం మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర కో- చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ఆర్కే గార్డెన్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీలో చేరికల సభలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు, పాలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పార్టీ మధిర నియోజకవర్గ బిబ్లాక్ అధ్యక్షులు కందిమల్ల వీరబాబు, మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, నాయకులు కోట రాంబాబు, బుల్లెట్ బాబు, పందిరి అంజయ్య, పిల్లుట్ల రాఘవ, మహమ్మద్ అగ్గర్, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు, మల్లెల అజయ్, బిచ్చాల బిక్షం, సిహెచ్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను...

పేదలకు ఇండ్ల స్థలాలకు కేటాయించండి

- ఆర్డీవోకు సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-సత్తుపల్లి



అన్యాక్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను తక్షణమే స్వాధీన పర్చుకొని ఇండ్లులేని పేదల ఇండ్ల స్థలాలకు కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆర్డీవో ఎస్.అశోకచక్రవర్తిని కలిసి పేదల ఇండ్ల స్థలాల సమస్యను ఆయనకు వివరించారు. సత్తుపల్లి మండలంలో తుంబూరు, సదాశివునిపాలెం గ్రామాల్లో ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకొని వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ఇండ్లులేని పేదలు అనేక అవస్థలు పడుతున్నారని వివరించారు. ఆక్రమణదారుల నుంచి ఆయా ప్రభుత్వ భూములను తక్షణమే స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. అనంతరం పైన తెలిపిన సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు కుమారస్వామి, కృష్ణ, నాగలక్ష్మీ రమాదేవి, నాగేషు, రవి పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

సీఐటీయు జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్

నవతెలంగాణ- ఖమ్మం



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా ఖమ్మం జిల్లాలో ఐదు ప్రాజెక్టులు సంపూర్ణంగా సమ్మెని కొనసాగిస్తున్నట్లు సిఐటియు ఖమ్మం జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్ తెలిపారు. సోమవారం ఖమ్మంలోని ఖమ్మంఅర్బన్, తిరుమలాయపాలెం ప్రాజెక్ట్ కేంద్రాల్లో జరిగిన సభలను ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్, ఏఐటియుసి రాష్ట్ర నాయకులు సింగు నరసింహారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. వీరంతా మహిళలు బడుగు, బలహీనవర్గాలకు చెందినవారే ఎక్కువమంది ఉన్నారన్నారు. గత 45 సంవత్సరాలకు పైగా ఐసిడిఎస్లో పనిచేస్తూ పేదలకు సేవలందిస్తున్నారన్నారు. అయినా వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలేవి రాష్ట్ర ప్రభుత్వం నేటికీ కల్పించలేదన్నారు. దీనివల్ల అంగన్వాడీ ఉద్యోగులు చాలా నష్టపోతున్నారని తెలిపారు. మన పక్కనే ఉన్న తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అంగన్వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చారని, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం తదితర రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లిస్తున్నారని, మన రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు అంగన్వాడీ ఉద్యోగులకు కల్పించడం లేదని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి.కోటేశ్వరి, జిల్లా కార్యదర్శి సుధారాధ, సిఐటియు జిల్లా నాయకులు పి.మోహన్‌రావు, వీరన్న, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు యు.పద్మ, జి.రామ, జె.పద్మ తదితరులు పాల్గొన్నారు.



మధిర : మధిర సీడీపీవో కార్యాలయం ఎదుట సోమవారం అంగన్వాడి ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు శీలం నరసింహారావు, వ్యవసాయ కార్యదర్శి సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి పాల్గొని సంఘీభావం తెలిపి ప్రసంగించారు .ఈ కార్యక్రమంలో సిఐటియు మధిర కన్వీనర్ మురళి, సిఐటియు నాయకులు మధు, అంగనవాడీ ప్రాజెక్టు నాయకురాలు వరలక్ష్మి, మహిళా సంఘం జిల్లా నాయకురాలు మండవ ఫణీంద్ర కుమారి, జిల్లా నాయకులు తేలపోలు రాధాకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు సోమవారం నుండి నిరవధిక సమ్మె ప్రారంభించారు. మండలంలోని సాయిప్రభాత్‌నగర్ వద్ద గల తిరుమలాయపాలెం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నందు సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్, ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సింగు నరసింహారావులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం సంవత్సరం నుండి రాష్ట్ర ప్రభుత్వానికి, ఐసిడిఎస్ డైరెక్టర్‌కు దశలవారీగా ఉద్యమాలు నిర్వహించి వినతిపత్రాలు అందించామని అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో నేటి నుంచి సమ్మెకు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. అంగన్వాడీలకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్ రావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.కోటేశ్వరి, జిల్లా కార్యదర్శి సుధా, తిరుమలాయపాలెం మండల సిఐటియు కన్వీనర్ వీరన్న, నాయకులు మంజుల, పద్మ సారిక, గాయత్రి, కాంత, లక్ష్మి, కళావతి, కుమారి, ఉమాదేవి, అన్నపూర్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అరెస్టు హేయమైన చర్య : సిఐటియు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ కమిషనరేట్ ముట్టడి కార్యాలయానికి వెళుతున్న ఆశా వర్కర్లను అరెస్టు చేయడం హేయమైన చర్య అని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్ రావు అన్నారు. అరెస్ట్ అయిన ఆశా వర్కర్లను ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ లో ఆయన పరామర్శించారు.

కల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చలమల విఠల్ అన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం సోమవారం నుండి సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా మధర రోడ్ నుండి పోలీస్ స్టేషన్ మీదగా తాహసిల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సెంటర్లో జరిగిన సమావేశంలో విఠల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగన్వాడీలు పోరాటం చేస్తే హామీలు ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదని అన్నారు. కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు కల్పించాలని, డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగటం జరిగిందన్నారు. సమ్మెలో పాల్గొనకుండా అంగన్వాడి మహిళలపై ఒత్తిడి తీసుకురావడం దురదృష్టకరమన్నారు. అంగన్వాడీల పోరాటానికి మండల రైతు సంఘం ఉపాధ్యక్షులు మాదాల వెంకటేశ్వరరావు, తల్లాడ రైతు సంఘం నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తన్నీరు కృష్ణార్జునరావు, ఐద్వా మండల కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, గొర్రెల మేకల పెంపకం మండల కార్యదర్శి భట్టు నరసింహారావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు టి నాగమణి, శ్రీదేవి, వాణిశ్రీ, జ్యోతి, హేమలత, ప్రభావతి, ఏఐటిసి నాయకురాలు ప్రేమ బాయ్ పాల్గొన్నారు.

సత్తుపల్లి : సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన అంగన్వాడీ టీచర్లు, ఆయాల నిరవధిక సమ్మె సోమవారం సత్తుపల్లిలో ప్రారంభమైంది. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలో ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శన అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ, వ్యకాస రాష్ట్ర కమిటీల సభ్యులు చలమాల విఠల్‌రావు, జాజిరి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సత్తుపల్లి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు వి.సుశీల, పి.ఉదయశ్రీ, నాయకురాళ్లు జీవమ్మ, సకీనా, నాగేంద్ర, విజయలక్ష్మీ, రామేశ్వరి, పుష్ప, శాంతకుమారి, లక్ష్మీ, భూశమ్మ, పద్మజ, లలిత, కళావతి, రాజ్యలక్ష్మీ హైమవతి, రత్నకుమారిలతో పాటు 300 మంది అంగన్వాడీలు పాల్గొన్నారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కారణంగా సెంటర్లు మూతపడ్డాయి.



అర్హులకు అందని సంక్షేమ పథకాలు

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళనలు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్, పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేవలం అధికారపార్టీ వాళ్లకే ఇస్తే ఊరుకునేది లేదన్నారు. కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని, భక్త రామదాసు ప్రాజెక్టు కింద లింకు కాలువలు ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి వెంకన్న, దాసరి మహేందర్, నాగాటి సురేష్, వడ్ల ఉమేష్, బింగి రమేష్, మధు, కొమ్ము నాగేశ్వరరావు, నాగరాజు, ఎస్.రాము, ముత్తయ్య, జానీ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సిపిఎం ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ఖమ్మంరూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తాసిల్దార్ పీవీ.రామకృష్ణకు అందజేశారు. ధర్నాలో సీపీఎం ఖమ్మం రూరల్ మండల ఇంచార్జ్ ఉరడీ సుదర్శన్ రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యుడు పెరుమాళ్ళపల్లి మోహన్‌రావు, నందిగామ కృష్ణ, నాయకులు తమ్మినేని వెంకట్రావు, వడ్లమూడి నాగేశ్వరరావు, పొన్నం వెంకటరమణ, అద్దంకి తిరుమలయ్య, ఏటుకూరి ప్రసాదరావు, యర్రా నరసింహారావు, మేడికొండ నాగేశ్వరరావు, నంబూరి మంగ, కారుమంచి గురవయ్య, పొన్నం మురళి, కూచిపూడి వెంకట్రావు పాల్గొన్నారు.



ఎర్రుపాలెం : సంక్షేమ పథకాలు సామాన్య ప్రజలకు అందని ద్రాక్ష పండులాగా మారాయని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య ప్రభుత్వాన్ని విమర్శించారు. తాసిల్దార్ కార్యాలయం ముందు సోమవారం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం యూడీసీ అభిరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లా డుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మన్, అధికార పార్టీ నాయకుల జోక్యం లేకుండా గ్రామ సభల ద్వారానే అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందేలాగా ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సగుర్తి సంజీవరావు, గామాసు జోగయ్య, ఆంగోతు వెంకటేశ్వర్లు, గొల్లపూడి కోటేశ్వరరావు, షేక్ నాగుల్ మీరా, నాగులవంచ వెంకటరామయ్య, చిత్తూరు కిషోర్, గురవయ్య, కాంతారావు, భోగేశ్వరావు, పుల్లారావు, మహేష్, బసవయ్య పాల్గొన్నారు.

కారేపల్లి : పేదల సమస్యలపై సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) నాయకులు ఆందోళనకు దిగారు. పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి గృహలక్ష్మి పథకం వర్తింపచేయాలని నినదించారు. ఈ ధర్నా నుద్దేశించి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో అనిశ్చితి నెలకొందన్నారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేయాల్సి ఉండగా అధికార పార్టీ కనుసన్నలలో ఎంపిక చేయటంతో అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం డిమాండ్ల కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వంకాయల సురేష్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, తలారి దేవప్రకాశ్, ముండ్ల ఏకాంబరం, అన్నారపు కృష్ణ, మాలోత్ శోభన్‌బాబు, పాసిన్ని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మున్నేరు వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ

మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

నవతెలంగాణ-ఖమ్మం



మున్నేరు వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక నయాబజార్ ప్రభుత్వ పాఠశాల అవరణంలో ఏర్పాటు చేసిన సభలో బాధితులకు రూ.1.50 కోట్ల విలువైన చెక్కులను అర్హులైన 1,718 మంది కుటుంబాలకు రెండవ రోజు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మున్నేరు ముంపు బాధితులకు నిత్యావసరాలు, గృహోపకరణాలు అందించినట్లు తెలిపారు. ఐటీసీ సహకారంతో బాధితులకు రూ.కోటితో స్టీల్ సామన్లు, పరుపులు ఇచ్చినట్లు ఆయన అన్నారు. గృహ అవసరాల కోసం వస్తువులు పంపిణీ చేస్తున్నామన్నారు. రాజ్యసభ సభ్యులు బండి పార్థసారధి రూ. కోటి, తన కోడలు అపర్ణ తాత కంపెనీ నుండి రూ.50 లక్షలు మొత్తం రూ.1.50 కోట్లు ముంపు బాధితుల సహాయార్థం కలెక్టర్ ఖాతాలో జమచేసినట్లు ఆయన తెలిపారు. అ మొత్తాన్ని బాధితులందరికీ సమానంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఎంపీ బండి పార్థసారథి రెడ్డికి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్నేరు వరద ముంపు కుటుంబాలు 1,718 గృహాలకు ఒక్కో కుటుంబానికి దాదాపు 15వేలు అందజేసినట్లు ఆయన అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వరదలు వస్తే వారికి ప్రభుత్వం రూ.10వేలు పంపిణీ చేయగా, జిల్లాలో మున్నేరు బాధితులకు రూ.15 వేలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మున్నేరు పరివాహక ప్రాంతంలోని ముంపు బాధితులకు ఇక ఇబ్బందులు రావని, మున్నేరుకు ఇరువైపులా ఆర్సీసి రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం రూ. 690 కోట్లతో నిర్మించనున్న పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయని, అతి త్వరలో ఆయా పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభిస్తామని మంత్రి అన్నారు. అనంతరం మంత్రి, విద్యా శాఖ సమగ్ర శిక్ష అభియాన్, అలిమ్ కోల ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలకు పిల్లలకు ఉచితంగా పరికరాల పంపిణీ చేశారు. మత్యశాఖ అధ్వర్యంలో రూ.8 లక్షలతో కొనుగోలు చేసిన రెండు బోట్‌లను మంత్రి చేతుల మీదగా శాఖకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, జిల్లా డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ విజయ్ కుమార్, ఏఎంసి చైర్మన్ దోరేపల్లి శ్వేత, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, అర్బన్ తహసీల్దార్ సిహెచ్.స్వామి, కార్పొరేటర్‌లు గోవిందమ్మ, మాటేటి లక్ష్మీనాగేశ్వరరావు, నాయకులు ఆర్జేసి కృష్ణ, తోట రామారావు, పగడాల నాగరాజు, రుద్రగాని ఉపేందర్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కన్నం ప్రసన్న కృష్ణ, మామిడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

మద్యానికి బానిసై ఓ వ్యక్తి పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన బచ్చోడులో చోటుచేసుకుంది. బచ్చోడు గ్రామానికి చెందిన చింతల వీరయ్య (52) మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు చింతల అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వరాల శ్రీనివాస్ తెలిపారు.

యాదవులకు గొర్రెలు పంపిణీ

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో పెద్దమండవలో పశుసంర్థక శాఖ ఆధ్వర్యంలో యాదవ కురుములు ఆరుగురు లబ్ధిదారులకు సోమవారం రెండో విడత గొర్రెలను పశు వైద్యాధికారి పేరుమాళ్ల అశోక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ శెట్టిపోగు రామారావు, ఎంపీటీసీ సభ్యులు కుక్కల వెంగళరావు, ఉపసర్పంచ్ కోడె బాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిని కాపాడబోయి కొడుకు మృతి

నవతెలంగాణ- వేంసూరు

తల్లిని కాపాడబోయి కొడుకు మృతి చెందిన సంఘటన భీమవరంలో సోమవారం జరిగింది. భీమవరానికి చెందిన అయినంపూడి సరోజిని ఇంటి ఆవరణలో బట్టలు ఆరేస్తున్న క్రమంలో వైర్‌కు కరెంటు రావడం ఒక్కసారిగా కేక వేయడంతో ఇంటిలో ఉన్న కొడుకు వెంకటేశ్వరరావు (32) తల్లిని కాపాడే క్రమంలో చేతితో లాగడంతో వెంకటేశ్వరరావు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. తల్లి ప్రాణాలతో బయటపడింది.

గండిని పూడ్చిన అధికారులు

నవతెలం-గాణ కల్లూరు

మధిర బ్రాంచ్ పరిధిలోని మునుకోళ్ల మేజర్ కాల్వకు గుర్తుతెలియని వ్యక్తులు గండి పెట్టడంతో సోమవారం జల వనరులశాఖ డిఈఈ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గండిని పూడ్చివేయించారు. రఘునాథ బంజరకు చెందిన వ్యక్తులు గండిపెట్టినట్లు తెలిసి వారిపై చర్య తీసుకోవాలంటూ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు డిఈఈ తెలిపారు. కాల్వలకు గండ్లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు ఘనస్వాగతం

నవతెలంగాణ-కారేపల్లి

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రకు కారేపల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఇల్లందు పర్యటనలు వెళ్తున్న ఎంపీకి కారేపల్లి క్రాస్‌రోడ్‌లో బీఆర్ఎస్ నాయకులు ఎదురేగి స్వాగతం పలికారు. ఆయనను శాలువతో సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే అందరికి సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమని ఐక్యంగా పని చేసి బీఆర్ఎస్‌ను గెలిపించుకుందామన్నారు. ఖమ్మంలో 10 సీట్లలో బీఆర్ఎస్ గెలవబోతుందన్నారు. ఈకార్యక్రమంలో కారేపల్లి సంత ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, నాయకులు ఆదెర్ల రాములు, షేక్ మున్నీర్, గుగులోత్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా లీగ్ పోటీలలో మోడల్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కారేపల్లి

ఖేలో ఇండియా లీగ్ పోటీలలో కారేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి 17 పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ అక్తర్జుమాన్ తెలిపారు. ఈనెల 10వ తేదిన ఖమ్మంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ జూనియర్, సీనియర్ విభాగాలలో బాలికలు సత్తాచాటన్నారు. ఈ పోటీలలో 3 బంగారు పతకాలు, 6 వెండి, 8 కంస్య పతాకాలు సాధించినట్లు తెలిపారు. సీనియర్ విభాగంలో సాత్విక, రెండు బంగారు పతకాలు నిక్షిత ఒక పతకం సాధించారన్నారు. ప్రతిభ చూపి మెడల్స్ సాధించిన విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహ్మద్ అక్తర్జుమాన్, పీడీ నితీన్, వైస్‌ప్రిన్సిపాల్ నాగరాణి లు అభినందలు తెలిపారు.

7

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | సెప్టెంబర్ 12, 2023 | www.navatelangana.com

బల్లా సాయికుమార్ మృతి భాధాకరం

- సీపీఐ(ఎం) భద్రాచలం డివిజన్ కో కన్వీనర్ కారం పుల్లయ్య

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఏఐటీయూసీ, సీపీఐ పార్టీ భద్రాచలం పట్టణ నాయకులు బల్లా సాయికుమార్ అనారోగ్యంతో మృతి చెందడం కమ్యూనిస్టు ఉద్యమాలకు, వారి కుటుంబానికి తీరని లోటని సీపీఐ(ఎం) భద్రాచలం డివిజన్ కో కన్వీనర్ కారం పుల్లయ్య అన్నారు. సోమవారం ఖమ్మం పట్టణంలో ని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడన్న వార్త తనను చాలా భాదించిందన్నారు. సాయికుమార్ ప్రజా ఉద్యమాల్లో ముందుండి పోరాడేవారన్నారు. సాయికుమార్ మృతికి సీపీఐ(ఎం) మండల కమిటీ తరపున వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మంగళబోడు గ్రామాన్ని సందర్శించిన ఎస్సై

నవతెలంగాణ-చంద్రుగొండ



మండల పరిధిలోగల మద్దుకూరు గ్రామపంచాయతీ శివారు మంగళబోడు గ్రామాన్ని సోమవారం ఎస్సై మాచినేని రవి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మంగళబోడు గ్రామాన్ని సందర్శించడం జరిగిందని, గొత్తికోయల కుటుంబాలకు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, గొత్తికోయల పిల్లలకు విద్యపై మక్కువ చూపాలని, ముఖ్యంగా కుటుంబ నియంత్రణపై ఇద్దరు వద్దు-ఒకరు ముద్దు అని కుటుంబ నియంత్రణ గురించి గొత్తికోయల కుటుంబాలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ కోటి, హెూంగార్డు సురేష్, గొత్తి కోయల కుటుంబాలు, తదితరులు పాల్గొన్నారు.

కన్నమ్మ చిత్రపటానికి సీపీఐ(ఎం) నివాళి

నవతెలంగాణ-దమ్మపేట



మండలంలోని అంకంపాలెం గ్రామంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పెనుబల్లి నానారావు భార్య కన్నమ్మ దశదిన ఖర్మకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య సోమవారం హాజరయ్యారు. కన్నమ్మ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట పార్టీ మండల కార్యదర్శి బుడితి చిరంజీవి నాయుడు, ముకలపల్లి మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, దమ్మపేట మండల పార్టీ కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డాలక్ష్మి నారాయణ, పూకంటి రవికుమార్, పెనుబల్లి నానారావు, కూరం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి లాభాల్లో వాటా చెల్లించాలి

నవతెలంగాణ-టేకులపల్లి

కోల్ ట్రాన్స్పోర్ట్ కార్మికులకు వేతన ఒప్పందం, చట్టబద్ధ హక్కులు, సింగరేణి లాభాల్లో వాటా చెల్లించాలని కోయగూడెం నుండి వివిధ ప్రాంతాలకు బొగ్గు రవాణ చేస్తున్న టిప్పర్ డ్రైవర్ల క్లీనర్ల వేతన ఒప్పందం జరగక కొన్ని సంవత్సరాలు అవుతుందని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి రాసుద్దీన్ అన్నారు. సోమవారం కోయగూడెంలో ఎల్.మారుతీరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో వచ్చిన లాభాలలో కాంట్రాక్ట్ కార్మికులకు 35శాతం లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాంబాబు, రాజు సురేష్, పవన్, రవి, సాయి, రాజేష్, వెంకటేశ్వర్లు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కమిటీ హాల్‌కు శంకుస్థాపన

నవతెలంగాణ-మణుగూరు

గుట్టమల్లారం గ్రామంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌కు విప్, ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. పినపాక నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అత్యధిక వసతులతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తున్నారు. మొదటి విడతగా రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు రేగా తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాత మధు మండలంలోని గుట్ట మల్లారం గ్రామంలో సుమారు రూ.50 లక్షల అంచనా వ్యయంతో సింగరేణి సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్ రావు, జడ్పీటీసీ పోషణ నరసింహారావు, ఎంపీపీ కారం విజయ్ కుమారి, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ఆనందోత్సవాలతో జరుపుకోవాలి

- కొత్తగూడెం గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు కెవి.రంగాకిరణ్

నవతెలంగాణ-కొత్తగూడెం

వినాయక చవితి పండుగ సందర్భంగా ఈ నెల 18 నుండి జరిగే నవరాత్రి ఉత్సవాలు ప్రజలంతా ఆనందోత్సవాలతో జరుపుకోవాలని కొత్తగూడెం గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు కె.వి.రంగా కిరణ్ కోరారు. సోమవారం కొత్తగూడెం వివేకానంద విద్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు జరుపుకునే నిర్వాహకులు పోలీసు వారి సూచనలు పాటిస్తూ పోలీసు విద్యుత్ పర్మిషన్లను తీసుకొని మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వారికి ఏ విధమైన ఇబ్బందులు ఉన్న కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి ధారా రమేష్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన పంచాయతీ రాజ్ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-మణుగూరు

నూతన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ మణుగూరు 2 పంచా యతీరాజ్ కార్యాలయాన్ని విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాత మధు సోమ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ డీఈ సైదులు రెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతరం వారిని శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వ్యవసాయ కూలీలకు రేట్లు పెంచాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పెరుతున్న ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీ రేట్లు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సీపీఐ(ఎం) రామారావుపేట జోన్ భాధ్యులు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. రేగుబల్లి, దంతెనం, నర్సాపురం గ్రామాల్లో కూలీ రేట్లు కార్మికుల పొట్టను కొట్టే విదంగా దారుణంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రేగుబల్లి గ్రామంలో జరిగిన వ్యవశాయ కూలీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మెట్ట పొలం పనులకు రోజు కూలీ రూ.300 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నిత్యవసరాల ధరలు నింగిని అంటుతున్నాయని పాలకుల విధానాల వలన నేడు పేదవాడు కడుపునిండా అన్నం తినలేని పరిస్థితి దాపురించిందన్నారు. వ్యవశాయ కూలీ రేట్లు పెంచే వరకు కూలీలు సమ్మె కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జక్కం సావిత్రి, పుట్టి సావిత్రి, షకీలా, అమృతమ్మ, సుధారాణి, జెట్టి పద్మ, కాలువ పాపమ్మ, మనోరమ, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ రిజిస్టర్ తనిఖీ

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి సంస్థలో నియామకాల్లో రోస్టర్ రిజిస్టర్ విధానాంలో జరుగుతున్న తీరును ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ బృందం తనిఖీ చేశారు. సోమవారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘ బృందం సింగరేణి కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘ చీఫ్ లైజన్ ఆఫీసర్లు, 9 మందితో కూడిన రోస్టర్ రిజిస్టర్ల బృందం తనిఖీ నిర్వహించారు. ఎస్సీ ఉద్యోగుల అధికారుల (ఈఈ సెల్) పదోన్నతులకు సంబంధించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిజిఎం(పర్సనల్) విలాస్ శ్రీనివాస్ పోత్దార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ చీఫ్ లైసన్ ఆఫీసర్ అండ్ మణుగూరు జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, ఎస్సీ అండ్ ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘ ప్రెసిడెంట్ ఈ. రాజేశ్వర్, జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు, డిజిఎం (పర్సనల్) విలాస్ శ్రీనివాస్ పోత్దార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.తిరుపతి, కమిటీ ఛైర్మన్ కలవల చంద్ర శేఖర రావు, జి.మాల కొండయ్య డివై.పిఎం బి.గట్టు స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించకపోతే...

ప్రభుత్వ పతనం తప్పదు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే.రమేష్

నవతెలంగాణ-పాల్వంచ

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించినా, కోర్కెలను పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ప్రభుత్వానికి పతనం తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే.రమేష్ హెచ్చరించారు. పాల్వంచలో మున్సిపల్ కార్యాలయం వద్ద రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మొదటి రోజు సమ్మె శిబిరాన్ని ప్రారంభిస్తూ మాట్లాడారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్వాడీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రయత్నిస్తే, స్వయంగా మంత్రే యూనియన్‌లతో చర్చలు జరిపారని అన్నారు. చర్చల్లో అంగీకరించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ని కుదించారని, ఎటువంటి షరతులు లేకుండా మినీ టీచర్స్‌ని మెయిన్ టీచర్స్‌గా గుర్తిస్తామన్న హామీని విస్మరించి, అనేక షరతులతో మినీలను మెయిన్ టీచర్స్‌గా గుర్తుస్తామని సర్క్యులర్ విడుదల చేశారని అన్నారు. స్వయంగా మంత్రే చర్చల్లో ఇచ్చిన హామీలకు దిక్కే లేకుండా పోయిందన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజనం కార్మికులు, ఐకేపీ, వీఓఏలను పంపి అంగన్వాడీ సెంటర్లను నడపడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ ప్రయత్నాలను విరమించుకోకపోతే వారందరినీ అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవి కుమార్ మాట్లాడారు. అంగన్వాడీల శ్రమతో ప్రభుత్వానికి అనేక అవార్డ్‌లు వస్తున్నాయని, అంగన్వాడీ శ్రమని, కష్టాన్ని గుర్తించకుండా ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తుందని అన్నారు. ఐసీడీఎస్‌కి సంబంధం లేని అనేక బాధ్యతలను అంగన్వాడీలకు అప్పగిస్తూ పని భారాన్ని పెంచుతున్నారని అన్నారు. సమ్మె పట్ల అధికారులు దూకుడుగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ సమ్మె ప్రారంభ కార్యక్రమానికి అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు రాజ్య లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధి కారి వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యులు రమ్య, భాను, అచ్చమ్మ, ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షులు నిరంజన్, పట్టణ, జిల్లా నాయకులు పి.తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.















అంగన్వాడీ ఉద్యోగులును ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

భద్రాచలం రూరల్ : భద్రాచలంలో ప్రారంభమైన సమ్మెకు శ్రామిక మహిళా పట్టణ కన్వీనర్ మర్లపాటి రేణుక అధ్యక్షతన జరిగిన సమ్మెను ప్రారంభిస్తూ సీఐటీయూ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి మాట్లాడుతూ ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లకు, మినీ టీచర్లకు, హెల్పర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చట్టాన్ని అమలు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్‌కు రూ.5 లక్షలు ప్రకటించాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను ఎటువంటి షరతులు లేకుండా మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా మార్పు చేస్తూ ప్రభుత్వం వెంటనే జీవో ఇవ్వాలని మినీ అంగన్వాడీ కేంద్రాలకు హెల్పర్లు నియమిస్తూ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టిన నేపథ్యంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ, ఏఐటియుసి కమిటీల ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణ కేంద్రంలో తొలిరోజు సమ్మెను అంబేద్కర్ సెంటర్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు బి.వెంకటరెడ్డి, ఎన్.నాగరాజు, జి.లక్ష్మీకాంత్, అజయ్ కుమార్, ఎం.సుబ్బలక్ష్మి, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు ఝాన్సీ, అనురాధ, అధ్యక్ష, కార్యదర్శులు లలిత, విజయలక్ష్మి, మినీ అంగనవాడి టీచర్స్ సమ్మెలో పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లను పర్మినెంట్ చేయాలి : రమేష్

బూర్గంపాడు : అంగన్వాడీ టీచర్లను పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ అన్నారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన నిరవధిక సమ్మె పిలుపుతో మండల కేంద్రంలో సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం 120 మంది అంగన్వాడీలు సమ్మె దీక్ష శిబిరంలో పాల్గొన్నారు. దీక్ష శిబిరాన్ని సీఐటీయూ మండల కన్వీనర్ బర్ల తిరుపతిరావు ప్రారంభించగా ఏజే రమేష్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది అంగన్వాడీలు ఈ నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నిట్ట అనసూయ, కేసుపాక వెంకటరమణ, లెక్కల పద్మ, రాయల వెంకటేశ్వర్లు, బయ్య రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాలు ఉధృతం

కొత్తగూడెం : అంగన్‌వాడీల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.పద్మ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్నలు స్పష్టం చేశారు. సోమవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ చిల్డ్రన్ పార్క్ ఎదురుగా ఏర్పాట్లు చేసిన దీక్షా శిబిరాన్ని వారు ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అంగన్ వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా కొత్తగూడెం పట్టణంలోని అంగన్వాడీ నిరవధిక సమ్మె చేయడం జరుగుతుందని చెప్పారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పద్మ, కళావతి, మాధవి, శైలజ, జయలక్ష్మి, పుష్ప, సునీత, జుబేదా, తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాడ్యూటీ చట్టం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో టెంట్ వేసి నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా అర్జున్, సీపీఐ(ఎం) నాయకులు చిరంజీవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు రాధ, రాజేశ్వరి, ఉష, వాణి, విజయ, లక్ష్మి కృష్ణవేణి, ప్రవీణ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పద్మ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా జూలూరుపాడులో సమ్మె శిబిరాన్ని సోమవారం వారు ప్రారంభించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) మండల నాయకులు వలమల చందర్ రావు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కె చాంద్ పాషా, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు లలిత, సీత, మహాలక్ష్మి రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట : తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగనవాడీ టీచర్లు, మినీ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు నిరవధిక సమ్మెలో సోమవారం పాల్గొన్నారు. వారికి సంఘీభావంగా సీపీఐ(ఎం), సీపీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు వారి సమస్యల పరిష్కారం అయ్యేవరకు మీకు అండగా ఉంటామని వారికి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ నాయకులు యార్లగడ్డ భాస్కర రావు, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ, సీపీఐ (ఎం) మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు శ్రీనివాసరావు, కొలిగిపోగు శ్రీనివాసరావు, సీపీఐ మండల నాయకులు శివకృష్ణ పాల్గొన్నారు.

కొత్తగూడెం : అంగన్వాడీ నిరవధిక సమ్మె విచ్ఛిన్నం చేసేందుకు రాష్ట్ర బీఆర్ఎస్ ప్రభుత్వ కుట్రలకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మధ్యాహ్న భోజనం కార్మికులు, ఆశా వర్కర్లు, ఐకేపీ వీఓఏలు బలి కావద్దని సిఐటియూ జిల్లా కార్యదర్శి ఏజె.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేయడంలో దిట్ట అని, కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని విమర్శించారు. సమ్మెలో ఉన్న అంగన్వాడీ కార్మికులకు అన్ని మండల కేంద్రాల్లో సంఘీభావం తెలపాలని ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకేపీ.విఓఏ, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఏజే.రమేష్ విజ్ఞప్తి చేశారు.

చోరీ కేసులో దొంగల అరెస్ట్

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం 2 టౌన్ పరిధిలో 2 ఇంక్లైయిన్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఒక ఇంట్లో జరిగిన దొంగతనం విషయంలో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి చోరీకి గురైన గృహోపకరణ వస్తువులు, టీవి, రూ.46,300లు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. నిందితుల వివరాలు రామవరం, 2 ఇంక్లైయిన్‌కు చెందిన ఆడెపు క్రాంతి కుమార్, పాల స్పందన, రామవరం వేణుగోపాల స్వామి గుడి ప్రాంతానికి చెందిన బండి పోచమ్మ అలియాస్ సునీతలను ఆరెస్టుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సింగరేణిలో అక్టోబర్ 28న ఎన్నికలు

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి సంస్థలో ఎన్నికలు నిర్వహణకు కార్యచరణ మొదలైంది. ఎట్టలకు సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ముందుకు వచ్చినట్లు తెలుస్తుంది. అనేక సంవత్సరాలుగా సింగరేణిలోని జాతీయ కార్మిక సంఘాలు సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాయి. యాజమాన్యానికి వినతులు, హైద్రాబాద్ రీజనల్ లేబర్ కమీషనర్ ఆద్వర్యంలో జరిగిన చర్చల నేపద్యంలో ఎన్నికలకు పచ్చజెండా ఊపినట్లు సమాచారం. సోమవారం హైద్రాబాద్‌లో డిప్యూటీ సిఎల్సి ఆఫీసులో సింగరేణి ఎన్నికలపై జరిగిన చర్చలలో ఈనెల 22వ తేదీన మరల సమావేశం నిర్వహించాలని, రోజున ఎన్నికల షెడ్యూలు విడుదల చేయాలని కోరారు. ఇందులో సింగరేణిలోని రెండు కార్మిక సంఘాలు తప్ప, మేనేజ్మెంట్ డిప్యూటీషియల్సి అన్ని యూనియన్లు ఒప్పుకోవటం జరిగింది. అక్టోబర్ 28వ తారీఖున ఎన్నికల నిర్వహించటానికి అగ్రిమెంట్ చేయడం జరిగింది. సంస్థలో ఎన్నికలు నిర్వహించేంతవరకు యాజమాన్యం అన్ని లేబర్ యూనియన్లను సమానంగా చూడాలని నిర్ణయించాయి. ఇందుకు గాను సింగరేణి అన్ని మైన్స్, డిపార్ట్‌మెంట్స్‌కి, సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల జనరల్ మేనేజర్లకు ఉత్తర్వులు జారీచేస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడం జరిగింది. దీంతో ఇప్పటి వరకు రాష్ట్రంలో సాధారణ ఎన్నికల వేడి ఉంది. సింగరేణిలో ఎన్నికల నిర్వహణకు యాజమాన్యం సుముఖత చూపడంతో సింగరేణి కార్మిక సంఘాల ఎన్నికల వేడి వాతావరణం పెరగనుంది.

పర్ణశాలలో వినాయక నిమజ్జనాలకు అనుమతి లేదు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల గోదావరి నది తీరాన ప్రతి ఏడు వినాయక నిమజ్జనాలకు తగు ఏర్పాట్లు చేయడం జరిగేదని, కానీ ఈ ఏడాది పర్ణశాల గ్రామంలో జరుగుతున్న సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పనుల వలన వినాయక నిమజ్జనాలు జరుపుటకు అనుమతి లేదని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ఇట్టి విషయాన్ని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు దుమ్ముగూడెం మండలంలోని అన్ని వినాయక విగ్రహాలను భద్రాచలంలోనే నిమజ్జనం చేయుటకు తగు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. కావున వినాయకుల నిమజ్జనానికి ప్రతి ఒక్కరూ భద్రాచలం వెళ్లి నిమజ్జనం చేసుకోవచ్చని తెలిపారు.

గిరిజన దర్బార్‌కు విశేష స్పందన

నవతెలంగాణ-భద్రాచలం



ఆదివాసీ గిరిజన గ్రామాలలో డెంగ్యూ వ్యాధులు ప్రబలుతున్నందున ఆశ్రమ పాఠశాలలో చదివే గిరిజన విద్యార్థినీ, విద్యార్థుల పట్ల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో యూనిట్ అధికారుల సమక్షంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన ఆర్జీలు స్వీకరించి, తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపతు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు ఆదేశించారు. సోమవారం గిరిజన దర్బార్లో ఎక్కువ శాతం అర్జీలు పోడు భూముల సమస్యలు, పట్టా భూములకు రైతుబంధు రుణాలు, పోడు పట్టాలు, పోడు పట్టాలు అస్సైన్ చేయించుట, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, గిరిజన గురుకుల పాఠశాల, ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో సీట్లు, ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో జీవన భృతి పెంపొందించుకోవడానికి శిక్షణలు ఇప్పించుట, వ్యవసాయానికి సంబంధించి కరెంటు, బోరు, మోటార్లు, ఒంటరి మహిళ, వితంతు మహిళ పించన్లు, ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ ప్రోత్సాహకాలు ఇప్పించుట, పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం అందించుట, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట, నూతనంగా ఏర్పాటు చేసిన మత్స్యకారుల సొసైటీ రిజిస్ట్రేషన్ చేయించుట, గిరిజన గ్రామాలలో రోడ్డు సౌకర్యం కల్పించుట, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు గిరిజనులు దరఖాస్తులు చేసుకున్నారని ఆయన అన్నారు.

అర్హులైన ప్రతి గిరిజనులకు విడతల వారీగా తప్పనిసరిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ ఇన్చార్జి ఆర్‌సీఓ గురుకులం డేవిడ్ రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, ఎస్ఓ సురేష్ బాబు, డీటీఆర్ఓ ఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏపీవో పవర్ మునీర్ పాషా, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్, ఉద్యానవనాధికారి అశోక్ కుమార్, డీఎస్ఓ ప్రభాకర్ రావు, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యానికి పొంచి ఉన్న ప్రమాదం

- సీపీఐ(ఎం) నాయకులు పుల్లయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఎందరో దేశభక్తులు, విప్లవ వీరులు త్యాగ ఫలంగా లభించిన ప్రజాస్వామ్యానికి మతోన్మాదులు, పెట్టుబడిదారులు ముసుగులో ఉన్న నేటి పాలకులతో ప్రమాదం పొంచి ఉందని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేసారు. పార్టీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ రైతాంగ వార్షికోత్సవ సభల్లో భాగంగా సోమవారం పార్టీ మండల కమిటీ అధ్వర్యంలో నందిపాడులో ఏర్పాటు సభకు ఆయన హాజరై మాట్లాడారు. మండల కార్యదర్శి చిరంజీవి అధ్యక్షతన జరిగిన ఈ సభలో పుల్లయ్య మాట్లాడుతూ స్వాతంత్ర సమరంతో గానీ, రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలు కూడా తెలియని, ఆర్ఎస్ఎస్ భావజాలంతో పాలన చేస్తున్న నేటి పాలకులు ప్రజానీకం పట్ల అత్యంత నిరంకుశంగా వ్యవహరించడం బాధాకరం అన్నారు. పురోగామి శక్తులు ఐక్యం కాకపోతే తిరోగామీ దిశగా సమాజాన్ని తీసుకెళ్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఊకే వీరస్వామి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కో-కన్వీనర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

కొత్తగూడెం తెలంగాణను ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కో-కన్వీనర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని బూడిదగడ్డ 2వ వార్డులో గడపగడపకి కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా పొంగులేటి మాట్లాడుతూ బంగారు తెలంగాణ బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని గొప్పలు చెప్పిన కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చినాడని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే డబల్ ఇండ్లు, పెన్షన్లు, యువతకు ఉద్యోగాలు ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారం వచ్చాక రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం దోచుకుంటుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఊకంటి గోపాలరావు, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు, ఆళ్ళ మురళి, తూము చౌదరి, నాగేంద్ర త్రివేది, లింగం పిచ్చి రెడ్డి, తాండ్ర నాగబాబు, గుడ్ల ఉమా, రావూరి వీరభద్రం, మారెడ్ల నరసింహారెడ్డి, బాల ప్రసాద్ పాసి, గుడివాడ రామ లక్ష్మణ్, గౌస్, అయూబ్, సుందర్‌లాల్ కోరి, నిరంజన్ రెడ్డి, దుర్గ రాశి సతీష్, మున్నా, విజయ తదితరులు పాల్గొన్నారు.



16న కలెక్టరేట్ ముట్టడి : కాసాని

నవతెలంగాణ-సుజాతనగర్

ఈ నెల 16న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు కాసాని ఐలయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గొల్ల కురుమలకు ఎటువంటి షరతులు విధించకుండా నగదు బదిలీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బీటీం కూడా గొర్రెలకు బదులు నగదు బదిలీ పథకం ఇల్లు లేని వారికి గృహలక్ష్మి పథకం ఇవ్వాలన్నారు. 50 ఏండ్లు దాటిన కాపరులకు రూ.5000 పెన్షన్, ఉపాధి హామీకి ఎటువంటి సంబంధం లేకుండా గొర్రెల షెడ్ల నిర్మాణం, ప్రతి సొసైటీకి 20 ఎకరాల ప్రభుత్వ భూమిని చూపించాలన్నారు. సొసైటీలకి తక్షణమే ఎన్నికల నిర్వహణ వంటి సమస్యలపై ఈ నెల 16న కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తున్నామని, గొర్రెల కాపరులు పెద్ద ఎత్తున ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బచ్చలకూర శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు మల్లె పోయిన లింగయ్య, కాట్రాల తిరుపతిరావు, మండల కమిటీ సభ్యులు వీర్ల ముత్తయ్య, లిక్కి నాగరాజు, కొంపెల్లి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను విస్మరిస్తున్న యాజమాన్యం, ప్రభుత్వం

నవతెలంగాణ-కొత్తగూడెం

ఇల్లందులో జరిగిన ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సులో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పెద్దబోయిన సతీష్ మాట్లాడుతూ సింగరేణిలో సుమారుగా 30 వేల మంది కాంటాక్ట్ కార్మికులు గత 20 సంవత్సరాల నుండి సింగరేణిలో ఉన్న వివిధ రంగాలలో విధులు నిర్వహిస్తున్నారని, పర్మినెంట్ కార్మికులతో సమానంగా విధులు నిర్వహిస్తూ సింగరేణి లాభాల బాటలో పయనించుటకు పరోక్షంగా, ప్రత్యక్షంగా వీరి శ్రమ ఉందన్నారు. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై, జీతాలు పెంచే విషయంలో మొండిగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రగతి శీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియూ) ఇల్లందులో జరిగిన రాష్ట్ర సదస్సులో దశల వారి ఆందోళన కార్యక్రమాలకు సెప్టెంబర్ 20 నుండి అక్టోబర్ 12 వరకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలకు పిలుపు నిచ్చిందని, 13న ఛలో హెచ్‌ఆఫీస్ ముందు ధర్నా ఉంటుందని చెప్పారు.

కామ్రేడ్ యర్రయ్య మృతి పార్టీకి తీరనిలోటు

నవతెలంగాణ-జూలూరుపాడు

సీపీఐ(ఎం) నాయకులు ముత్తి చిన్న యర్రయ్య మృతి పార్టీకి తీరనిలోటని పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్ అన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న యర్రయ్య తీవ్ర అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్ సోమవారం యర్రయ్య భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడారు. యర్రయ్య మృతి పట్ల విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి కాలం కృష్ణ, పార్టీ సభ్యులు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, నీలం రాకేష్, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలే శరణ్యం

నవతెలంగాణ-టేకులపల్లి

రాష్ట్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ మినీ టీచర్స్ సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న సమ్మె అంగన్వాడీ కేంద్రాలు సమ్మె ఎఫెక్ట్‌తో దాదాపు 90శాతం కేంద్రాలు మూతపడ్డాయని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా నాయకురాలు స్థానిక మండల నాయకురాలు కే.శకుంతల, వై.ఇందిరా తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు సమ్మె విజయవంతంగా జరిగిందన్నారు. ఈ సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె నేటి నుండి ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో వై.పద్మావతి, ఎన్.విజయలక్ష్మి, కె.భద్రమ్మ, వి.సంధ్యారాణి, బి.సునీత, కే.రాజేశ్వరి, పి.రాజేశ్వరి, ఎం.సుజాత, ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కొత్తగూడెం



"తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు" ఏర్పాటు చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ కో-చైర్మెన్, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్, చిల్డ్రన్స్ పార్క్ (అమరుల వీరుల ప్రాంగణం) వద్ద టీయూఎఫ్ (తెలంగాణ ఉద్యమకారుల ఫోరం) ఆధ్వర్యంలో "తెలంగాణా ఉద్యమకారుల ఆత్మగౌరవ శాంతిదీక్ష" కార్యక్రమం ఏర్పాటు చేశారు. తెలంగాణ ఉద్యమకారులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని పొంగులేటి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యమకారులకు మద్దతు తెలిపి, తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్ల కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హామీ ఇచ్చి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డ్ ఏర్పాటు విషయంలో పెద్దన్న పాత్ర తీసుకుంటా అని పొంగులేటి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పూకంటి గోపాలరావు, టీపీసీసీ సభ్యులు నాగ సీతరాములు, తూము చౌదరి, ఆళ్ళ మురళి, నాగేందర్ త్రివేది, ఇజ్జగాని రవిగౌడ్, బత్తిన రాజశేఖర్, తాండ్ర నాగ బాబు, పిట్టల రామారావు (అడ్వకేట్) మారెడ్ల నరసింహ రెడ్డి, కొత్తగూడెం నియోజకవర్గ పొంగులేటి అభిమానులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

తుమ్మలను కలసిన మండల కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావును మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆధ్వర్యంలో తుమ్మల స్వగ్రామం గండుగుల పల్లిలోని ఆయన నివాస గృహంలో కలసి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. భద్రాచలం నియోజకవర్గం మరింత అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వారు తుమ్మల తెలియజేశారు. మంత్రిని కలసిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు లంకా శ్రీనివాసరావు(అబ్బులు), యూత్ అధ్యక్షులు కోడి చంటి, తోటమళ్ల సంగీతరావు, దర్శి సాంబశివరావు, శీరపు అప్పలరెడ్డి, సోషల్ మీడియా జిల్లా చైర్మన్ కనుబుద్ధి దేవా, కంగాల వెంకటేశ్వర్లు, మద్ది కుమారి, లంకా శివ, సందీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రామకృష్ణను అభినందించిన లయన్ డా.గోళ్ళ భూపతి రావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం గ్రామానికి చెందిన చింతాది రామకృష్ణ పర్యావరణ ప్రేమికులు గ్రీన్ భద్రాద్రిలో కొనసాగుతూ తనవంతు సహకారం అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరు ఒక రాజకీయ పార్టీలో కొనసాగుతూ చురుకుగా పేదలకు సహాయం, అభివృద్ధి ఫలాలు నిరుపేదలకు అందించడంలో తనవంతు పాత్ర నిర్వహిస్తూ ముందుకు వెళుతున్నారు. ఇటీవల వీరి సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆర్టీసీ గేట్ దగ్గర వేం చేసి ఉన్న కనక దుర్గ అమ్మవారి దేవాలయంనకు అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా ప్రముఖ పర్యావరణ ప్రేమికులు రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత లయన్ డా.గోళ్ళ భూపతి రావు, సంఘ సేవకులు కడలి నాగరాజు, దేవాలయం పూజారి శివకోటి విశ్వనాథం శ్రీ రామకృష్ణను దుస్సాలువతో సన్మానించారు.

రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నవతెలంగాణ-మణుగూరు



మండలంలో సుమారు రెండు కోట్ల అభివృద్ధి పనులకు విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాత మధు సోమవారం ప్రారంభించారు. మండలంలో గుట్ట మల్లారం, లంక మల్లారం, ఉడతనేని గుంపు గ్రామాలలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, కమ్మ సంఘం కమ్యూనిటీ హాల్, పెరిక సంఘం కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణం కోసం పనులకు శంకుస్థాపనలు చేశారు. గుట్ట మల్లారం గ్రామంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం సింగరేణి సిఎస్ఆర్ నిధులతో సుమారు రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న పనులకు శంకుస్థాపన చేశారు. లంక మల్లారం గ్రామంలో కమ్మ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎస్‌డీఎఫ్ నిధులతో సుమారు రూ.1 కోటి అంచనా వ్యయంతో నిర్మించనున్న పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థల దాత అయిన పోశం పుల్లయ్య, ధనమ్మ దంపతులను సన్మానించారు. ఉడతనేని గుంపు గ్రామంలో పెరిక సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎస్‌డీఎఫ్ నిధులతో సుమారు రూ.50 లక్షల రూపాయలు అంచనా వ్యయంతో నిర్మించనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్ రావు, జిల్లా జడ్పీ వైస్ చైర్పర్సన్ కంచర్ల చంద్రశేఖర రావు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ ప్రియాంక అలా
- ప్రజావాణిలో అధికారులకు ఆదేశం

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశపు హాలులో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు నిషిత పరిశీలన చేయాలని, ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కరించాలని ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు కొన్ని ఎలా ఉన్నాయి పాల్వంచ మండలం, పాత పాల్వంచకు చెందిన పెరుమాళ్ళపల్లి మరియమ్మ భర్త జాన్ మోజేష్ తమకు వివాహం జరిగి 35 ఏండ్లు తమకి ఒక సంతానమని, కూలి పనులు చేసుకుంటూ ఇన్ని సంవత్సరములు కిరాయి ఇండ్లలో జీవనం కొనసాగిస్తున్నామని తమ ఆర్థిక పరిస్థితి కిరాయి కట్టుకోలేని స్థితిలో ఉన్నందువలన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయవలసిందిగా చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం డీఆర్‌వోకు ఎండార్స్ చేశారు. అశ్వారావుపేట మండలం, పాపిడి గూడెంకు చెందిన నాలి మహా లక్ష్మయ్య సర్వే నెం: 909/1లో 3 ఎకరాల భూమి కలదని, సదరు భూమి తమ ఆధీనంలోనే ఉన్నదని, కానీ ధరణి పోర్టల్ నందు అదే గ్రామానికి చెందిన ఆళ్ల నాగేశ్వరరావు గంగాజలం, ఆళ్ల లక్ష్మీనారాయణల పేరుమీద అయి ఉన్నాయని వారి పేర్లను ఆన్లైన్ నుంచి రద్దు పరచి అసలు హక్కుదారులైన తమ పేరును ధరణి పోర్టల్ యందు నమోదు చేయవలసిందిగా చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం ఆర్‌ఏఓ కొత్తగూడంకు ఎండార్స్ చేసినారు. కొత్తగూడెం మండలం, రామవరంకు చెందిన మహమూదా బేగం తన భర్త చనిపోవడం వలన కూలి పనులకు వెళ్తూ పిల్లలను పోషించుకుంటున్నానని కుటుంబ పోషణ భారమైనదని, ముస్లిం మతానికి చెందిన వారమని తనకి ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేయగా పరిశీలించిన కలెక్టర్ తగు చర్య నిమిత్తం ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం నాయకులగూడెంకు చెందిన ఆదివాసి గిరిజనులు తాము 2010 సంవత్సరము నుండి పోడు నరుక్కొని, ఈ పోడు భూమిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని తమ భూమిని దేవీలాల్ అనే భూస్వామి అధికార బలంతో దొంగ పట్టాలు చేయించుకుని ఈ భూమిని అనుభవించుటకు ప్రయత్నిస్తున్నాడని తమకు న్యాయం చేయాలని దరఖాస్తు చేయగా పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం కొత్తగూడెం ఆర్డీవోకు ఎండార్స్ చేశారు. తదితర మండలాల నుంచి వచ్చిన ధరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్ రాజు, డిఆర్ఓ రవీంద్రనాథ్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీతకు యం.చిన్ననాగయ్య స్మారక జాతీయ పురస్కారం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలానికి చెందిన ప్రముఖ కవయిత్రి సోంపాక సీతకు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు యం.చిన్ననాగయ్య స్మారక జాతీయ పురస్కారానికి కవిత్వవిభాగానికి గాను లభించింది. ఇట్టి పురస్కారాన్ని అక్టోబరు నెలలో తిరువూరు సాహితీసభలో అందజేస్తామని నాగయ్య మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి యం.రాం ప్రదీప్ తెలియపరుస్తూ కవిత్వ విభాగంలో గెలుపొందిన కవయిత్రి సోంపాక సీతకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు అమలులో అధికార పార్టీ నేతల జోక్యం తగదు

- పేదలకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-ములకలపల్లి



ప్రభుత్వ పథకాలు అమలులో అధికార పార్టీ నేతల జోక్యం తగదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అధికార పార్టీ నేతల జోక్యం ఏమిటని, దీని ద్వారా అసలైన లబ్దిదారులకు న్యాయం జరగకపోగా అనర్హులకు లబ్ది చేకూరుతుందని, కమీషన్‌లకు కక్కుర్తి పడి పథకాలను పక్కదోవ పట్టిస్తున్నారని అన్నారు. గృహలక్ష్మి పథకం అర్హులైన వారందరికీ వర్తింపజేసి, రూ.5లక్షల వ్యయంతో ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత బంధు తదితర పథకాలు లబ్దిదారులు ఎంపిక గ్రామ సభల ద్వారా చేయాన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు అరికట్టాలని ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు గౌరీ నాగేశ్వరరావు, పూకంటి రవికుమార్, పొడియం వెంకటేశ్వర్లు, రావుజా, దేవేందర్, సామిని, లక్ష్మినర్సయ్య, తిమ్మంపేట సర్పంచ్ గౌరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'నాదెండ్ల'ది నిబద్ధత కలిగిన జీవితం

- సంతాప సభలో కొనియాడిన పలువురు

నవతెలంగాణ-పాల్వంచ



పాల్వంచ ప్రముఖులు కీర్తిశేషులు నాదెండ్ల వెంకటేశ్వరరావు నిబద్ధత కలిగిన జీవితంతో పాటు తన తోటి వారిని ఎంతోమందిని వృత్తిపరంగా అభివృద్ధి చేసిన ఆయన జీవితం ధన్యమైందని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధు, భద్రాచలం ఎమ్మెల్సీ పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) నాయకులు కాసాని ఐలయ్య, ఏజే రమేష్, కొండపల్లి పవన్, అన్నవరపు సత్యనారాయణ, దొడ్డ రవికుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోనేరు సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని మథర్ తెరిసా బీఈడీ కళాశాల ప్రాంగణంలో నాదెండ్ల సంతాప సభ ఘనంగా జరిగింది. అతిథులకు నాదెండ్ల కుమారుడు వర కిషోర్, నాదెండ్ల అపర్ణ, కుమార్తె వనలత, అల్లుడు డాక్టర్ బిక్కసాని, డాక్టర్ సుధాకర్ రావులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించి సంతాప సభలో వారు మాట్లాడారు. తనతోపాటు ఎంతో మందికి వ్యాపార బాధ్యతలను అప్పగించి ఎన్నో కుటుంబాలను పై స్థాయికి తీసుకురావడం జరిగిందని అన్నారు. పాల్వంచలో వర్తక సంఘాన్ని స్థాపించడంతోపాటు కళాకారులకు ఎంతో సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ కొత్తగూడెం నుండి వైద్యులు డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ బుచ్చయ్య, పాల్వంచ, కొత్తగూడెం ప్రముఖులు పాల్గొన్నారు.

తుమ్మలను కలిసిన భద్రాచలం ఎమ్మెల్యే

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం శాసనసభ్యులు పొదెం వీరయ్య సోమవారం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గండుగలపల్లిలో తుమ్మల నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తుమ్మలకు జ్ఞాపకం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుడగం శ్రీనివాస్, చింతిరేల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఖోఖో పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థినీలు

- అభినందించిన ప్రిన్సిపాల్ అరుణకుమారి

నవతెలంగాణ-ఇల్లందు

మండలంలోని సుదిమల్ల టీటీడబ్ల్యూఆర్జెసీ(జి) విద్యార్థినీలు కోకో, బాడీ వెయిట్ క్యాటగిరిలో ప్రతిభ కనబరిచారు. 10న ఖమ్మంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయి కోకో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 11 మంది విద్యార్థినీలు పాల్గొన్నారు. వివిధ కేటగిరీలలో 5 బంగారు, 5 రజిత, 2 కాస్య పతకాలు సాధించారు.

బాడీ వెయిట్ క్యాటగిరిలో పతకాలు సాధించిన విద్యార్థినీలు

ఎస్కె.ఆష్య 40 కేజీలు సిల్వర్, హర్షిత 45 కేజీలు గోల్డ్, బిందు 49 కేజీలు సిల్వర్, యోగ్నిత 49 కేజీలు యూత్ జూనియర్ గోల్డ్, పి.సుభద్ర యాభై ఐదు కేజీలు యూత్ జూనియర్ గోల్డ్, ఎన్. హాసినీ 55 కేజీలు సిల్వర్, సిహెచ్. మోహన 59కేజీలు సిల్వర్, భువనేశ్వరి 64 కేజీలు బ్రాచ్, శ్రీ విద్య 71కేజీలు సిల్వర్,నీరజ 71కేజీలు బ్రాచ్సాధించారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణకుమారి, జూనియర్ లెక్చరర్స్, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. కళాశాలకు, తల్లిదండ్రులను పేరు తెచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

7 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దుమ్ముగూడెం పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రమైన లక్ష్మీనగరం గ్రామంలో గల ఓ ఇంట్లో పీడీఎస్ బియ్యం ఉన్నాయనే పక్కా సమాచారంతో ఎస్సై పోటు గణేష్ సిబ్బందితో కలసి సోదాలు నిర్వహించి రేషన్ బియ్యాన్ని స్వాధీన పర్చుకుని పంచనామా అనంతరం సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. సోదాలు నిర్వహించిన వారిలో హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, కానిస్టేబుల్ నరేష్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

బోడా శ్రీనివాస్ విగ్రహావిష్కరణకు హాజరైన కోరం

నవతెలంగాణ-టేకులపల్లి

టేకులపల్లి సర్పంచ్ బోడా సరిత భర్త, మాజీ బీఆర్ఎస్ మండల నాయకుడు స్వర్గీయ బోడా శ్రీనివాస్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మెన్ కోరం కనకయ్య హాజరై, ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, ఎంపీటీసీ బానోత్ సరోజినీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, బోడా మంగీలాల్ నాయక్, సర్దార్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నయవంచనకు గురవుతున్న గిరిజన రైతులు

- ఇన్సూరెన్స్ కడితేనే క్రాప్ లోనేంటి?
- సమాచార హక్కు ద్వారా నివేదిక కోరిన సీపీఐ(ఎం)

నవతెలంగాణ-చర్ల



రైతే దేశానికి వెన్నెముకని చెప్పుకోవడానికి తప్ప ఏజెన్సీలో రైతు పట్ల కొద్దిగా కూడా జాలి, కరుణ లేకుండా కొంతమంది వ్యవహరిస్తున్నారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కారం నరేష్ నిప్పులు చెరిగారు. సోమవారం మండల పరిధిలోని అర్.కొత్తగూడం ఏపీజీవీబీ బ్యాంక్ ఆవరణలో ఆయన మాట్లాడారు. ఆరు కాలం కష్టపడి రూపాయి రూపాయి కూడ పెట్టి జీవనోపాధి కోసం వ్యవసాయం చేసే రైతన్నకు బ్యాంకులు రుణాలు ఇచ్చి ఆదుకోవాల్సింది పోయి మధ్యవర్తుల మాటలు నమ్మి అర్ కొత్తగూడం ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ రైతులకు ఇచ్చిన క్రాప్ లోనుల్లో ఇన్సూరెన్స్‌కు చెల్లించాలంటూ హుంకు ప్రదర్శించడం సరికాదని ఆయన హితోపలికారు. అమాయక ఆదివాసి రైతులే లక్ష్యంగా సదర్ బ్యాంక్ మేనేజర్ ఓ మధ్యవర్తి చాలా అక్రమాలకు పాల్గొన్నట్లు కుర్నపల్లి, బోధనెల్లి, చింతగుప్ప ఎర్రబోరు మొదలు గ్రామాలలో రైతులు నాతో వాపోయారని మేనేజర్ తన పద్ధతి మార్చుకొని సేవలందిస్తారని అనుకుంటుంటే తన వైఖరి మార్చుకోకుండా అక్రమ కల్ప రవాణా సైతం గిరిజనులతో చేపించి నేడు గిరిజన రైతులను అపాసు పాలు చేస్తున్నాడని ఆయన విరుచుకుపడ్డాడు.

ఇన్సూరెన్స్ కడితేనే క్రాప్ లోనేంటి..

ఇన్సూరెన్స్ కడితేనే గ్రాఫ్ లోన్ ఇస్తానంటూ ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అసలు క్రాఫ్ లోన్ తీసుకోవడానికి ఇన్సూరెన్స్‌కి సంబంధం ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎండనక, వాననక, చలనకా రాత్రనకా, పగలనకా పాము, తేలులను సైతం లెక్కచేయకుండా ప్రాణానికి తెగించి పండించే పంటకు మద్దతు ధర లభించక నాన్న అవస్థలు పడుతున్న రైతులకు క్రాఫ్‌లోని ఇవ్వడానికి ఇన్సూరెన్స్ తిరఖాస్తు పెట్టడం ఏమిటని ఆయన ధ్వజమెత్తారు. రైతుల ఖాతా పుస్తకాలలో లావాదేవీలను ముద్రించి ఇవ్వడంలో బ్యాంకు మేనేజర్ ఎందుకు తాస్కారం చేస్తున్నారని ఇన్సూరెన్స్ కట్టించినంత చురుకుగా బ్యాంకు ఖాతాల్లో ముద్రించడంలో ఎందుకు చొరవ చూపటం లేదని ఆయన దుయ్యబట్టారు.

సమాచార హక్కు ద్వారా నివేదిక కోరిన సీపీఐ(ఎం)

సమాచార హక్కు ద్వారా ఏపీజీవీబీ బ్యాంకులో జరిగిన అవకతవకలపై సీపీఐ(ఎం) నివేదికను కోరింది. 2021 మార్చి ఒకటవ తారీఖు నుండి 2023 సెప్టెంబర్ 11వ తారీకు వరకు ఆర్.కొత్తగూడెం ఏపీజీబీ బ్యాంకులో జరిగిన అవకతవకలపై సమగ్రమైన నివేదిక ఇవ్వాలని, ముద్రణాలోన్లు, క్రాప్ లోన్లు, ఇన్సూరెన్స్ వివరాలు క్షుణ్ణంగా మొత్తం ఇవ్వాలని మండల కార్యదర్శి కారం నరేష్, మండల కమిటీ సభ్యులు కుంజా వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నూపా కృష్ణ, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

నవతెలంగాణ-సుజాతనగర్



అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల నందు డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్ వారు నిర్వహించినటువంటి మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. కళాశాల చైర్మెన్ దోస్పాట్ వెంకటేశ్రావు, సెక్రటరీ చావా లక్ష్మీనారాయణ, డీఈఈటీ జనరల్ మేనేజర్ అనిల్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతా నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని దాన్లో భాగంగానే మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ జాబ్ మేళా నందు 25 కంపెనీల వారు పాల్గొంటున్నారని రానున్న రోజుల్లో తమ కళాశాల ద్వారా మరిన్ని జాబ్ మేళాలో నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. పదో తరగతి డిగ్రీ బి.టెక్ పీజీ ఫార్మ చదివిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని తెలిపారు. ఎంపికైన వారికి పదివేల నుండి 40 వేల వరకు జీతాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఫార్మా మెడికల్ ఐటి బ్యాంకింగ్ వండి కంపెనీల వారు జాబ్ మేళాలో పాల్గొన్నారు. జాబ్ మేళాకు 1500 మంది రిజిస్ట్రేషన్ చేసుకోక 900 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారని వారి ప్రతిభ ఆధారంగా 400 మందిని ఎంపిక చేసినట్లు డీఈఈటీ వారు తెలిపారు. అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల నందు రానున్న రోజుల్లో క్యాంపస్ ప్లేస్మెంట్స్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీ.సీతారాం ప్రసాద్, రమేష్, శ్రీకాంత్, సైదయ్య, హెచ్‌ఓడీలు బాబురావు, లక్ష్మతి, మునీర్, వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్, రవికిరణ్,శ్రీనివాస్, అధ్యాపకులు డింపుల్, శృతి, వాణి, శిరీషయ్య సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని చెరువుమాదారం గ్రామంలో ఇటీవల మరణించిన రాతికింది సాయికిరణ్, కొండ పున్నయ్య కుటుంబాలను సోమవారం పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా సాయి కిరణ్, కొండా పున్నయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలకు పదివేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ నంబూరి శాంతకుమారి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, ఎన్నబోయిన శ్రీను, నంబూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మడుపల్లి పూర్వ విద్యార్థికి ఎంబిబిఎస్ సీటు

నవతెలంగాణ-మధిర

జడ్పీహెచ్ఎస్ మడుపల్లి పూర్వ విద్యార్థి ఏసుపోగు సందీప్ ఎంబిబిఎస్ సీటు సాధించిన సందర్భంగా హెచ్ఎం. కే.పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.నరసింహారావు, బి.కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీపీఐ యువ నాయకుడి మృతి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పట్టణానికి చెందిన సీపీఐ యువ నాయకుడు ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి బల్ల సాయికుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. గత వారం రోజుల నుండి వైరల్ జ్వరంతో బాధపడుతూ ఆదివారం ఖమ్మంలోనే ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. బల్ల సాయికుమార్ వామపక్ష భావాలతో విద్యార్థి దశనుండే ఏఐఎస్ఎఫ్ నుండి సిపిఐ పార్టీలో అంచలంచలుగా ఎదుగుతూ ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శిగా సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతున్నారు.
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ రావులపల్లి రాంప్రసాద్, బి. అయోధ్య, రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్, పట్టణ కార్యదర్శి ఆకోజ్ సునీల్ కుమార్ సంతాపం ప్రకటించి సానుభూతిని వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు

నవతెలంగాణ-ములకలపల్లి

ములకలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం విద్యుత్ టీఎస్ఎన్పీడీసీఎల్ వినియోగదారులు లోకల్ కోర్టు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మెన్ ఎన్వీ. వేణుగోపాలచారి సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లోకల్ కోర్టు జరుగుతుందని తెలిపారు. ఈ లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్ ఫార్మర్లు మార్చడం, వోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ పెంపుదల, అదనపు లోడు క్రమబద్ధీకరణ, సర్వీసు పేరుమార్పు, వాడకం కన్నా హెచ్చు మొత్తంలో బిల్లులు, కేటగిరి మార్పు, సర్వీస్ రద్దు తదితర వాటికి సంబంధించి పాల్వంచ, ములకలపల్లిలోని విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా తమ ఫిర్యాదులు అందిచవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమరుల సేవలు స్ఫూర్తిదాయకం

నవతెలంగాణ-అశ్వారావుపేట

అడవుల సంరక్షణలో మృతి చెందిన అమరవీరుల సేవలు స్ఫూర్తిదాయకమని అశ్వారావుపేట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అరుణ్ కుమార్ అన్నారు. విధుల్లో నిస్వార్థంగా పని చేసిన కొందరు అటవీ అధికారులను అటవీ దొంగలు, స్వార్థ పరుల దాడుల్లో అమరులయ్యారని అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం పురష్కరించుకుని సోమవారం అటవీ సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎఫ్.ఎస్.ఒ లు, సంపత్, రమేష్, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆశాల అరెస్టులు అప్రజాస్వామికం

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఆశా వర్కర్లకు నిర్దిష్ట వేతనం రూ.18 వేలు ఇవ్వాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాకు వెళు తున్న ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులు ఖండిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సిఐటియూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు పై రాష్ట్ర ప్రభుత్వం విపరీతమైన పని భారం పెంచిందని, వీరికి నిర్దిష్ట వేతనం రూ.18 వేలు ఇవ్వాలని,ఇతర సమస్యల పరిష్కరించాలని సంబంధిత అధికారులు మంత్రులకు విన్నవించుకున్నా ఫలితాలు లేకపోయిందని అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ సీనియర్ నాయకులు భారతి, తిరుపతమ్మ విష్ణు, సమత, నాగమణి, వాణి, సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి బి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఉన్న భూములకు హక్కులు కల్పించండి

ఏఎస్పీ డివిజన్ అధ్యక్షులు సోంది మల్లూరు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

గిరిజనులు సాగులో ఉన్న భూములకు హక్కులు కల్పించాలని ఏఎస్పి డివిజన్ అధ్యక్షులు సోంది మల్లూరు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొంతమంతి గిరిజన రైతులకు తెలంగాణ పట్టా పాసుపుస్తకాలు అందజేయాలని కోరుతూ తహసీల్దార్ పి.చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా పేద గిరిజనులు స్వయం భుక్తి కోసం సాగు చేసుకుంటున్న భూములకు ఎటువంటి ఆంక్షలు విధించకుండా పాసుపుకాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. లేని యెడల గిరిజన రైతులతో కలసి ఆదివాసీ సంక్షేమపరిషత్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన దీక్షలకు దిగుతామని ఆయన అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఏఎస్పి మండల కన్వీనర్ రేసు ఆదినారాయణమూర్తి, నాయకులు సోంది నాగేశ్వరరావు, కోరం మురళి, కొర్సా రామచంద్రయ్య, మర్మం వెంకటేశ్వరరావు, పొడియం సీతయ్య, కల్లూరి వరలక్ష్మీ, పూనెం సీతమ్మ, గిరిజన రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు అప్రజాస్వామికమని దీనిని ప్రతి ఒక్కరు ఖండించాలని టిడిపి మండల అధ్యక్షులు కొమరం దామోదర్‌రావు అన్నారు. చంద్రబాబు అరెస్టు నిరసిస్తూ ఈ నెల 13న ఉదయం 9 గంటలకు సీతానగరం గ్రామ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

7.20 లక్షల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ఆర్‌టిసి బస్ స్టాండ్ వద్ద ఎస్ఐ విజయ లక్ష్మి పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ లో బాగంగా తనిఖీలు చేస్తుండగా, ఢిల్లీకి చెందిన ఇద్దరు షర్మిల, ఒక బాలుడు 36 కిలోల గంజాయిని ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దులలోనీ బలిమెల వద్ద కొనుగోలు చేసి ఢిల్లీ తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. గంజాయి విలువ 7.20 లక్షలు ఉంటుంది. భద్రాచలం టౌన్ సిఐ నాగరాజు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను రిమాండ్ కు తరలించారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-కారేపల్లి

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఛలో హైదరాబాద్ నేపథ్యంలో కారేపల్లి మండల ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. హైదరాబాల్ బయలు దేరిన ఆశ వర్కర్లను పోలీసులు అరెస్టు చేసి కారేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్వయం పూచికత్తుపై విడుదల చేశారు. అనంతరం వారు సీఐటీయు ఆధ్వర్యంలో కారేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. తహసీల్దార్ వంకాయ సురేష్‌కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.19వేలు ఇవ్వాలలని, ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర, హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు వాంకుడోత్ కమల, భూక్యా సుజాత, జంగ కళ్యాణి, ఆదెర్ల దేవకరణ, భూక్యా దేవి, లావుడ్యా గమిలి, వాంకుడోత్ కృష్ణమ్మ, సరోజ, ఈశ్వరి, కుంజా పద్మ జర్పుల మంగ, కుమారి, సరస్వతి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఆదర్శంగా పోటీ పడాలి

కెనరా బ్యాంక్ మేనేజర్ డి.బాలకృష్ణ



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రతి విద్యార్థి విద్యలో ఉన్నతంగా రాణించేందుకు ఆదర్శవంతంగా పోటీ పడాలని భద్రాచలం కెనరా బ్యాంకు మేనేజర్ డి.బాలకృష్ణ విద్యార్థులకు సూచించారు. బండారుగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో 2022-23 విద్యాసంవత్సరంలో 5,6,7 తరగుతలలో టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2,500 క్యాష్ అవార్డును ఆయన చేతుల మీదుగా అందజేశారు. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలీటీలో భాగంగా కెనరా విద్యాజ్యోతి పథకం కింద ప్రతిభ కలిగిన ఎస్సీ, ఎస్టీలకు చెందిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు క్యాష్ అవార్డు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మెన్ కుంజా నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు బెక్కంటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వంశీమోహన్, రవి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి

- తెలంగాణను నెం. వన్‌గా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే
- పార్టీలో విభేదాలు సర్దుకుంటాయి
- ఎంఎల్ఏ హరిప్రియను మరోసారి గెలిపించాలి
- విలేకరుల సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

నవతెలంగాణ-ఇల్లందు

బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని రాజ్యసభ సభ్యులు, ఇల్లందు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వద్దిరాజు రవిచంద్ర అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత 50 ఏండ్లుగా ఉన్న పోడు సమస్యను పరిష్కరించిన ఘనత కేసీఆర్ దే అన్నారు. సుమారు 45 సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ఇందులో ఇంటికి ఒక పథకమైన వర్తింపజేశారని అన్నారు. అనేక ప్రాజెక్టులు కట్టి సాగునీరు అందించారని అన్నారు. దీని మూలంగా ఏడాది పాటు కరువు వచ్చిన తట్టుకునే శక్తి తెలంగాణకు ఉందన్నారు. మూడు లక్షల కోట్ల సంపదను సృష్టించారని అన్నారు. ఇల్లందు నియోజకవర్గంలో సుమారు 16 వందల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని, గత 50 ఏళ్లలో ఇలాంటి అభివృద్ధి చూడలేదన్నారు. బస్ డిపో మంజూరు చేసి గిరిజనుల, ప్రజల కష్టాలు తీర్చారని చెప్పారు. కోరం కనకయ్యకు జెడ్పీ చైర్మెన్ పదవి ఇచ్చి ఆదుకుంటే పార్టీ మారి ద్రోహం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే మాయ మాటలు నమ్మొద్దని వివరించారు. కేసీఆర్ ఆశీర్వచనాలతో ఎమ్మెల్యే హరిప్రియకు టికెట్ ఇచ్చారని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా చేయాలని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు.

బీఆర్ఎస్‌లో విభేదాలు సర్దుకుంటాయి

ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్యనే విభేదాలు వస్తుంటాయని, ఇంత పెద్ద పార్టీలో విభేదాలు రావడం మామూలేనని అన్నారు. మున్సిపల్ చైర్మెన్, ఎమ్మెల్యే మధ్య విభేదాలు చిన్న సమస్యలేనని, త్వరలో సర్దుకుంటాయన్నారు. ఇల్లందు అడ్డా బీఆర్ఎస్ గడ్డని గెలుపు తథ్యమని అన్నారు.

ఓటు అడిగే హక్కు కెసిఆర్ కే ఉంది : మహబూబాబాద్ ఎంపీ కవిత

రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ఆదుకున్నారని ఓటు అడిగే హక్కు వారికే ఉందని ఎంపీ కవిత అన్నారు. గత తొమ్మిది ఏళ్లలో ఇచ్చిన ఇవ్వని హామీలు అన్నీ కూడా అమలు చేసిన ఘనత వారిదే అన్నారు. కోరం కనకయ్యకు బీఆర్ఎస్ టికెట్ ఇస్తే ఓడిపోయారని, అయినప్పటికీ సీఎం కేసీఆర్ జెడ్పీ చైర్మెన్‌ను చేశారన్నారు. వీటన్నిటిని విస్మరించి మళ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి కాంగ్రెస్ తరఫున పూనుకున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు.

బీఆర్ఎస్ జెండా ఎగరేస్తాం : ఎంఎల్ఏ హరిప్రియ

2014 నుండి ఈనాటి వరకు ఇల్లందు





నియోజకవర్గంలో బీఆర్ఎస్ టికెట్ పై ఎవరు గెలవలేదని, రాబోయే మూడు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకున్న ఘనత ఇల్లందుకే దక్కిందని అన్నారు. దీనికి కృషి చేసిన పాలకవర్గానికి, చైర్మెన్ డీవీకి శు భాకాంక్షలు తెలియజేశారు. పార్టీలో విభేదాలను చక్కదిద్దుకుంటామని అందర్నీ కలుపుకొని పోతామని అన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దిండిగాల, వైస్ చైర్మెన్ జానీ, కౌన్సిలర్లు ఎంపీటీసీలు, ఇల్లందు, టేకులపల్లి, కామేపల్లి, గార్ల, బయ్యారం చెందిన వివిధ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గులాబీ మయమైన ఇల్లందు

ఎంఎల్ఏ హరిప్రియను ఆశీర్వదించి ఇల్లందు అసెంబ్లీ టికెట్ ఇచ్చినందుకు గాను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో భారి ప్రదర్శన నిర్వహించారు. తోరణాలతో పట్టణమంతా గులాబీమయం చేశారు. పోలీసులు వివిధ కూడళ్లలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కోలాటం, డప్పు, ప్రదర్శన, నృత్యాలు, డీజే చప్పుళ్లతో పట్టణం దద్దరిల్లింది. ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. తొలుత సీఎస్పీ రైల్వే గేటు వద్ద రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యురాలు కవిత లకు ఎమ్మెల్యే హరిప్రియ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. సమీపంలోని ఆంజనేయ స్వామి గుడిలో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రదర్శన గోవింద్ సెంటర్ కొత్త బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్ చేరుకున్నది. అక్కడ జరిగిన బహిరంగ సభలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యురాలు కవిత మాట్లాడారు. అనంతరం ప్రదర్శన సాగుతూ జగదాంబ సెంటర్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రదర్శనగా సాగుతూ ప్రభుత్వ వైద్యశాల సెంటర్ మీదుగా జెకె ఏరియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నది.

కంటి పరీక్షా శిబిరం

భద్రాచలం : భద్రాచలంలోని పాత ఎల్ఐసీ ఆఫీసు ఎదురుగా గల ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ కార్యాలయంలో సోమవారం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. శరత్ మాక్స్ విజన్ ఐ ఆసుపత్రి వరంగల్ వారు అశోక్, మామిడి మహేందర్ కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎల్‌వి ప్రసాద్, డి కృష్ణమూర్తి కోశాధికారి గౌరవ అధ్యక్షులు వై మంగయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

అన్నపురెడ్డిపల్లి : సీజనల్ వ్యాధులు ప్రారంభం కావడంతో మండలంలో అన్ని పాఠశాల్లో విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి అని డాక్టర్ ప్రియాంక అన్నారు. మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలల్లో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రారంభం కావడంతో విద్యార్థులు జ్వరాలు, జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనపడిన వెంటనే వైద్య కేంద్రానికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వర్ష కాలం కావడంతో తడి వస్త్రాలు దరించవద్దు అని తడి వస్త్రాలు వలన దురద వంటి చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాఠశాలలో జ్వరాలు వున్న విద్యార్థులకు వారికి మందులు పంపిణీ చేశారు.

గణేష్ నవరాత్రులకు పకడ్బందీ చర్యలు

అదనపు కలెక్టర్ రాంబాబు



నవతెలంగాణ-పాల్వంచ

ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ అన్ని గణేష్ మండపాలను తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా గణేష్ మండలి నిర్వాహకులు పూర్తి వివరాలు అందించాలని, ఇది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యుత్ అధికారులు మండపాల్లో ఆడిట్ నిర్వహించాలని చెప్పారు. గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాలని, గణేష్ విగ్రహం నిమజ్జనం చేసు కునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని చెప్పారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తిపాటలు మాత్రమే వినిపించాలని, మతాలు, వర్గాల మనోభావాలను గౌరవించాలని చెప్పారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా క్రేన్లు వినియోగించాలని, గణేష్ నిమజ్జనం జరిగే ప్రదేశాలలో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఉచిత మట్టిగణపతులు పంపిణీ చేయనున్నామని, ప్రజలు మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.
ఈ సమావేశంలో డీఆర్‌ఓ రవీందర్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, డిపిఓ రమాకాంత్, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, మున్సిపల్ కమిషనర్లు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కె.రంగాకిరణ్, దారా రమేష్, వందనపు శ్రీధర్, జి.వెంకటేశ్వరరావు, చింతల చెరువు శ్రీనివాస్ రావు, జల్లారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐలమ్మకి నివాళి



నవతెలంగాణ-మధిర

చిట్యాల ఐలమ్మ వర్ధంతి సభని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో నాయుడు శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి గ్రామ నివాసి రెడ్డిపుడి కోటయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మంద సైదులు హాజరై ప్రసంగిస్తూ చిట్యాల ఐలమ్మ జీవితం ఎంతోమందికి ఆదర్శమని అన్నారు. నేడు ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతి ఒక్కరికి స్ఫూర్తిని అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వడ్రానపు మధు, నాయుడు శ్రీరాములు, నేలపాల కోటేశ్వరరావు, ముచ్చింతల రవి, నారిశెట్టి సీతారాములు పాల్గొన్నారు.



సుధాకర్ రెడ్డికి సన్మానం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన గత 11 సంవత్సరాలుగా మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసిన కృషిని గుర్తించి ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈనెల 9వ తేదీన హైదరా బాద్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొని విజయవంతంగా శిక్షణ ముగించుకున్న సందర్భంగా జిల్లా కమిటీ నాయకులు ఆయనను అభినందించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి గత 11 సంవత్సరాలు నుండి కాంగ్రెస్ పార్టీని ముందు ఉండి నడిపిస్తూ మండలంలో మెజార్టీనీ తీసుకొస్తున్న సందర్భంగా అభినందిస్తూన్నామని తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు.

అంగన్వాడీ టీచర్లకు గ్రాడ్యుటీ చట్టాన్ని అమలు చేయాలి

సీఐటియు జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మచారి

నవతెలంగాణ-చర్ల

ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లకు, మినీ టీచర్లకు, హెల్పర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చట్టాన్ని అమలు చేయాలని సీఐటియు జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మచారి డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్‌కు 10 లక్షలు హెల్పర్ కు 5లక్షలు ప్రకటించాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను ఎటువంటి షరతులు లేకుండా మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తూ ప్రభుత్వం వెంటనే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్ల ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో తొలిరోజు అంగన్‌వాడీల సమ్మెను మండల కేంద్రంలో ప్రారంభించి మాట్లాడారు. ఆగస్టు 18న అంగన్వాడీ ఉద్యోగ సంఘాలతో మంత్రి సత్యవతి రాథోడ్ జరిపిన చర్చలు ఇచ్చిన హామీలు వాటికి విరుద్ధంగా ఆగస్టు 25న మంత్రి ప్రకటన జారీ చేశారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించినందువల్లనే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు సకాలంలో పోషకాహారం అందించడం లేదని నెలలు తరబడి కందిపప్పు, కోడిగుడ్లు తదితర సరుకులు రావటం లేదని పేర్కొన్నారు. ఈ సమ్మెకు అన్ని ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు సామాజిక సంఘాలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పాయం రాధాకుమారి, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం విజయశీల, సిఐటియు మండల నాయకులు శ్యామల వెంకటేశ్వర్లు, నాయకులు కమల మనోహరి, ఇర్పా సత్యవతి, త్రివేణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పినపాక : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు పినపాక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వారికి దీక్షకు సీఐటీయూ, ఏఐటీయూసీ యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. అనేక ఏళ్లగా తమ సమస్యలను పదే పదే మొరపెట్టుకున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని లేకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం



ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ అంగన్వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటీయు జిల్లా అధ్యక్షులు కె బ్రహ్మచారి, ఏఐటీయుసి నాయకులు నోముల రామిరెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా సోమవారం లక్ష్మీనగరం స్టేట్ బ్యాంకు ఎదురుగా అంగన్వాడీలు చేపట్టిన మొదటి రోజు సమ్మె శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు మండల కన్వీనర్ కొర్సా చిలకమ్మ, యూనియన్ నాయకురాళు కృష్ణవేణి, కమలాదేవి, గజలక్ష్మీ, బుచ్చమ్మ ఆదిలక్ష్మీ, రత్నకుమారి, చిన్నారి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో 'హార్వెస్ట్' విద్యార్థులు



నవతెలంగాణ-ఖమ్మం

ఈనెల 2వ తేదీన పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన జాతీయస్థాయి యుసిమాస్ (అబాకస్) పోటీల్లో హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరచి విజేతలుగా నిలవడం జరిగిందని హార్వెస్ట్ పాఠశాల ప్రిన్సిపల్ పార్వతిరెడ్డి, కరస్పాండెంట్ పి.రవిమారుత్ తెలిపారు. ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో నిర్వహించే యుసిమాస్ (అబాకస్) పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి ఎంతో మంది విద్యార్థులు పాల్గొనే ఈ పోటీలకు ఈ విద్యాసంవత్సరంలో తెలంగాణా రాష్ట్రం నుండి 21 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనగా హార్వెస్ట్ పాఠశాల నుండి ఏడుగురు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొన్న 21 మంది విద్యార్థులలో ముగ్గురు విద్యార్థులు రన్నరప్ సాధించగా అందులో ఇద్దరు విద్యార్థులు హార్వెస్ట్ విద్యాసంస్థలైన స్ప్రింగ్లిఫ్ పాఠశాలకు ఒకటి, హార్వెస్ట్ పబ్లిక్ స్కూలుకు ఒకటి రావడం గమనార్హమని అన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రానికి ఆరు మెరిట్ ప్రైజులు సాధించగా అందులో రెండు హార్వెస్ట్ పాఠశాలకు రావడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థులను అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత గొప్పగా రాణించాలని అభిలాషించారు. వీరికి శిక్షణ ఇచ్చిన అబాకస్ శిక్షకురాలు ఎమ్‌డి మల్లికని అభినందించారు.

22న కల్లు గీత కార్మికుల మహాధర్నా



నవతెలంగాణ-ఖమ్మం

కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22వ తేదీన ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నా జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడపట్ల సుదర్శన్, గాలి అంజయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో పోస్టర్‌ను రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణా, బెల్లం కొండ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. గీత కార్మికులకు ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని, సభ్యులందరికీ ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని, బడ్జెట్‌లో గీత కార్మికులకు కేటాయించిన డబ్బులు వెంటనే విడుదల చేయాలని, మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్ యిచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పగడాల నాగేశ్వరరావు, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు కొండం కరుణాకర్, కొంపల్లి శ్రీను, జలగం వెంకటరావు, మట్టా ఉప్పలయ్య, గాదె వెంకటనారాయణ, కారంగుల నాగేశ్వరరావు, కాసాని రమేష్, మారగాని నాగేశ్వరరావు, సంఘం జిల్లా నాయకులు బత్తిని ఉపేందర్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యునిగా సుధాకర్

నవతెలంగాణ-ముదిగొండ

భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్లీనరీ సంగారెడ్డిలో జరిగిన సమావేశంలో ముదిగొండకు చెందిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుని ఎన్నికైన సుధాకర్‌ను సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, వైస్ఎంపీపీ మంకెన దామోదర్, సిఐటియు మండల కన్వీనర్ టీఎస్ కళ్యాణ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షకార్యదర్శి రాయల శ్రీనివాసరావు, వేల్పుల భద్రయ్య రైతు సంఘం మండల అధ్యక్షకార్యదర్శి కందుల భాస్కరరావు, కోలేటి ఉపేందర్, ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శి మందరపు పద్మ, పయ్యావుల ప్రభావతి, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శి బట్టు రాజు, మెట్టెల సతీష్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పురిమెట్ల సాయిరాం, సిపిఐ(ఎం) సీనియర్ నెమిలి సైదులు, రాయల వెంకటేశ్వర్లు, మందరపు వెంకన్న అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ గెలుపునకు కష్టపడాలి

నవతెలంగాణ- ఖమ్మం

రాబోవు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం బూత్ స్థాయి వరకు ప్రతి కార్యకర్త సైనికుని లాగా కష్ట పడాలని జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంలోని (సంజీవరెడ్డి భవనం)లో జిల్లాలోని బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కాంగ్రెస్ కమిటి అధ్యక్షులకు ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు, ఖమ్మం నియోజకవర్గ సభ్యులు మహ్మద్ జావేద్, ఖమ్మం నియోజకవర్గ పిసిసి సభ్యులు, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, వైరా నియోజకవర్గ సభ్యులు వడ్డే నారాయణరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీల సమరం

- భారీ ర్యాలీలు, ధర్నా, దీక్షాశిబిరాలు
- అధికారుల బెదిరింపులు
- కేంద్రాల తాళాలు పగులగొట్టి నిర్వహణ
- సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీల అరెస్ట్



నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం పెద్దఎత్తున ధర్నా చేశారు. గ్రామాలు, మండలాల నుంచి తరలివచ్చి తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్ల ఎదుట దీక్షా శిబిరాల్లో కూర్చున్నారు. భారీ ర్యాలీలు తీశారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెన్ఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. అయితే, సమస్యల పరిష్కారానికి చొరవ చూపని అధికారులు అంగన్‌వాడీలపై బెదిరింపులకు పాల్పడటంతో పాటు కొన్నిచోట్ల కేంద్రాల తాళాలు పగులగొట్టి తెరిపించారు. కామారెడ్డిలో కేంద్రాలను తెరిపించే ప్రయత్నం చేయగా సీఐటీయూ నేతలు అడ్డుకున్నారు. పలుచోట్ల సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సమ్మె చేపట్టారు. చేవెళ్లలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహేశ్వరంలో మానవహారం నిర్వహించారు. యాచారంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ, శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు.

ఖమ్మం జిల్లా కామేపల్లి మండల కేంద్రంలో అంగన్‌వాడీల దీక్షను సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ దీక్షకు సీపీఐ(ఎం), సీపీఐ, ప్రజాపంథా నాయకులు సంఘీభావం తెలిపారు. కల్లూరులో ర్యాలీ, కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో అంగన్‌వాడీలు దీక్ష ప్రారంభించారు. అశ్వారావుపేటలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి వినతిపత్రం అందజేశారు. భద్రాచలంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు. బూర్గంపాడు, పాల్వంచలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ దీక్షలను ప్రారంభించారు.

మేడ్చల్ మల్కాజిగిరి ఎమ్మార్వో ఆఫీస్ వద్ద నిరసన తెలిపి ఎమ్మార్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ టీచర్లు ఆందోళన నిర్వహించారు. దుండిగల్ మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ మండల కన్వీనర్ లింగస్వామి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెకు దిగారు. కలెక్టరేట్లు, అన్ని మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సమ్మె శిబిరాలు ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ అధికారులు కేంద్రాలను తెరవాలని బెదిరింపులకు పాల్పడ్డారు. పలుచోట్ల కేంద్రాల తాళాలను పగులగొట్టి ఐకేపీ సిబ్బందితో నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సమ్మె చేపట్టనీయకుండా అంగన్‌వాడీలను అరెస్టు చేసి మోపాల్‌లోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు పెద్దఎత్తున బైటాయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్‌లను తెరిపించే ప్రయత్నం చేయగా.. సీఐటీయూ నాయకులు అడ్డుకున్నారు. మరికొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులు తాళాలు పగులగొట్టి సెంటర్లను తెరిచారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. ఈ సమ్మెనుద్దేశించి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడారు. దేవరకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సమ్మెను సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ ప్రారంభించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని సీపీడీపీఓ కార్యాలయం ఎదుట సమ్మెనుద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దాసరి పాండు మాట్లాడారు. సూర్యాపేట,ములుగు జిల్లాల్లో ధర్నాలు నిర్వహించారు.

అంగన్వాడీలపై నిర్బంధకాండను ఖండిస్తున్నాం

- సర్కారు బెదిరింపులను మానాలి
- సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలి
- తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ జేఏసీ నేతలు పి.జయలక్ష్మి, ఎన్. కరుణకుమారి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్మినెంట్, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేయడం, పెన్షన్ పెంపు వంటి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ కాండను ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ జేఏసీ నేతలు పి.జయలక్ష్మి(సీఐటీయూ), ఎన్.కరుణకుమారి(ఏఐటీయూసీ) తెలిపారు. టీచర్లు, హెల్పర్లపై బెదిరింపులను మానుకోవాలని సూచించారు. సమ్మె డిమాండ్లను సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రేడ్ యూనియన్ చట్టం 1926 ప్రకారం చట్టబద్ధంగా 14 రోజుల ముందు ప్రభుత్వానికి, సంబంధిత రాష్ట్ర అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చినా పట్టించుకోలేదని విమర్శించారు. చట్టబద్ధంగా చేస్తున్న సమ్మెను అణచివేయాలని చూడటం సరిగాదని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టడం అత్యంత దుర్మార్గమని వాపోయారు. అంగన్వాడీ ఉద్యోగులను ఇండ్ల వద్దకెళ్లి మరీ అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన అప్రజాస్వామిక విధానాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సూచించారు. లేదంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

యూరియా కొరతను నివారించాలి

- ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి :తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో తక్షణం యూరియా కొరతను నివారించి రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల వర్షాభావం తర్వాత కురుస్తున్న వానలకు రాష్ట్రంలోని మెట్ట, మాగాణి పంటలకు యూరియా అవసరం ఏర్పడిందని తెలిపారు. యూరియా వేయడం జాప్యం చేస్తే పంటల దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ప్రతి రైతు యూరియా కోసం రుణాలు తెచ్చి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. యూరియా కొరత ఉందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో రైతులందరికీ అవసరమైనంత అందుబాటులో వుంచాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితిని గమనించి మార్కెట్‌లో వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించే అవకాశం ఉందని తెలిపారు.ఒక బస్తా ధర రు.276 ఉండగా, నల్గొండ జిల్లాలో రు.100 లు అదనంగా అమ్ముతున్నారని పేర్కొన్నారు. కొన్ని కంపెనీల యూరియాలో నత్రజని శాతం తక్కువగా వున్నదని ప్రచారం చేయడం ద్వారా అందరూ ఒకే కంపెనీ యూరియా కావాలని డిమాండ్ చేస్తున్నారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం యూరియా బ్లాక్‌మార్కెట్ అవుతున్నదని "లిక్విడ్ యూరియా" (ద్రవరూప యూరియా), నీమ్ కోటెడ్ యూరియాను మార్కెట్‌లోకి తెచ్చింది. కానీ ఈ రెండు ఎరువులలో నత్రజని మూలకాలు తక్కువగా వున్నాయనే ప్రచారం జరగడంతో వాటిపట్ల రైతులు ఆసక్తి కనపర్చడంలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న ఎరువులను రాష్ట్రంలోని ఎరువుల లాబొరేటరీలో పరీక్షించి అవి నాణ్యమైనవా? కాదా అని తేల్చాలన్నారు. ఆ పని రాష్ట్రప్రభుత్వం చేయడం లేదని గుర్తు చేశారు. ఇదే అదునుగా రాష్ట్రంలో ఎక్కువ వాడుకలో వున్న ఎరువులను వ్యాపారులు అధిక ధరకు అమ్మకాలు సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో వానాకాలం పంటలకు 10.50లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాలన్నారు. వ్యవసాయ శాఖామంత్రి యూరియా నిల్వలు వున్నాయని చెప్పినప్పటికీ రైతులు కోరుతున్న యూరియా అందుబాటులో లేదన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నాణ్యమైన యూరియాను మండల స్థాయిలో రైతులకు అందుబాటులో పెట్టాలనీ, బ్లాక్‌మార్కెట్‌పై చర్యలు చేపట్టాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నదన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానమే ఉండదన్న మాట నిలబెట్టుకోవాలి

- దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన రాఘవులు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక దీక్షలు 8వ రోజుకు చేరాయి. సంగారెడ్డిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27 వేల మంది సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యమ కాలంలో.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానమే ఉండదని చెప్పిన కేసీఆర్ మాట నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని తెలిపారు. కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి కోసం సేవలందిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సర్వశిక్షా అభియాన్ స్కీమ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏర్పడినప్పటికీ అందులో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించింది రాష్ట్ర ప్రభుత్వమేనన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుండా కాలయాపన చేయడం సరైందికాదన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు టైమ్ స్కేల్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు, మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సీపీఐ(ఎం) మద్దతుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య, అతిమేల మాణిక్యం, కృష్ణ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శేషాద్రి, కార్యదర్శి ఉమారాణి పాల్గొన్నారు.

ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధనకోసం పోరాటాలకు సిద్ధం : టి సాగర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన పథకం కింద ఇండ్లు నిర్మించి ఇస్తామంటూ మాయమాటలు చెప్పిందని విమర్శించారు. ఇప్పుడు వాటి ప్రస్తావనే మరిచిందని తెలిపారు. నిజమైన లబ్ధిదారులకు రాష్ట్రంలో పూర్తిస్థాయిలో ఎక్కడా ఆవాస్ యోజన పథకం కింద ఇండ్ల నిర్మాణం జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలను పేదల నిర్మించుకున్న గుడిసెల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిశవాసులపై కేసులు బనాయిస్తూ, నిరంకుశంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. నెలల తరబడి పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని, నివాసాలు ఉంటున్నారని తెలిపారు. వారిని అర్హులుగా గుర్తించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాటలతో కాల వెల్లబుచ్చుతున్నదని తెలిపారు. పేదల సంక్షేమం గురించి గొప్పలు చెప్పడు తప్పితే.. చేసింది ఏమీ లేదని విమర్శించారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కూడా నిజమైన లబ్ధిదారులకు అందడం లేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నవారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన లక్షల మంది నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించాలనీ, అవినీతి జరక్కుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే..రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.శిక్షణా తరగతుల్లో పి ఆశయ, కోట రమేష్, టి రమేష్, జే వెంకటేష్ క్లాసులను బోధించారు.

వీడేం దొంగరా బాబూ!

- ఆర్టీసీ బస్సునే చోరీ చేసి.. ప్రయాణికులకు ఎక్కించుకుని..
- డీజిల్ అయిపోయి బస్సు ఆగిపోవడంతో తుర్రుమన్న ఘనుడు
- ప్రయాణికుల గగ్గోలుతో తేరుకున్న ఆర్టీసీ అధికారులు
- ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టిన వైనం





నవతెలంగాణ - తంగళ్లపల్లి

వీడో చిత్రమైన దొంగ.. ఆర్టీసీ బస్సును దొంగిలించి.. డ్రైవర్‌లా ఫోజిచ్చి మరీ ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. తీరా కొంత దూరం వెళ్లాక డీజిల్ అయిపోయి బస్సు ఆగిపోవడంతో అక్కడి నుంచి తుర్రుమన్నాడు. బస్టాండ్‌లో బస్సు పోయినా సోయిలేని అధికారులు చివరకు ప్రయాణికుల గగ్గోలుతో విషయం తెలుసుకుని తేరుకున్నారు. ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు సదరు దొంగ కోసం వెతుకుతున్నారు. ఈ ఘటన సోమవారం సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి శివారులో జరిగింది. సిద్దిపేట బస్టాండ్‌లో ఉదయం 6గంటలకు ఓ ఎక్స్‌ప్రెస్ బస్సు వేములవాడకు వచ్చేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో డ్రైవర్, కండక్టర్ లేని సమయం చూసి ఓ దొంగ ఆ బస్సును చోరీ చేశాడు. నీలిరంగు చొక్కా, ప్యాంటు తొడిగి అచ్చం డ్రైవర్‌లా ఫోజిచ్చి డ్రైవర్ సీట్లో కూర్చొని సిద్దిపేట నుంచి మధ్యాహ్నం వేములవాడ బస్టాండ్‌కు బస్సు తీసుకొచ్చాడు. అక్కడ హైదరాబాద్ బోర్డు మార్చి ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. బస్సు కొంత దూరం వెళ్లి సిరిసిల్ల జిల్లా కేంద్రం దాటుతుండగా.. కండక్టర్ ఏడని ప్రశ్నించిన ప్రయాణికులకు మధ్యలో బస్సు ఎక్కుతాడని సదరు చోరుడు బదులిచ్చాడు. తంగళ్లపల్లి వచ్చినా ఇంకా బస్సు ఎక్కని కండక్టర్ కోసం ఎదురుచూస్తున్నారు. సారంపల్లి గ్రామ శివారుకు రాగానే బస్సులో డీజిల్ అయిపోయి ఆగిపోయింది. ఏమైందని కిందికి దిగిన ప్రయాణికులకు వేరే బస్సు ఎక్కడండని ఆ దొంగ బదులిచ్చాడు. కండక్టర్ లేకపోవడం, డ్రైవర్ మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో పలువురు అతన్ని నిలదీశారు. కొందరు అతన్ని వీడియో కూడా తీశారు. సరైన సమాధానం చెప్పకుండా మెల్లిగా అక్కడి నుంచి రోడ్డు దిగి తుర్రుమన్నాడు. దీంతో ప్రయాణికులు ఆగ్రహంతో విషయాన్ని ఆర్టీసీ అధికారులకు తెలియజేశారు. ఏం జరిగిందో అర్థంకాక వేములవాడ ఆర్టీసీ అధికారులు ఘటనస్థలానికి చేరుకోగా.. అసలీ బస్సు ఎక్కడిదని ఆరా తీశారు. సిద్దిపేట బస్టాండ్‌లో ఉదయం చోరీకి గురైన బస్సు ఇదేనని నిర్ధారించుకున్నారు. బస్సు చోరీ అయిన విషయాన్ని పోలీసులకు, సిద్దిపేట అధికారులకు తెలియజేశారు. దొంగ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ విషయమై వేములవాడ డిపో మేనేజర్ మనోహర్‌ను 'నవతెలంగాణ' వివరణ కోరగా.. సిద్దిపేట డిపో ముందున ఆర్టీసీ బస్సు చోరీకి గురైన విషయం వాస్తవమేనని, సదరు బస్సు డ్రైవర్ డిపోలో రిపోర్టు చేయలేదని తెలిపారు. చోరీ అయిన బస్సు వేములవాడలో ప్రత్యక్షమైన ఉదంతంపై విచారణ చేశామని, సిద్దిపేటలో కేసు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారని చెప్పారు.

ఆధార్ వెరిఫికేషన్‌లో సమస్యలు

- నిలిచిన రిజిస్ట్రేషన్లు..రూ.100 కోట్లు నష్టం ?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆధార్ కార్డు వెరిఫికేషన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టింది. సర్వర్ డౌన్ కావడమే ఇందుకు కారణమని తెలిసింది. దీంతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రిజిస్ట్రేషన్లు స్తంభించాయి. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం సుమారు రూ. 100 కోట్లు కోల్పోయిందనే ప్రచారం జరిగింది. అయితే అధికారులు ఈ విషయాన్ని ధృవీకరించడానికి నిరాకరించారు. ముఖ్యంగా దస్తావేజులు స్కానింగ్ చేయడం, ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు సబ్‌రిజిస్ట్రార్లు బయోమెట్రిక్ ద్వారా లాగిన్ కావాల్సి ఉండగా, అది కూడా పనిచేయకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. అలాగే రిజిస్ట్రేసన్ అయిన తర్వాత డాక్యుమెంట్లు స్కానింగ్ చేయడానికి అవకాశం లేదని అధికారులు చెప్పారు. ఇలా రకరకాలుగా తలెత్తిన సాంకేతిక కారణాల మూలంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 140కిపైగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరగలేదని అధికారులు అంగీకరించారు. ఈ విషయమై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారి శ్రీనివాసులు వివరణ కోరగా ఆధార్ వెరిఫికేషన్‌లో తలెత్తిన సాంకేతిక ఇబ్బందుల మూలంగానే రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా ఆగాయని చెప్పారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకే సాంకేతిక సమస్య కొలిక్కివచ్చిందనీ, ఆతర్వాత రిజిస్ట్రేషన్లు సాఫీగా నడిచాయని చెప్పారు. స్టాంపులు,రిజిస్ట్రేషన్ల శాఖలో ఎలాంటి సమస్యలూ లేవని వివరించారు. ఆగిపోయిన డాక్యుమెంట్లను మరుసటి రోజు స్కానింగ్ చేస్తారని చెప్పారు.

ఉద్యమం చేసినం.. బాజాప్త అభివృద్ధి చేసుకుంటాం

- రేవంత్ వ్యాఖ్యలకు మంత్రి హరీశ్‌రావు కౌంటర్..
- ఈనెల 15న సిద్దిపేటకు బుల్లెట్ స్పీడ్‌లో రానున్న రైలు
- అభివృద్ధిని చూసి కొందరు ఓర్వలేరు..
- విద్యాలయాలకు ఆలయం సిద్దిపేట : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట/ చిన్నకోడూరు

సిద్దిపేట నుంచే పెద్ద ఎత్తున ఉద్యమం చేసినం.. బాజాప్త అభివృద్ధి చేసుకుంటాం.. మీ సమైక్య పాలనలో ఈ ప్రాంతం గోస పడ్డది. 60 ఏండ్ల ప్రతిపక్షాల కాలంలో లేని అభివృద్ధి.. ఈ తొమ్మిదేండ్లలో ఎలా జరిగింది.. తెలంగాణ ఉద్యమ గడ్డ.. సిద్దిపేట ప్రజలు రాష్ట్రం కోసం ఉవ్వెత్తున ఉద్యమించారు..' అంటూ సిద్దిపేట, గజ్వేల్‌లోనే అభివృద్ధి జరిగిందన్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు మంత్రి హరీశ్‌రావు కౌంటర్ ఇచ్చారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో సోమవారం పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు పత్రాలు, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఇన్సూరెన్స్ పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15న బుల్లెట్ స్పీడ్‌తో సిద్దిపేటకు రైలు రాబోతున్నదన్నారు. సిద్దిపేట ప్రజలు ఎక్కడికి వెళ్లినా వారి గౌరవం, ప్రతిష్ట పెంచామని తెలిపారు. సిద్దిపేట అభివృద్ధి చూసి ఓరుస్తలేరని, సిద్దిపేట ప్రజలు గొప్ప చైతన్యవంతులని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేస్తుండటంతో ప్రయివేటు పాఠశాల యాజమాన్యాలకు, బోధన చేసే సిబ్బందికి కొంత ఇబ్బంది కలుగుతుందన్నారు. అయినప్పటికీ సమాజంలో 50 శాతం మంది విద్యార్థులు ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్నారని, రాష్ట్ర అభివృద్ధిలో 50 శాతం వారి భాగస్వామ్యం ఉందన్నారు.

విద్యాలయాలకు ఆలయం సిద్దిపేట : మంత్రులు హరీశ్‌రావు, సబిత

వైద్య, వ్యవసాయ, పశువైద్య, ఫార్మసీ, నర్సింగ్ కళాశాలలతో పాటు అన్నిరకాల విద్యను అభ్యసించడానికి సిద్దిపేటలో కళాశాలలు ఉన్నాయని, విద్యాలయాలకు ఆలయంగా సిద్దిపేట మారిందని మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి అన్నారు. చిన్నకోడూరు మండలంలోని రామంచ శివారులో నూతనంగా నిర్మించిన రంగనాయక స్వామి బీ ఫార్మసీ కళాశాలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి, రాష్ట్రానికి సిద్దిపేట రోల్ మోడల్ అని తెలిపారు. స్వల్పకాలంలో కళాశాల నిర్మించి విద్యా సంవత్సరం ప్రారంభించిన ఎగ్జిబిషన్ సొసైటీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు మారుమూలన ఉన్న పల్లెటూర్లు కూడా సమానంగా అభివద్ధి చెందుతున్నాయన్నారు. కరెంటు కోతలు లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా జడ్పీ చైర్ పర్సన్ రోజా రాధాకష్ణ శర్మ, ఎగ్జిబిషన్ సొసైటీ చైర్మెన్ శంకర్, చిన్నకోడూరు ఎంపీపి కూర మాణిక్య రెడ్డి, రామంచ సర్పంచ్ సంతోషవిక్రమ్, ప్రజా ప్రతినిధులు, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

బిల్లులు రాక అప్పులు తీరక..!

ఏండ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలు

- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు
- పలు చోట్ల నిలిచిపోయిన అభివృద్ధి పనులు

వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాక గోస పడుతున్నారు. పనులు పూర్తిచేసి నెలలు.. సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి వాటికి సంబంధించి బిల్లులు విడుదల రావడం లేదు. ఫలితంగా అప్పులు తీసుకొచ్చి పనులు చేపట్టిన గుత్తేదారులు ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నారు. అప్పులకు వడ్డీలు పెరగడం.. కిందిస్థాయి సిబ్బందికి సైతం సకాలంలో జీతాలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. బిల్లులు మంజూరు చేయాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ఫలితమూ కనిపించడం లేదు. తాజాగా గ్రామాల్లో పనులు చేపట్టిన మిషన్ భగీరథ (ఇంట్రవర్క్స్) గుత్తేదారులు జడ్పీ కార్యాలయం ఎదుట బిల్లులు చెల్లించాలని ఆందోళన చేపట్టడం చర్చనీయాంశమైంది. రెండేండ్లుగా ఎదురుచూస్తున్నా నయాపైసా విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా పలు శాఖల్లో పనులు చేపట్టిన వారి పరిస్థితి కూడా ఇదే మాదిరి ఉండటం గమనార్హం.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపట్టిన చిన్న చిన్న కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. ఎంతో కొంత ప్రయోజనం కోసం పనులు దక్కించుకుంటున్న గుత్తేదారులు ఫలితం లేకపోగా అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చింది. ఇది వరకు సర్పంచులు ఎదుర్కొన్న సమస్య మాదిరిగానే.. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టిన చిన్న చిన్న గుత్తేదారుల పరిస్థితి దయనీయంగా మారింది. 2 నుంచి 3 శాతానికి వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి పనులు చేపట్టామని అంటున్నారు. 2021లో పూర్తి చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే సుమారు రూ.30కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు అధికార వర్గాల సమాచారం.

మిగతా శాఖలదీ ఇదే పరిస్థితి..! : మిషన్ భగీరథలో పనులు చేసిన కాంట్రాక్టుల మాదిరే.. మిగతా శాఖల్లోనూ కనిపిస్తోంది. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి సుమారు రూ.9.50కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. భూసేకరణ, ఎస్డీఎఫ్ నిధులు సుమారు రూ.40కోట్లు, డబుల్ బెడ్‌రూంలకు సంబంధించిన నిధులు మరో రూ.10కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉందని అధికారవర్గాలు అంటున్నాయి. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోనూ కిందటి జూన్ నుంచి సుమారు రూ.6కోట్ల వరకు బిల్లులు రావాలని ఉందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు మన ఊరు- మన బడి పనులకు సంబంధించి మరమ్మతులు, విద్యుదీకరణ తదితర పనులకు సంబంధించి రూ.4.26కోట్లు, ఉపాధి హామీ నిధుల ద్వారా చేపడుతున్న పనులకు సంబంధించి మరో రూ.3కోట్ల వరకు గత మూడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోనూ పట్టణ ప్రగతి, ఎస్డీఎఫ్, సీఎం అష్యూరెన్స్‌కు సంబంధించి సుమారు రూ.20కోట్ల వరకు బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇలా పలు శాఖలకు బిల్లులు సకాలంలో రాకపోవడం మూలంగా వాటి పరిధిలో అభివృద్ధి పనులు మందగిస్తున్నాయి.

మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



మిషన్ భగీరథ కింద గ్రామాల్లో ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టాం. అదనపు పనులకు సంబంధించి మూడేండ్ల నుంచి బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆర్థికంగా.. మానసికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇతరుల వద్ద అప్పులు తీసుకొచ్చి పనులు చేపట్టాం. బిల్లులు రాకపోవడం మూలంగా వడ్డీల మీద వడ్డీలు కడుతూ మరింత ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రభుత్వం స్పందించి త్వరగా బిల్లులు విడుదల చేయాలి.

కల్యాణ్, మిషన్ భగీరథ గుత్తేదారు

నవతెలంగాణ మానవి 11
www.navatelangana.com ఖమ్మం
మంగళవారం 12 సెప్టెంబర్ 2023

పిల్లలు వివిధ విషయాల్లో ప్రావీణ్యం సంపాదించాలన్న ఆరాటం తల్లిదండ్రుల్లో ఉంటుంది. ఈ అత్యుత్సాహంతోనే వారి ఇష్టాయిష్టాలు గ్రహించకుండా కొన్ని విషయాల్లో పేరెంట్స్ వాళ్లను బలవంత పెడుతుంటారు. అయితే ఇలాంటి ప్రవర్తన పిల్లల మనసుపై ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. అందుకే బలవంతం చేయడం కంటే వారికి ఆసక్తి ఉన్న అంశాల్లో ప్రోత్సహిస్తే వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా వారు ఉన్నతి సాధించగలరు. మరి దీని కోసం ఏం చేయాలో తెలుసుకుందాం...

ఒత్తిడి చేస్తున్నారా..?



పిల్లలు బాగా చదువుకొని ప్రయోజకులైతే ముందుగా సంతోషపడేది తల్లిదండ్రులే. అయితే వారు నిరంతరం చదువుతూ ఉండడం వల్లే ఇది సాధ్యపడుతుందన్న ఆలోచనలో ఉంటారు కొందరు తల్లిదండ్రులు. అందుకే పదే పదే 'చదువు..చదువు' అంటూ వారిపై ఒత్తిడి తెస్తుంటారు. ఇక దీనికి తోడు పిల్లలతో పుస్తకాలు చదివించే అలవాటు చేయాలనుకుంటారు మరికొందరు పేరెంట్స్. అయితే చదువు విషయంలో ఇలా పిల్లల్ని బలవంత పెట్టడం వల్ల అది వారి మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. తద్వారా చదవాలన్న ఆసక్తి కూడా క్రమంగా తగ్గుతుందని చెబుతున్నారు నిపుణులు.

మీరు చదువుతూ...

పిల్లలు చదువులో మెరుగ్గా ఉండాలంటే వారి కోసం ఒక చక్కటి ప్రణాళిక రూపొందించాలి. అందులో వారికి నచ్చిన వ్యాపకాలకు తగిన సమయం కేటాయించేలా శ్రద్ధ చూపాలి. అప్పుడే వారు మానసికంగా ఉత్సాహంగా ఉండగలుగుతారు. పాఠ్యాంశాల పైన ఆసక్తి పెంచుకోగలుగుతారు. ఇక పిల్లల్లో ఇతర పుస్తకాలు చదివే ఆసక్తిని పెంచాలంటే చిన్న వయసు



నుంచే వారికి అలవాటు చేయాలి. అది కూడా మీరు చదువుతూ వారికి చెప్పడం వల్ల చిన్నారులకు పుస్తకాల విలువ తెలుస్తుంది.

నచ్చినా నచ్చకపోయినా

పిల్లల విషయంలో ఈ మొండిపట్టుదల వద్దంటున్నారు నిపుణులు. వారికి ఇష్టమో, కాదా అన్నది తెలుసుకోకుండా 'నువ్వు ఐఏఎస్ అవ్వాలి', 'సంగీతం నేర్చుకుంటే నీకు మంచి భవిష్యత్తు ఉంటుంది' అంటూ తమ ఇష్టాయిష్టాల్ని చిన్నారులపై రుద్దాలని చూస్తుంటారు కొందరు తల్లిదండ్రులు. ఇలా మీ బలవంతం వల్ల నచ్చని అంశాన్ని ఎంచుకొని పిల్లలు రాణించలేరు. అటు వారికి నచ్చిన అంశంపై దృష్టి పెట్టే అవకాశం ఉండదు. దీనివల్ల వారి భవిష్యత్తు ఎటూ కాకుండా తయారవుతుంది. ఇలా కూడా పరోక్షంగా మీకే నష్టం. కాబట్టి మీ ఇష్టాయిష్టాలు పక్కన పెట్టి... పిల్లలకు ఏ అంశంపై ఆసక్తి ఉందో ముందు తెలుసుకునే ప్రయత్నం చేయండి. అది మీకు నచ్చకపోయినా నిరుత్సాహపరచకుండా వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేయండి. దీనివల్ల తప్పకుండా వారు అందులో రాణించగలుగుతారు. ఇలా నచ్చిన రంగాన్ని ఎంచుకొని విజయం సాధించిన వారి స్ఫూర్తి గాథలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలు.

ఆ పొరపాటు వద్దు

ఇంటికి ఎవరైనా బంధువులొచ్చినప్పుడు చాలా మంది పేరెంట్స్ తమ పిల్లల్ని వారికి తోడుగా ఉండమని చెప్పి వాళ్ల పనుల్లో వాళ్లు నిమగ్నమవుతుంటారు. అక్కడితే ఆగకుండా బలవంతంగా వారికి షేక్‌హ్యాండ్ ఇవ్వమనడం, ముద్దు పెట్టమనడం, వారు పిల్లలకు పెట్టేంత చొరవనివ్వడం వంటివి చేస్తుంటారు. నిజానికి వీటికి చిన్నారులు అంత ఆసక్తి చూపరు. అయినా బలవంతం చేయడం వల్ల అవతలి వారు మీ పిల్లలతో ఆసభ్యంగా ప్రవర్తించేందుకు, లైంగిక వేధింపులకు గురి చేసేందుకు మీకు మీరే అవకాశం కల్పించినట్లవుతుంది. కాబట్టి ఇలాంటివి ప్రోత్సహించకూడదు. అలాగే మీ చిన్నారులు వాళ్లతో దూరంగా ఉన్నప్పటికీ ఓ కన్నేసి ఉంచడం ముఖ్యం.



జామాకుతో ఫేస్‌ప్యాక్

జామపండులోని పోషకాలు ఆరోగ్యానికి మేలు చేస్తే వాటి ఆకులు సౌందర్య పోషణకు ఉపయోగపడతాయి. అదెలాగో చూద్దాం...

• గుప్పెడు జామాకులను మెత్తగా నూరి దానికి రెండు చెంచాల నిమ్మరసం కలిపి ముఖానికి రాయాలి. దీన్ని అరగంట పాటు ఆరనిచ్చి చన్నీళ్లతో శుభ్రం చేస్తే చాలు. జిడ్డు తొలగి మోము తాజాగా కనిపిస్తుంది.

• గుప్పెడు జామాకులకు నీళ్లు, పావుచెంచా పసుపు, చెంచా కలబంద గుజ్జు కలిపి మిక్సీలో వేసి పేస్టులా చేయాలి. దీన్ని ముఖానికి రాసి 20 నిమిషాలు ఆరనిచ్చి కడగాలి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే ముఖంపై మొటిమలు, బ్లాక్ హెడ్స్ తొలగిపోతాయి.

• కప్పు మరిగే నీటిలో గుప్పెడు జామాకులను వేసి పది నిమిషాలు ఉడికించాలి. ఈ నీటిని వడకట్టి చల్లారాక స్ప్రే బాటిల్‌లో నింపాలి. చర్మం ఇరిటేటింగ్‌గా ఉన్నప్పుడు దీన్ని కాస్త చల్లితే సరి. సమస్య అదుపులోకి వస్తుంది. దోమ కాటుకు కూడా ఇది పని చేస్తుంది. దీనికి కొన్ని చుక్కల టీ ట్రీ ఆయిల్‌ను కలిపి స్ప్రే చేస్తే ముఖంపై మొటిమలు దూరమవుతాయి. ❈

అతి అనర్థం

స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో మహిళల ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలేంటో తెలిస్తే మీరిక వాటికి దూరంగా ఉంటారు.

• ప్రపంచ వ్యాప్తంగా 74 శాతం మంది మహిళలు స్మార్ట్ ఫోన్ వినియోగంతో ఒత్తిడికి లోనై, నిద్రలేమికి గురవుతున్నారని అమెరికాలోని 'స్ప్రెయిన్ ల్యాబ్స్' చేసిన అధ్యయనాలు చెబుతున్నాయి.

• సామాజిక మాధ్యమాలు, గేమ్స్ వల్ల మగవారితో పోలిస్తే మహిళలు 29 శాతం అధికంగా ఎక్కువ ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్నారు. ఫొటోలు, రీల్స్ అంటూ వ్యక్తిగత గోప్యతను నెట్టింట్లో ఉంచి సమస్యలెందుర్కొంటున్నారు. వాటి నుంచి బయటపడలేక ఆత్మహత్యాహత్నానికి పాల్పడుతున్నారు.



• ఫోన్‌ని పొత్తి కడుపు, ఛాతీ మీద పెట్టుకొని నిద్రపోవడం వల్ల దాని ప్రభావం పునరుత్పత్తి వ్యవస్థపై పడి, అండాశయ నిల్వలు తగ్గుతున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

• నెలసరి క్రమం తప్పి పీసీఓఎస్, పీసీఓడీ సమస్యలతో సతమతమవుతున్నారు.

• నిద్రలేమి, నడుము, వెన్ను, మెడ నొప్పులకు గురవుతున్నారు. ❈



కారణం ఏంటో..?

ఎప్పుడూ ఏదో ఒక కారణంతో ఒత్తిడి, ఆందోళనల్ని ఎదుర్కొనే వారు ఎందరో. నిజానికి ఇలాంటి టెన్షన్స్ దీర్ఘకాలంలో ఎన్నో అనారోగ్యాలకు కారణమవుతాయి. ఈ విషయం గుర్తెరిగినా కొందరు అనవసర భయాందోళనలకు గురవుతుంటారు. కానీ ఇంకొంత మంది మాత్రం వీరికి పూర్తి భిన్నంగా ప్రవర్తిస్తుంటారు. తమ చుట్టూ ఏం జరిగినా సానుకూలంగానే స్పందిస్తూ... ఎప్పుడూ ప్రశాంతంగా కనిపిస్తుంటారు. కానీ వాళ్ల రోజువారీ అలవాట్లు, పాటించే కొన్ని నియమాలే వారిని మానసికంగా ప్రశాంతంగా ఉంచుతాయని చెబుతున్నారు నిపుణులు.

• అది చిన్న విషయమైనా, పెద్ద సమస్యైనా... అవసరమున్నా, లేకపోయినా కొందరు దాని గురించే పదే పదే లోతుగా ఆలోచిస్తుంటారు. నిజానికి దీనివల్ల సమయం వృథా అవడంతో పాటు మానసికంగా ఒత్తిడి ఎదురవుతుంటుంది. కానీ మానసికంగా దృఢంగా ఉన్న వాళ్లు అస్సలు ఇలా చేయరు. ఏదైనా సమస్య వస్తే దాన్ని త్వరగా పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తారు తప్ప దాని గురించే లోతుగా ఆలోచించి మనసు పాడుచేసుకోరు.



• చదువు, కెరీర్, పెండ్లి, పిల్లలు... ఇలా జీవితంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. ఇవి కాకుండా అనుకోకుండా కొన్ని మార్పులొస్తుంటాయి. వాటిని అర్థం చేసుకొని స్వీకరించినప్పుడే హ్యాపీగా ఉండగలం. ఎప్పుడూ మానసికంగా సంతోషంగా ఉండే వాళ్లు ఇలాగే చేస్తారని చెబుతున్నారు నిపుణులు.

• నచ్చకపోతే చిన్న విషయానికే కోపగించుకోవడం, చిరాకు పడడం వంటివి చేస్తుంటారు మనలో చాలామంది. కానీ మానసికంగా దృఢంగా ఉండే వారు ప్రశాంతంగా దాని గురించి ఆలోచించే ప్రయత్నం చేస్తుంటారు. తమ ఆధీనంలో లేని దాని గురించి పాకులాడకుండా తమ సాధ్యాసాధ్యాల గురించి తొలుత ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు.

• శరీరాకృతి దగ్గర్నుంచి, వేసుకునే దుస్తుల దాకా... ఎదుటి వారికి అందంగా కనిపించాలన్న ఆలోచనే కొంత మంది మనసును తొలిచేస్తుంటుంది. నిజానికి ఇదే మానసిక ఒత్తిళ్లకు కారణమవుతుంటుంది. కానీ తాము మాత్రం చుట్టూ ఉన్న వాళ్ల కోసం కాకుండా... తమకు నచ్చినట్లుగా ఉండడంలోనే సంతోషాన్ని, సంతృప్తిని వెతుక్కుంటామంటున్నారు మానసికంగా బలంగా ఉండే అమ్మాయిలు.

• గతం గత: అనుకొని ఈ క్షణాన్ని ఆస్వాదిస్తూ, భవిష్యత్తు గురించి ఉన్నతంగా ఆలోచించే వారే జీవితంలో పైచేయి సాధిస్తారు. మానసికంగా దృఢంగా ఉండే వారి ఫిలాసఫీ కూడా ఇదే. అందుకే గత జ్ఞాపకాల్ని తవ్వుకొని బాధపడకుండా పాజిటివ్‌గా ఆలోచించడం, సంతోషంగా జీవించడం నేర్చుకుందాం.

• ఈర్ష్యాద్వేషాలు, అసూయ, ఎదుటివారి గెలుపును జీర్ణించుకోలేకపోవడం ఇవన్నీ మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తుంటాయి. అందుకే కొంతమంది వీటి జోలికి పోరు. తద్వారా సంతోషంగా ఉండగలుగుతారు. పైగా విజేతల్ని ప్రశంసించడం, కష్టపడే వారిని ప్రోత్సహించడం వీరికి అలవాటు కూడా.

• 'కోరుకున్నవన్నీ జరగాలని లేదు. జరగనంత మాత్రాన బాధపడడం అనవసరం' అనుకుంటారు మానసికంగా దృఢంగా ఉండే వ్యక్తులు. అందుకే నిత్యం సంతోషంగా ఉంటారు. కాబట్టి గొంతెమ్మ కోరికలు కోరుకోకుండా మన సమర్థత, వనరుల్ని దృష్టిలో ఉంచుకొనే ఏ విషయంలోనైనా అడుగు ముందుకేయడం మంచిది.

• స్నేహితుల్ని ఎంచుకోవడంలోనూ జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు మానసికంగా దృఢంగా ఉండే అమ్మాయిలు. చాడీలు చెప్పడం, అసూయ పడడం, ఎదుటివారి ఓటమిలో సంతోషాన్ని వెతుక్కోవడం లాంటి లక్షణాలున్న వ్యక్తుల్ని దూరం పెడుతుంటారని, ఒక వేళ చెలిమి చేసినా వారి గురించి తెలిశాక మాత్రం వారితో స్నేహ బంధాన్ని తెంచుకోవడానికి సిద్ధంగా ఉంటారు.

• కొంతమంది మొహమాటానికి పోయి చాలా పనుల్ని నచ్చకపోయినా స్వీకరిస్తుంటారు. కానీ, మానసికంగా బలంగా ఉండే వారు ఈ విషయంలో నిక్కచ్చిగా వహవహరిస్తుంటారని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఈ క్రమంలో వాళ్ల అత్మగౌరవానికి, సామర్థ్యానికే ప్రాధాన్యమిస్తుంటారు. ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుంది.

• రిస్క్ తీసుకోవడానికి భయపడకుండా, ఓటమినీ గెలుపుతో సమానంగా స్వీకరించడం మానసికంగా దృఢంగా ఉండే వ్యక్తులకే చెల్లుతుంది.

• నిజానికి మనకు నచ్చినట్లుగా ఉన్నప్పుడే సంతోషంగా ఉండగలం. మానసికంగా దృఢంగా ఉండే వ్యక్తులు పాటించే సూత్రం కూడా ఇదే. సమాజంతో పని లేకుండా తమకు నచ్చినట్లుగా ఉండాలనుకుంటారు, స్వీయ ప్రేమను పెంచుకుంటారు.

• మానసికంగా దృఢంగా ఉన్న వ్యక్తులు అనారోగ్యాల బారిన పడే అవకాశం చాలా తక్కువని చెబుతోంది ఓ అధ్యయనం. ఈ క్రమంలో రోజూ వ్యాయామం చేయడం, చక్కటి పోషకాహారం తీసుకోవడం, కంటి నిండా నిద్ర పోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లే వాళ్ల సంతోషానికి కారణమని నిపుణులు అంటున్నారు. ❈

ఉచిత సాఫ్ట్‌వేర్‌లో ఛాంపియన్

తిరువనంతపురం : కేరళ ఉచిత సాఫ్ట్‌వేర్‌లో ఛాంపియన్‌గా ఉందని, అంతర్జాతీయ మోడల్‌గా స్కూల్ వికీ పోర్టల్‌ను తీర్చిదిద్దిందని, దేశంలోనే ఇంటర్నెట్ కనెక్టివిటీలో ముందంజలో ఉందని యునెస్కో ప్రశంసల వర్షం కురిపించింది. యునెస్కో ప్రచురించిన 2023 గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ రిపోర్ట్ కేరళను ప్రశంసించింది. కేరళ విద్యా రంగంలో సాంకేతికతను అనుసంధానం చేసినందుకు ఈ గుర్తింపు లభించిందని ఆ రాష్ట్ర సాధారణ విద్యాశాఖ మంత్రి వి.శివంకుట్టి తెలిపారు. యునెస్కో నివేదికలో రాష్ట్ర విద్యా రంగంలో సాంకేతికత వినియోగం గురించి మూడు ప్రత్యేక ప్రస్తావనలు ఉన్నాయి. కైట్ నాయకత్వంలో పనిచేస్తున్న స్కూల్ వికీపోర్టల్ గురించి నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. 'నాణ్యత - కంటెంట్ సృష్టి యొక్క వైవిధ్యాన్ని కలిసికట్టుగా పనిచేయడం మెరుగుపరుస్తుంది' అనే శీర్షికతో స్కూల్ వికీపోర్టల్‌ను ఒక అంతర్జాతీయ మోడల్‌గా నివేదిక ప్రశంసించింది

ఉచిత సాఫ్ట్‌వేర్ వికీమీడియా ప్లాట్‌ఫామ్‌పై అభివృద్ధి చేసిన స్కూల్ వికీపోర్టల్‌లో భాగస్వామ్య పద్ధతిలో 15,000 కంటే ఎక్కువ పాఠశాలల్లో కంటెంట్‌ను అభివృద్ధి చేయడం గొప్ప విజయం అని యునెస్కో నివేదిక పేర్కొంది. స్కూల్ వికీ (ఎఎఎ.ఎస్ఛ్రశీశీశ్రీఎఱఓఱ.ఱఅ) పోర్టల్ అనేది భారతదేశ విద్యా రంగానికి సంబంధించి స్థానిక భాషలో అతిపెద్ద సమాచార రిపోజిటరీ. ఇందులో పాఠశాలలు, స్టేట్ స్కూల్ ఆర్ట్ ఫెస్టివల్ కంపోజిషన్‌లు, పెయింటింగ్‌లు, డిజిటల్ మ్యాగజైన్‌లు, కోవిడ్ కాలం నాటి కంపోజిషన్‌లకు సంబంధించిన సమాచారం ఉంటుంది.

కేరళలోని పాఠశాలల్లో డిజిటల్ విద్య కోసం ఉచిత సాఫ్ట్‌వేర్‌లు మాత్రమే ఉపయోగించడాన్ని కూడా యునెస్కో ప్రత్యేకంగా పేర్కొంది. 'ఉచిత సాఫ్ట్‌వేర్‌లో కొన్ని దేశాలు ఛాంపియన్‌లుగా మారాయి' అనే శీర్షికతో దీనిని గురించి నివేదిక వివరించింది. కేరళ రాష్ట్ర ప్రభుత్వ ఉచిత సాఫ్ట్‌వేర్ విధానాన్ని ప్రముఖంగా పేర్కొంటూ... రాష్ట్రంలో వివిధ పాఠశాలల్లో సుమారు రెండు లక్షల ల్యాప్‌టాప్‌లు ఉచిత సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లతో పనిచేస్తున్నట్లు నివేదిక తెలిపింది.

డిజిటల్ ఎడ్యుకేషన్‌లో ఉచిత సాఫ్ట్‌వేర్ వినియోగంతో కేరళ ప్రభుత్వం రూ.3,000 కోట్లు ఆదా చేసిందనే వాస్తవాన్ని నీతి ఆయోగ్‌తో సహా అనేక సంస్థలు ఇప్పటికే గుర్తించాయి. యునెస్కో నివేదికలోని మూడవ ప్రస్తావన ప్రకారం పాఠశాలల్లో అత్యధిక ఇంటర్నెట్ కనెక్టివిటీ విషయంలో దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే కేరళ ముందుంది.

పదోన్నతుల్లో డ్రైవర్, మెకానిక్‌లకు అవకాశమివ్వండి

• టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీకి ఎస్‌డబ్ల్యూఎఫ్ వినతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సర్వీసులో ఉన్న కార్మికులకు పదోన్నతుల్లో భాగంగా నిర్వహించే జూనియర్ అసిస్టెంట్ పరీక్షల్లో డ్రైవర్, మెకానిక్‌లకు కూడా అవకాశం కల్పించాలని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌కు వినతిపత్రం సమర్పించారు. టీఎస్ఆర్టీసీ ఆఫీసు సిబ్బందిలో ఫీడర్ క్యాడర్‌గా ఉన్న జూనియర్ అసిస్టెంటు (పర్సనల్), జూనియర్ అసిస్టెంటు (అకౌంట్స్) విభాగాల్లోని ఖాళీలను, ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్న ఆర్.సీ, కండక్టర్స్, టెలిఫోన్ ఆపరేటర్స్ నుంచి అర్హత కలిగిన వారికి టెస్టు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారితో ఆ ఖాళీలను భర్తీ చేయాలని యాజమాన్య తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు తెలిపారు. దాదాపు 16 ఏండ్ల తర్వాత ఇలాంటి టెస్టును సెప్టెంబర్ 26న నిర్వహిస్తున్నారనీ, ఈ మధ్యకాలంలో అనేకమంది చదువుకున్న వారు డ్రైవర్లు, మెకానిక్‌లుగా సంస్థలోకి వచ్చారనీ, వారికి కూడా జూనియర్ అసిస్టెంటుగా క్వాలిఫైయింగ్ టెస్ట్ రాసేందుకు అనుమతించాలని కోరారు. ఈ మేరకు రిక్రూట్‌మెంట్ రెగ్యులేషన్స్‌లో అవసరమైన సవరణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనమివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

పారితోషకాలు సరిపోక ఆశా వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం రూ.18 వేలకు వేతనం పెంచి అందించాలని కోరారు. అలాగే ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. హెల్త్ కార్డులు, ప్రమాద బీమా రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశ వర్కర్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలన్నారు. టీ.బీ. లెప్రసీ, కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. క్వాలిటీతో కూడిన ఐదు సంవత్సరాల పెండింగ్ యూనిఫార్మ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. మంగళవారం నుంచి ఆశా వర్కర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు .

ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, కోశాధికారి పి.గంగమని, నాయకులు మీనా, సుమారు నాలుగు వేల మంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులో పలువురు ఆశావర్కర్లతో పాటు సీఐటీయూ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

దీంతో పోలీసుస్టేషన్ ఎదుటే ఆశావర్కర్లు నిరసన తెలిపారు. ఆదిభట్లలో ఆశావర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం నుంచి చలో హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశా కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో తహసీల్దార్ కార్యాయాన్ని ముట్టడించారు. కరీంనగర్ జిల్లాలో పలువురు ఆశా కార్యకర్తలను పోలీసులు ఆదివారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. గన్నేరువరం, చిగురుమామిడి, తిమ్మాపూర్ సహా పలు మండలాల్లో ఆశాలను పోలీసులు స్థానిక స్టేషన్లకు తరలించారు.

గోడలపై రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

గులాబీ ఫ్లెక్సీలను తొలగించడం లేదని నగరపాలక సంస్థ సిబ్బంది చెబుతున్నారు. కానీ కాంగ్రెస్ నేతలు దీన్ని తప్పుబడుతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై మండిపడుతున్నారు.

పురపాలక మంత్రి మాటలు పెడచెవిన..

ఖమ్మంలోని 40, 42తో పాటు పలు డివిజన్లు, ఉమ్మడి జిల్లాలోని వివిధ మున్సిపాల్టీలు, పలు ప్రాంతాల్లో వేసిన కాంగ్రెస్ వాటర్ పెయింటింగ్స్‌ను తొలగించి, గులాబీ వినయిల్ (ఫ్లెక్సీ స్టిక్కర్లు)ను వేస్తున్నారు. ఈ విషయమై ఆయా ప్రాంతాల్లో ఇరు గ్రూపుల మధ్య వివాదం నడుస్తోంది. పరస్పరం దూషించుకుంటున్నారు. అధికారం ఉందనే ఇలా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

మున్సిపల్ అధికారులు కూడా వారికి సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫెక్సీలు, ప్లాస్టిక్ విషయంలో నెలకొంటున్న కాలుష్యంపై పురపాలకమంత్రి కేటీఆర్ మాటలను కూడా కార్పొరేషన్ సిబ్బందితో పాటు బీఆర్ఎస్ శ్రేణులు పెడచెవిన పెడుతున్నాయని కాంగ్రెస్ కార్యకర్తలు విమర్శిస్తున్నారు.

ప్రచార సామగ్రికి భారీగా ఖర్చు..

ప్రచార సామగ్రికి ఆయా పార్టీలు భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. అభ్యర్థులు ఎవరికి వారుగా సోషల్ మీడియా నిర్వహణ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకుంటున్నారు. కొందరు ఏకంగా ఫ్లెక్సీ మిషన్‌లను సైతం కొనుగోలు చేసి, సిబ్బందిని ఏర్పాటు చేసుకుని ప్రింటింగ్ వేయిస్తున్నారు. ప్రధాన మీడియా కన్నా కూడా సోషల్ మీడియాపైనే ఎక్కువ ఆధారపడుతున్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, షేర్‌చాట్ రీల్స్ తయారు చేయించి మరీ చక్కర్లు కొట్టిస్తున్నారు.

ప్రత్యర్థి వైఫల్యాలను ఎండగట్టే రీతిలో ఆసక్తికరమైన మీమ్స్‌ను సైతం రూపొందిస్తున్నారు. ప్రభుత్వ పథకాల్లో లోపాలపై విపక్షాలు దృష్టి సారిస్తుండగా.. విపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు విస్మరించిన అభివృద్ధి పనుల దృశ్యాలను నాడు- నేడుగా అధికారపక్షం ప్రచారం చేస్తున్నది. గడప గడపకు కాంగ్రెస్ రూపంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి, సంక్షేమంపై ప్రచారం చేసుకుంటున్నారు. అలాగే, ఈ తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధిపై బీఆర్ఎస్ ప్రచారం నిర్వహిస్తోంది. కాగా, ఇప్పటి నుంచే ప్రధాన పార్టీలు పడుతున్న ఈ ప్రయాసలపై జనం ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

ముందస్తు అనుమతి అక్కర్లేదు

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగ ధర్మాసనం సోమవారం పునరుద్ఘాటిస్తూ, ఇది తీర్పు ఇచ్చినతేదీ నుంచే కాదు, సీబీఐకి మార్గ నిర్దేశం చేసే ఢిల్లీ ప్రత్యేక పోలీసు వ్యవస్థ (డీఎస్‌పీఈ) చట్టానికి సెక్షన్ 6ఏను జోడించిన తేదీ నాటి నుంచే అంటే 2003 సెప్టెంబరు 11 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించాలని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం పేర్కొంది. సెక్షన్6ఎ ఏం చెబుతోంది? ప్రభుత్వ ఉన్నతాధికారులపై అవినీతి వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరపాలంటే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని అంటోంది.

2014లో డాక్టర్ సుబ్రమణ్యం స్వామి కేసులో సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈ సెక్షన్-6ఏ రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసింది. దీంతో జాయింట్ సెక్రటరీ ఆపై ర్యాంక్ అధికారులను సీబీఐ ప్రాథమికంగా విచారణ జరపాలంటే సీబీఐకి ముందస్తు అనుమతి అవసరం లేదు. అయితే, కోర్టు తీర్పు ఇచ్చిన తేదీ నుంచే అమల్లోకి వస్తుందని, అంతకుముందు నమోదయిన అవినీతి కేసుల్లో ఇరుక్కున్న సీనియర్ బ్యూరోక్రాట్లకు సెక్షన్-6ఏ కింద రక్షణ ఉంటుందని కొందరు వాదించారు. ఈ వాదనలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చిన సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం, ఆ సెక్షన్‌ను ఎప్పుడు చట్టంలో చేర్చారో ఆనాటి నుంచే దాని చెల్లుబాటు రద్దయిందని రద్దు చేస్తున్నట్లుగా వస్తుందని పునరుద్ఘాటించింది. సెక్షన్-6ఎ అనేది రాజ్యాంగంలోని సమానత్వ హక్కుకు హామీ ఇస్తున్న ఆర్టికల్14కి విరుద్ధమని రాజ్యాంగ ధర్మాసనం తేల్చి చెప్పింది.

అవినీతి దేశానికి శత్రువు

అవినీతి దేశానికి శత్రువు. అవినీతికి పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగి (పబ్లిక్ సర్వెంట్) పెద్ద స్థాయిలో ఉన్నాసరే, వారిని అరెస్టు చేయడానికి, శిక్షించడానికి అవినీతి నిరోధక చట్టం-1988ను కచ్చితంగా అనుసరించాలి.

సదరు ప్రభుత్వ ఉద్యోగి హోదా లేదా స్థితి కారణంగా ఆ వ్యక్తికి ఎటువంటి మినహాయింపు ఇవ్వడం సరికాదు. వారు అందరి లాగే నేరం చేసినందున అవినీతి అధికారులను రెండు కేటగిరీలుగా విభజించరాదు. అలా చేయడం 1988 అవినీతి నిరోధకచట్ట లక్ష్యాలకే విరుద్ధం. వీరి విషయంలోనూ సాధారణ విచారణ, దర్యాప్తు క్రమాన్ని అనుసరించాలని 2014 తీర్పులో సుప్రీం పేర్కొంది. సెక్షన్-6ఏ అవినీతి పరులైన సీనియర్ బ్యూరోక్రాట్లను గుర్తించేందుకు ఆటంకం కల్పిస్తోంది. ఇది వారికి ఒక రక్షణ కవచంగా ఉంది అని సుప్రీం ధర్మాసనం ముక్తాయింపు ఇచ్చింది.

పూర్తి కాని ప్రాజెక్టును ప్రారంభిస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో పాలమూరు వలసలు ఆగలేదనీ, అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు నుంచి ఎంపీ గెలిచిన తర్వాత ఆ జిల్లాకు చేసిందేంటని కేసీఆర్‌ను ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి వందలాది మంది అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, రేవంత్, మల్లు రవి, డీసీసీ అధ్యక్షులు జి మధుసుధర్‌రెడ్డి తదితరులు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ సీతా దయాకర్‌రెడ్డి జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే దేవరకద్ర నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్యే దోపిడీ దొంగల కంటే దారుణంగా తయారయ్యారని విమర్శించారు. కాంట్రాక్టులు, కమీషన్లు తప్ప ఎమ్మెల్యేకు దేవరకద్ర అభివృద్ధి పట్టడంలేదన్నారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతలను పడావుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లాలో 14 సీట్లకు 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. సీతక్కను రాజకీయంగా పార్టీ అన్ని రకాలుగా ఆదుకుంటుందని చెప్పారు. నా రాజకీయ ఎదుగుదలలో కొత్తకోట దయాకర్‌రెడ్డి కుటుంబం నాకు అండగా నిలబడిందని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్సీగా గెలిచేందుకు ఆయన అండగా నిలబడ్డారని తెలిపారు. టీడీపీతో టీఆర్ఎస్ పొత్తు పెట్టుకున్నప్పుడు(2009)లో ఎంపీగా కేసీఆర్ గెలువడంలో ఆయన కీలకపాత్ర పోషించారని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా నేతలకు కాంగ్రెస్‌పార్టీ అత్యంత ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.16,17,18న సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఖర్గే, జాతీయ నాయకులు రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు. ఈ నెల 17న తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో జరిగే విజయ భేరికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

అసమానతలకు పరిష్కారమేది?

(మొదటిపేజీ తరువాయి)

ఈ పరిస్థితి కన్పిస్తోందని తెలిపింది. 'జీ-20 సదస్సు సందర్భంగా సుందరీకరణ పేరుతో దేశ రాజధానిలోని అనేక మురికివాడలను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. దీంతో వేలాది మంది పేదలు నిరాశ్రయులయ్యారు. పౌర సమాజ సంస్థల సమావేశాలను కూడా అడ్డుకున్నారు. సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయంతో డిక్లరేషన్‌ను రూపొందించినందుకు భారత ప్రభుత్వానికి అభినందనలు. కానీ, పద్నాలుగు వేల పదాలకు పైగా ఉన్న ఈ డిక్లరేషన్ ప్రపంచ దేశాలను వెంటాడుతున్న సంక్షోభాలపై విశ్లేషణ జరిపి, పరిష్కారాలను సూచించలేకపోయింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ, పర్యావరణ సంబంధమైన అసమానతలు, జీవ వైవిధ్యానికి ఎదురవుతున్న ముప్పు వంటి అంశాలపై డిక్లరేషన్ స్పష్టత ఇవ్వలేదు. నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలను, జీడీపీ కేంద్రీకృత అభివృద్ధి నమూనాను అంచనా వేయడంలో సదస్సు విఫలమైంది. ముదురుతున్న అంతర్జాతీయ సంక్షోభాన్ని పట్టించుకోలేదు. డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం వచ్చినప్పటికీ అందులో జరిగిన జాప్యం అనేక అనుమానాలకు తావిస్తోంది. డిక్లరేషన్ అమలు పైన కూడా మాకు అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే దాని అమలు కోసం నిర్దిష్టమైన, కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక ఏదీ లేదు. స్వతంత్ర జవాబుదారీతనం కానీ, పర్యవేక్షణ యంత్రాంగం కానీ లేవు' అని పీపుల్స్ 20 సంస్థ ఆ ప్రకటనలో విమర్శించింది.

ఆర్థికాభివృద్ధిలో ప్రైవేటు రంగం పాత్రపై జీ-20 సదస్సు అనవసరమైన దృష్టి సారించిందని పీపుల్స్ 20 సంస్థ అభిప్రాయపడింది. దీనివల్ల ప్రభుత్వ విధానాల పైన, ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల పైన కార్పొరేట్ ప్రభావం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. డిక్లరేషన్‌లో పేటెంట్ హక్కుల రద్దు, అంతర్జాతీయ పన్ను వ్యవస్థ, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలలో సంస్కరణలు వంటి కీలక అంశాల ప్రస్తావనే లేదని ఎత్తిచూపింది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన 60 దేశాల రుణాలను రద్దు చేసే విషయంలో చొరవ చూపకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. పౌర సమాజ సంస్థల సిఫార్సులకు డిక్లరేషన్‌లో చోటు కల్పించకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. వివిధ దేశాలలో పెరుగుతున్న సైనిక వ్యయం, ఆయుధ వ్యాప్తి వంటి అంశాలపై సదస్సు దృష్టి సారించలేదని పీపుల్స్ 20 సంస్థ తెలిపింది.

రూ.25 కోట్ల ప్రైజ్‌మనీ

యుఎస్ ఓపెన్ సింగిల్స్ చాంపియన్లు భారీ నగదు బహుమతి సొంతం చేసుకున్నాడు. మెన్స్, ఉమెన్స్ సింగిల్స్ విజేతలకు సమాన నగదు బహుమతి అందిస్తున్న యు.ఎస్ ఓపెన్.. నోవాక్ జకోవిచ్, కొకో గాఫ్‌లకు చెరో రూ.25 కోట్లు అందజేసింది. సింగిల్స్ రన్నరప్‌లు డానియల్ మెద్వదేవ్, సబలెంకలు సైతం చెరో రూ.12.5 కోట్లు ఖాతాలో వేసుకున్నారు.

36లో 24

- మెన్స్ సింగిల్స్ చాంప్ జకోవిచ్
- 36 ఏండ్ల వయసులో 24వ గ్రాండ్ విక్టరీ
- ఫైనల్లో మెద్వదేవ్‌పై ఘన విజయం

యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

సెర్బియా యోధుడు నొవాక్ జకోవిచ్ చరిత్ర సృష్టించాడు. టెన్నిస్ ఓపెన్ శకంలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన మార్గరేట్ కోర్టు రికార్డును సమం చేశాడు. రష్యా స్టార్ డానియల్ మెద్వదేవ్‌పై మెరుపు విజయంతో యు.ఎస్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ చాంపియన్‌గా అవతరించిన జకోవిచ్.. కెరీర్ 24వ గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని అందుకున్నాడు. 36 ఏండ్ల వయసులో 24వ గ్రాండ్‌స్లామ్ విజయం అందుకున్న జకోవిచ్ టెన్నిస్‌లో ఆల్‌టైమ్ రికార్డు టైటిల్‌కు మరో అడుగు దూరంలోనే నిలిచాడు!.

నవతెలంగాణ-న్యూయార్క్

అంచనాలు నిజమయ్యాయి. అద్భుతాలు ఏమీ జరుగలేదు. సెర్బియా స్టార్, రెండో సీడ్ నొవాక్ జకోవిచ్ యు.ఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన మెన్స్ సింగిల్స్ ఫైనల్లో జకోవిచ్ వరుస సెట్లలో టైటిల్ విజయం సాధించాడు. సుమారు మూడున్నర గంటల టైటిల్ పోరులో మూడో సీడ్ డానియల్ మెద్వదేవ్‌పై 6-3, 7-6(7-5), 6-3తో నొవాక్ జకోవిచ్ గెలుపు గర్జన చేశాడు. ఈ విజయంతో యు.ఎస్ ఓపెన్‌లో టైటిల్ నెగ్గిన అతిపెద్ద వయస్కుడిగా జకోవిచ్ రికార్డు నెలకొల్పాడు. 1970లో కెన్ రోస్‌వాల్ 35 ఏండ్ల వయసులో టైటిల్ సాధించగా.. ఇప్పుడు జకోవిచ్ 36 ఏండ్ల వయసులో ఈ ఘనత సాధించాడు. ఇక ఆల్‌టైమ్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల వేటలో టెన్నిస్ దిగ్గజం మార్గరెట్ కోర్టు (24) రికార్డును సైతం జకోవిచ్ సమం చేశాడు. యుఎస్ ఓపెన్ (2021) మాజీ చాంపియన్ డానియల్ మెద్వదేవ్ ఫైనల్లో గట్టిగా ప్రతిఘటించినా రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకోక తప్పలేదు.

జకోవిచ్ జోరు :

రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన నొవాక్ జకోవిచ్.. న్యూయార్క్‌లో ఒక్క విజయంతో రెండు రికార్డులు ఖాతాలో వేసుకున్నాడు. లేటు వయసులో హాట్ ఫామ్‌లో దూసుకెళ్తున్న జకోవిచ్.. రష్యా స్టార్ ఆటగాడు డానియల్ మెద్వదేవ్‌పై వరుస సెట్లలో విజయం అందుకున్నాడు. తొలి సెట్‌ను 6-3తో గెల్చుకున్న జకోవిచ్‌కు రెండో సెట్‌లో మెద్వదేవ్ చుక్కలు చూపించాడు. టైబ్రేకర్‌కు దారితీసిన రెండో సెట్ 104 నిమిషాల పాటు సాగింది. టైబ్రేకర్‌లో 7-5తో పైచేయి సాధించిన జకోవిచ్.. మెద్వదేవ్‌పై మానసికంగా విజయం సాధించాడు. దీంతో కీలక మూడో సెట్లోనూ జకోవిచ్ జోరు కొనసాగించింది. మూడో సెట్‌ను సైతం 6-3తో సొంతం చేసుకున్న జకోవిచ్ కెరీర్ 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకున్నాడు.

టైటిల్ పోరులో జకోవిచ్ 38 విన్నర్లు కొట్టగా, మెద్వదేవ్ 32 విన్నర్లు సంధించాడు. జకోవిచ్ 35 అనవసర తప్పిదాలే చేయగా.. మెద్వదేవ్ ఏకంగా 39 అనవసర తప్పిదాలకు పాల్పడ్డాడు. మెద్వదేవ్ సర్వీను జకోవిచ్ మూడుసార్లు బ్రేక్ చేయగా.. మెద్వదేవ్ ఒకే ఒక్క బ్రేక్ పాయింట్‌తో రేసులో వెనుకంజ వేశాడు. మెద్వదేవ్ 6 ఏస్‌లతో మెరువగా.. జకోవిచ్ 4 ఏస్‌లతో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. పాయింట్ల పరంగా జకోవిచ్ 118-97తో మెద్వదేవ్‌పై పైచేయి సాధించాడు. సొంత సర్వ్‌లో మెద్వదేవ్ 11 గేములు గెల్చుకోగా.. జకోవిచ్ 15 గేములు సొంతం చేసుకున్నాడు.


ఆల్‌టైమ్ గ్రేట్! : యుఎస్ ఓపెన్ ట్రోఫీతో నొవాక్ జకోవిచ్

చరిత్రపై కన్నేసి..! :

'ప్రపంచాన్నే జయించినట్టుగా అనిపిస్తుంది. ఇప్పటికీ ఓ బాలుడిగా నేను స్వప్నించిన ఆటనే ఆడుతున్నాను. ఈ స్థాయిలో నిలుస్తానని ఎన్నడూ ఊహించలేదు. కానీ గత రెండేండ్లుగా చరిత్రపై ఎందుకు గురి పెట్టకూడదని అనుకున్నాను. టైటిళ్లు అందుబాటులో ఉండగా.. ఎందుకు అందుకోకూడదని భావించాను. ఈ ఏడాది వింబుల్డన్ నెగ్గలేదనే పశ్చాత్తాపం నాలో ఏమాత్రం లేదు. నిజానికి నా ఆట తీరు పట్ల ఎంతో సంతోషంగా ఉన్నాను' అని రికార్డు గ్రాండ్‌స్లామ్ విజయం అనంతరం జకోవిచ్ అన్నాడు. రఫెల్ నాదల్ 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల రికార్డును అధిగమించిన జకోవిచ్.. ఈ ఏడాది వింబుల్డన్‌లో యువ సంచలనం అల్కారాస్‌కు గ్రాస్‌కోర్టు గ్రాండ్‌స్లామ్ కోల్పోయాడు. ఈ ఏడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఏకంగా మూడింట విజయాలు నమోదు చేసిన నొవాక్ జకోవిచ్.. వచ్చే ఏడాది జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ వేదికగా ప్రపంచ టెన్నిస్ చరిత్రలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన ఘనత దక్కించుకునేందుకు సిద్ధమవుతున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జకోవిచ్ ఇప్పటికే 10 టైటిళ్లు సాధించి చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే.


పోరాడినా.. : రన్నరప్ ట్రోఫీతో డానియల్ మెద్వదేవ్

శతక తాండవం

- కోహ్లి, రాహుల్ అజేయ సెంచరీలు
- భారత్ 356/2

పాకిస్థాన్‌పై శతక తాండవం. బ్యాటింగ్ మాస్టర్ విరాట్ కోహ్లి (122 నాటౌట్), కెఎల్ రాహుల్ (111 నాటౌట్) అజేయ సెంచరీలతో చెలరేగారు. భీకర పాకిస్థాన్ బౌలింగ్ బృందంపై దండయాత్ర చేసిన కోహ్లి, రాహుల్.. కొలంబోలో పరుగుల వరద పారించారు. ఆదివారం రోహిత్, గిల్ అదరగొట్టగా.. సోమవారం విరాట్, రాహుల్ విధ్వంసం సృష్టించారు. భారత టాప్-4 బ్యాటర్ల మెరుపులతో భారత్ 356/2 పరుగుల భారీ స్కోరు చేసింది.

నవతెలంగాణ-కొలంబో


కెఎల్ రాహుల్ (111)

భారత బ్యాటర్లు విధ్వంసక శతకాలు నమోదు చేశారు. విరాట్ కోహ్లి (122 నాటౌట్, 94 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులు), కెఎల్ రాహుల్ (111 నాటౌట్, 106 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సులు) అజేయ సెంచరీలతో కదం తొక్కారు. వర్షం అంతరాయం కలిగిన భారత్, పాకిస్థాన్ ఆసియా కప్ సూపర్4 మ్యాచ్‌లో రిజర్వ్ డే బ్యాటింగ్‌కు వచ్చిన విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ జోడీ పాకిస్థాన్ బౌలింగ్‌ను చీల్చిచెండాడింది. మూడో వికెట్‌కు అజేయంగా 194 బంతుల్లో 233 పరుగులు జోడించిన కోహ్లి, రాహుల్ భారత్‌కు భారీ స్కోరు అందించారు. రిజర్వ్ డే ఆటలో 25.5 ఓవర్లు చెమటోడ్చినా.. పాకిస్థాన్ బౌలర్లకు వికెట్ దక్కలేదు. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (58, 52 బంతుల్లో 10 ఫోర్లు), రోహిత్ శర్మ (56, 49 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సులు) అర్ధ సెంచరీలు సాధించిన సంగతి తెలిసిందే.

శతక గర్జన

ఆసియా కప్ గ్రూప్ దశ మ్యాచ్‌లో భారత టాప్-4 బ్యాటర్లు విఫలమవగా.. తాజాగా సూపర్4 మ్యాచ్‌లో టాప్-4 బ్యాటర్లే విరుచుకుపడ్డారు. తొలుత ఓపెనర్లు రోహిత్, గిల్ 121 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. కొత్త బంతితో పాక్ పేస్ త్రయం షహీన్, నసీం, రవూఫ్‌లపై ఎదురుదాడి చేసిన ఓపెనర్లు 100 బంతుల్లోనే 121 పరుగులు జోడించి భారీ స్కోరుకు గట్టి పునాది వేశారు. స్వల్ప విరామంలో ఓపెనర్లు నిష్క్రమించినా, వరుణుడి అంతరాయంతో ఆదివారం రోజు ఆట సోమవారానికి వాయిదా పడినా.. విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ శతక తాండవం నుంచి పాకిస్థాన్ తప్పించుకోలేకపోయింది. తొలుత కోహ్లి ఆచితూచి ఆడగా.. కెఎల్ రాహుల్ కాస్త దూకుడు ప్రదర్శించాడు. సోమవారం ఆటలో కోహ్లి దూకుడుగా ఆడగా.. రాహుల్ నెమ్మదిగా పరుగులు సాధించాడు. రాహుల్ ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 60 బంతుల్లో అర్ధ సెంచరీ నమోదు చేయగా.. విరాట్ కోహ్లి నాలుగు ఫోర్లతో 55 బంతుల్లో అర్ధ సెంచరీ అందుకున్నాడు. ఫిఫ్టీ తర్వాత విరాట్ కోహ్లి గేర్ మార్చాడు. వేగంగా పరుగులు పిండుకున్నాడు. వికెట్ల మధ్య చురుగ్గా పరుగులు తీశాడు. ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 84 బంతుల్లోనే వన్డేల్లో కెరీర్ 47వ సెంచరీ నమోదు చేశాడు. ఇక వన్డేల్లో వేగంగా 13000 పరుగులు సాధించిన బ్యాటర్‌గా సైతం కోహ్లి రికార్డు నెలకొల్పాడు. మరో ఎండ్‌లో ఈ ఏడాది మే 1 తర్వాత తొలిసారి ఆడుతున్న కెఎల్ రాహుల్ రీ ఎంట్రీ ఘనంగా చాటాడు. పది ఫోర్లు, రెండు సిక్సర్లతో 100 బంతుల్లో 100 పరుగుల మైలురాయి చేరుకున్నాడు. పాక్ స్పిన్నర్లు, పేసర్లను దంచికొట్టిన ఈ జోడీ.. మూడో వికెట్‌కు అజేయంగా 233 పరుగులు జోడించింది. చివరి ఓవర్లో రెండు ఫోర్లు, ఓ సిక్సర్ సంధించిన విరాట్ కోహ్లి భారత ఇన్నింగ్స్‌కు పర్‌ఫెక్ట్ ముగింపు అందించాడు. పాక్ బౌలర్లలో షహీన్ షా అఫ్రిది (1/79), షాదాబ్ ఖాన్ (1/71) చెరో వికెట్ పడగొట్టారు.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) ఫహీం (బి) షాదాబ్ 56, గిల్ (సి) సల్మాన్ (బి) షహీన్ 58, విరాట్ కోహ్లి నాటౌట్ 122, కెఎల్ రాహుల్ నాటౌట్ 111, ఎక్స్‌ట్రాలు : 9, **మొత్తం :(50 ఓవర్లలో 2 వికెట్లకు) 356.**

వికెట్ల పతనం : 1-121, 2-123.

బౌలింగ్ : షహీన్ 10-0-79-1, నసీం 9.2-1-53-0, ఫహీం 10-0-74-0, రవూఫ్ 5-0-27-0, షాదాబ్ 10-1-71-0, ఇఫ్తికార్ 5.4-0-52-0.


విరాట పర్వం : వన్డేల్లో 47వ సెంచరీ బాదిన కోహ్లి (122).. వేగంగా 13000 పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు.

చీఫ్ కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్

ఆసియాలో క్వార్టర్స్ నుంచి బరిలోకి..

ముంబయి : 2023 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత మెన్స్ క్రికెట్ జట్టుకు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ చీఫ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. మహిళల జట్టుకు హృసికేశ్ కనిట్కర్ చీఫ్ కోచ్‌గా బాధ్యతలు తీసుకోనున్నాడు. ఈ మేరకు బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. మెన్స్ జట్టుకు సాయిరాజ్ బహుతులె, మునీశ్ బాలిలు బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లుగా ఉండగా.. రజిబ్ దత్తా, సుబాదీప్ ఘోష్‌లు మహిళల జట్టుకు బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లు సేవలు అందించనున్నారు. ఆసియా క్రీడల్లో భారత క్రికెట్ జట్లు నేరుగా క్వార్టర్‌ఫైనల్స్ నుంచి బరిలోకి దిగుతున్నాయి. ఐదు రోజుల వ్యవధిలోనే భారత జట్టు మూడు



మ్యాచులు ఆడాల్సి ఉంటుంది!. మెన్స్ జట్టు అక్టోబర్ 3న క్వార్టర్స్‌లో, అక్టోబర్ 5న సెమీస్‌లో నెగ్గితే..అక్టోబర్ 7న ఫైనల్స్ ఆడనుంది. మహిళల జట్టు సెప్టెంబర్ 21న క్వార్టర్స్, 23న సెమీస్.. టైటిల్ పోరుకు చేరితే 25న ఫైనల్లో తలపడనుంది.

పేసర్ల వర్క్‌లోడ్ ఎలా?!

- నేడు శ్రీలంకతో భారత్ ఢీ
- మధ్యాహ్నం 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



నవతెలంగాణ-కొలంబో : ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే తొలిసారి భారత జట్టు వరుసగా మూడు రోజుల పాటు వైట్‌బాల్ ఫార్మాట్‌లో ఆడబోతుంది!. భారత్, పాకిస్థాన్ సూపర్ 4 సమరం రెండు రోజుల పాటు సాగగా.. మరుసటి రోజే శ్రీలంకతో సూపర్ 4 పోరుకు టీమ్ ఇండియా సిద్ధమైంది. విరామం లేకుండా వరుస వన్డే మ్యాచులతో.. భారత పేసర్ల పని భారంపై ఫోకస్ కనిపిస్తుంది. జస్‌ప్రీత్ బుమ్రా ఇప్పుడిప్పుడే గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చాడు. దీంతో అతడిని వరుసగా రెండు మ్యాచుల్లో బరిలోకి నిలుపుతారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. బుమ్రా స్థానంలో మహ్మద్ షమిని తుది జట్టులోకి తీసుకుంటారేమో చూడాలి. సిరాజ్‌కు సైతం విశ్రాంతి లభిస్తే..ప్రసిద్ కృష్ణకు అవకాశం లభించవచ్చు. బ్యాటింగ్ లైనప్‌లో టాప్-6 బ్యాటర్లు భీకర ఫామ్‌లో ఉన్నారు. రోహిత్, గిల్, విరాట్, రాహుల్, కిషన్, హార్దిక్‌లను నిలువరించటం శ్రీలంకకు నేడు కత్తి మీద సామే కానుంది. సూపర్4లో గత మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై గెలుపొందిన శ్రీలంక.. టైటిల్ ఫేవరేట్ భారత్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది.

పుష్ప 2.. రిలీజ్ డేట్ ఫిక్స్


అల్లు అర్జున్

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పుష్ప' ది రైజ్.. ఎంతటి సంచలన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. 2021 బిగ్గెస్ట్ కమర్షియల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. అంతేకాదు అల్లు అర్జున్ కెరీర్‌లోనే అతిపెద్ద విజయంగా నిలవడంతోపాటు.. తనకు జాతీయస్థాయి అవార్డు తెచ్చి పెట్టిన చిత్రంగానూ నిలిచింది. దీంతో దీనికి సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న 'పుష్ప ద రూల్' చిత్రం పై భారీ అంచనాలు పెరిగాయి. ఎప్పుడెప్పుడు ఈ సినిమా విడుదలవుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు సోమవారం చిత్ర యూనిట్ గుడ్ న్యూస్ అందించింది. వచ్చే ఏడాది స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఆగస్టు 15న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. మైత్రి మూవీ మేకర్స్ అసోసియేషన్ విత్ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి నవీన్ ఏర్నేని, వై రవిశంకర్ నిర్మాతలు.

దీపావళి కానుకగా విడుదల


రాఘవ లారెన్స్

దర్శక, నిర్మాత కార్తీక్ సుబ్బురాజ్ డైరెక్షన్‌లో స్టోన్ బెంచ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై కార్తికేయన్ నిర్మిస్తున్న చిత్రం 'జిగర్ తండా డబుల్ ఎక్స్'. రాఘవ లారెన్స్, ఎస్.జె.సూర్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హై యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్ర టీజర్‌ను సోమవారం హీరో మహేష్‌బాబు రిలీజ్ చేయగా, తమిళ టీజర్‌ను ధనుష్, కన్నడ టీజర్‌ను రక్షిత్ శెట్టి, మలయాళ టీజర్‌ను దుల్కర్ సల్మాన్ రిలీజ్ చేశారు. అన్ని భాషల్లో టీజర్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే చిత్రీకరణను పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసుకునే పనిలో ఉంది. దీపావళికి సినిమాను రిలీజ్ చేయబోతున్నారు.


స్వాతి రెడ్డి

నవీన్ చంద్ర, స్వాతి రెడ్డి జంటగా నటించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. దర్శకుడు శ్రీకాంత్ నాగోతి ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించగా, యశ్వంత్ ములుకుట్ల క్రిషివ్ ప్రొడక్షన్స్, హ్యాండ్‌పిక్డ్ స్టోరీస్ బ్యానర్‌పై దీనిని నిర్మిస్తున్నారు. దీనికి సుమంత్ దామ సహ నిర్మాత, రఘువర్మ పేరూరి ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

ఆ నిజం ధైర్యాన్నిస్తుంది

ఈ సినిమా అక్టోబర్ 6న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా స్వాతి రెడ్డి మాట్లాడుతూ, 'మాకు తెలిసిన నిజాన్ని ఇందులో నిజాయితీగా చెప్పాం. ఆ నిజం ధైర్యం ఇచ్చేలా ఉంటుంది' అని తెలిపారు.'మేము ఎంత ప్యాషనేట్‌గా తీశామో.. ప్రేక్షకులకు కూడా అంతే చక్కగా రీచ్ అవుతుందనే నమ్మకం ఉంది' అని దర్శకుడు చెప్పారు.



ప్రేక్షకుల్ని నవ్వించే సినిమా

రవితేజ ప్రొడక్షన్ బ్యానర్ ఆర్‌టి టీమ్‌వర్క్స్ నుంచి వస్తున్న మరో కాన్సెప్ట్ బేస్డ్ చిత్రం 'ఛాంగురే బంగారురాజా'. సతీష్ వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఫ్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్‌తో కలిసి రవితేజ నిర్మిస్తున్నారు. కార్తీక్ రత్నం, గోల్డీ నిస్సీ జంటగా నటిస్తున్నారు. ఈనెల 15న వినాయక చవితి సందర్భంగా ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ట్రైలర్‌ని లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ,'సతీష్ కథ చెబుతున్నపుడు దర్శకుడు పాత వంశీ గుర్తుకు వచ్చారు. అలాంటి హ్యూమర్, ఈస్ట్ గోదావరి వెటకారం, కథ ఇవన్నీ నాకు బాగా నచ్చాయి. మొదటి నుంచి సినిమా పై చాలా నమ్మకం ఉంది' అని తెలిపారు. 'రెండు గంటల సినిమాలో గంటన్నర ఖచ్చితంగా నవ్వుకుంటారు. ఫ్యామిలీతో పాటు చూసే క్లీన్ ఎంటర్ టైనర్ చేశాం' అని డైరెక్టర్ సతీష్ వర్మ చెప్పారు.

సామాన్యుడి పోరాటం

డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'పెదకాపు-1'. విరాట్ కర్ణ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని ద్వారకా క్రియేషన్స్‌పై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 29న విడుదల కానున్న నేపథ్యంలో సోమవారం ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను డైరెక్టర్ వివి వినాయక్, నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ లాంచ్ చేయగా, మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్, మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి అతిథులుగా విచ్చేసి, చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.


విరాట్‌కర్ణ, ప్రగతి శ్రీ వాస్తవ

ఈ ఈవెంట్‌లో వివి వినాయక్ మాట్లాడుతూ, 'ట్రైలర్ చాలా బావుంది. సినిమా అద్భుతంగా వుంటుంది. రవీందర్ రెడ్డి ఎక్కడా రాజీపడకుండా నిర్మిస్తున్నారు' అని తెలిపారు. 'ఈ సినిమాకి ఓ మంచి ఉద్దేశంతో సామాన్యుడి సంతకం అని పెట్టాను. ఒక సామాన్యుడ్ని తెరమీద కొన్ని కోట్లమంది చూసుకొని, ఆ సామన్యుల తరపున నిలబడే ఒక పాత్రని మలిచినదే ఈ పెదకాపు 1' అని దర్శకుడు అన్నారు.

డెవిల్‌లో నైషధ..

నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ పీరియాడిక్ స్పై థ్రిల్లర్ 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' అనేది ట్యాగ్ లైన్. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంలో కళ్యాణ్ రామ్ జోడీగా సంయుక్త నటిస్తోంది. సోమవారం ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రంలో సంయుక్త పోషించిన నైషధ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

పాన్ ఇండియా లెవల్లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను నవంబర్ 24న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు.

ఈ చిత్రంలో ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని ఛేదించే బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా కళ్యాణ్ రామ్ ఆకట్టుకోబోతున్నారు.


సంయుక్త

నవచిత్రం

సరికొత్త విశాల్‌ని చూస్తారు



విశాల్ హీరోగా, రీతూ వర్మ హీరోయిన్‌గా నటించిన చిత్రం'మార్క్ ఆంటోని'. పాన్ ఇండియా మూవీగా రూపొందిన ఈ సినిమాను మినీ స్టూడియో బ్యానర్‌పై అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఎస్.వినోద్ కుమార్ నిర్మించారు. ఎస్.జె.సూర్య, సెల్వ రాఘవన్, సునీల్ ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈనెల 15న రిలీజ్ కాబోతోన్న ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది.

హీరో నితిన్ మాట్లాడుతూ,' ఈ చిత్ర ఫస్ట్ లుక్, టీజర్, ట్రైలర్ అన్నీ క్రేజీగా ఉన్నాయి. సినిమా కచ్చితంగా సక్సెస్ అవుతుంది. అధిక్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. విశాల్ ఈ మూవీతో మరో స్థాయికి వెళ్లాలి' అని తెలిపారు.

'నా కెరీర్‌లోనే ఇది భారీ బడ్జెట్ చిత్రం. వేణు ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. నన్ను నమ్మి ఈ సినిమాను తీసుకున్న నిర్మాత, డిస్ట్రిబ్యూటర్లందరికీ థ్యాంక్స్. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. అంతేకాదు ఆడియెన్స్ పెట్టే డబ్బులకు న్యాయం జరుగుతుంది. రెండున్నర గంటలు నవ్వుకునేలా సినిమా ఉంటుంది' అని హీరో విశాల్ చెప్పారు. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ మాట్లాడుతూ, 'ఇది తండ్రీ కొడుకుల కథ. విశాల్ కెరీర్ బెస్ట్ పర్ఫామెన్స్ ఇచ్చారు. అంతేకాదు ఆయనలోని పరిపూర్ణమైన నటుడ్ని చూస్తారు' అని అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886